

శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


**18 శాతానికి టారిఫ్‌లు తగ్గింపు**

భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గుడ్‌న్యూస్
సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ప్రకటన
హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

08


సంపుటి 28, సంచిక: 222 | మంగళవారం | 03-02-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00





సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



# అక్రమమార్గాలు ఎంచుకుంటే ఎవరికైనా
# విచారణ తప్పదు




- ప్రజాస్వామ్య బద్ధంగా నేరాలను విచారించవద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదు
- మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్య
- 'జాతిపిత' అని వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారు
- శిబూసోరెన్‌తో పాటు లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, యెడ్యూరప్ప కూడా విచారణ ఎదుర్కొన్నారు
- పేదల కోసం 500 ఎకరాల భూమిని ప్రజలకు పంచిపెట్టిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి
- 60 ఏళ్లు వచ్చాక ఆయన రాజకీయ పదవులను వదులుకున్నారు
- కెసిఆర్ ఏం త్యాగం చేశారు
- పదవులను వారి కుటుంబం పంచుకుంది
- వేల కోట్లు సంపాదించుకున్న వాళ్లు జాతిపిత ఎలా అవుతారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలదీత

**సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానం**

ప్రజాపక్షం/హైదరాబాద్

అధికారంలో ఉండి అక్రమమార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్య బద్ధంగా విచారణ ఎదుర్కోక తప్పదని, నేరాలను విచారించ వద్దని రాజ్యాంగంలో ఎక్కడా లేదని ప్రధాన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం పోరాడిన శిబూసోరెన్‌తో పాటు లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, యెడ్యూరప్పలు విచారణ ఎదుర్కోలేదా? అని గుర్తు చేశారు. సిట్ విచారణ నేపథ్యంలో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. పేద ప్రజల కోసం ఉద్యమాలు నిర్మించిన రావి తరువాయి 2లో



పద్మవిభూషణ్ రావి నారాయణ రెడ్డి

# అపరిమితమైన భావ ప్రకటనస్వేచ్ఛ
# ఎక్కడా అనుమతి లేదు

- జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్పష్టీకరణ
- 'భారత రాజ్యాంగం-భావప్రకటన స్వేచ్ఛ' అంశంపై రావి నారాయణరెడ్డి స్మారకోపాన్యాసం చేసిన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి
- యుగ పురుషుడు 'రావి' అవార్డు నాకు ఎంతో ప్రత్యేకతని వెల్లడి



ఏ దేశంలోనూ, ఏ రాజ్యాంగలోనూ అపరిమితమైన భావ ప్రకటన స్వేచ్ఛను అనుమతించలేదని, ఇందుకు హామీ కూడా ఇవ్వలేదని జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు అని, అదే సమయంలో స్వీయ నియంత్రణ కూడా ఉండాలని హెచ్చరించారు. స్వీయ నియంత్రణ పాటించకపోతే ప్రభుత్వమే రంగ ప్రవేశం చేస్తుందని, ముఖ్యమంత్రి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, అప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ఘటన ప్రమాదకరాన్ని కొనితెచ్చుకోవడమేనని, అదే సమయంలో ప్రభుత్వానికి కూడా పరిమితులు ఉంటాయని హితవు పలికారు.పద్మవిభూషన్ రావి నారాయణ స్మారక జాతీయ అవార్డును సిఎం చేతుల మీదుగా జస్టిస్ తరువాయి 2లో



## ప్రజలు కోరుకున్న మార్పు చూపించాం

- సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన
- ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దడం ద్వారా ప్రజలు కోరుకున్న మార్పు చూపించి వారి విశ్వాసాన్ని నిలబెట్టుకున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరువాయి 12లో

# లోక్‌సభలో రగడ

- ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాన్ని ప్రస్తావించిన రాహుల్‌గాంధీ
- రాజ్‌నాథ్, అమిత్‌షా అభ్యంతరం

**న్యూఢిల్లీ :** భారత్–చైనా మధ్య 2020లో నెలకొన్న లద్దాఖ్ ప్రతిష్టంభనపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించి ఒక మ్యాగజైన్ ప్రచురించిన కథనాన్ని కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. దీంతో సభలో గందరళగోళం ఏర్పడింది. రాహుల్ ప్రస్తావిస్తున్న పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు సభను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్‌గాంధీ మాట్లాడారు. ముందుగా జాతీయవాదంపై కాంగ్రెస్‌పై గత స్పీకర్, బిజెపి ఎంపి తేజస్వి సూర్య చేసిన ఆరోపణలకు తాను మొదట స్పందించాలనుకుంటున్నానన్నారు. అదే విధంగా 2020లో జరిగిన భారతదేశంచైనా వివాదం గురించి జనరల్ నరవాణే 'జ్ఞాపకార్థం'లో పేర్కొన్న దాని నుండి రాహుల్ కొన్ని వ్యాఖ్యలను ఉటంకించే ప్రయత్న చేశారు. అయితే, రాజ్‌నాథ్ సింగ్ దీనిని తీవ్రంగా నిరసిస్తూ, పుస్తకం ప్రచురించబడిందా లేదా అని స్పష్టం చేయాలని రాహుల్‌గాంధీని కోరారు. సభ కార్యకలాపాలకు సంబంధం లేని విషయంపై ఏ పుస్తకం లేదా వార్తాపత్రిక క్లిప్పింగ్‌ను ఉటంకించలేమని స్పీకర్ ఓం బిర్లా పదే పదే చెప్పడంతో, ఆ పత్రం ప్రామాణీకరించబడిందని, దాని నుండి తాను కోట్ చేయగలనని గాంధీ పట్టుబట్టడంతో దాదాపు 50 నిమిషాల పాటు గందరగోళం చెలరేగింది. ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... రాహుల్‌గాంధీ చైనాపై 'కల్పిత విషయాలు' చదువుతున్నాడు. భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తరువాయి 2లో



## భద్రతపై మాట్లాడనీయరేం?

దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడుతోందనేవి తాను చెప్పే మాటలు కాదని.. స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాశారని అన్నారు. ఈ పుస్తకం బయటకు వస్తే అసలు విషయాలు ప్రజలకు తెలిసిపోతాయనే భయంతో ఆ పుస్తక ప్రచురణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. లోక్‌సభ వాయిదా పడిన అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలన్నీ చెబుతాననే భయంతో తనను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు.



## హైదరాబాద్ టు బెంగుళూరు ఇక 2 గంటలే

- రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రికార్డు స్థాయిలో నిధుల కేటాయింపు
- 2026- 27కు రూ.5,454 కోట్ల మంజూరు
- హైదరాబాద్ నుంచి మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు
- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో రికార్డు స్థాయిలో నిధులు కేటాయించిందని,2026–27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు రూ.5,454 కోట్ల రైల్వే బడ్జెట్ మంజూరైనట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లోని రైల్వే కేటాయింపులపై సోమవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ఈ సమావేశానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తరువాయి 12లో



## పత్తి కొనుగోళ్లలో కుంభకోణం

- 37 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్‌ల సస్పెన్షన్
- కొనుగోళ్ల వ్యవహారంలో మార్కెటింగ్ శాఖ చర్యలు

ప్రజాపక్షం/హనుమకొండ

సిసిఐ గత సంవత్సరం తాత్కాలిక రిజిస్ట్రేషన్ కొనుగోళ్ల వ్యవహారంలో మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లపై వేటు వేశారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో గతంలోనే వరంగల్ మార్కెట్‌తో సహా ఏడుగురు కార్యదర్శులను సస్పెండ్ చేయగా ప్రభుత్వం మరో 37 మంది డిఎఒలను సస్పెండ్ చేయడం ఆ శాఖలో ప్రకంపనలు సృష్టిస్తుంది. గత సంవత్సరం విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం ఆశాఖ వివరాలు ఇవ్వడంతో మరో 17 మంది కార్యదర్శులకు కూడా నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. గత సంవత్సరం సిసిఐ పత్తి కొనుగోళ్ల సమయంలో మార్కెట్‌లో తాత్కాలిక పర్మిషన్లను ఇచ్చారు. రైతుల పేరుమీద అధికారులు, దళారులు ఈ కొనుగోళ్లను చేశారు. ఈ వ్యవహారంలో వరంగల్ తరువాయి 2లో



02

## ఎన్నికల్లో పోటీ కోసం కూతుర్ని చంపిన తండ్రి

- ముగ్గురు పిల్లలు ఉంటే అనర్హత వేటు పడుతుందనే ఘాతుకం
- నిందితుల అరెస్టు
- నిజామాబాద్ జిల్లాలో ఘటన

## అలీ ఖమేనీ హెచ్చరిక నిజమో కాదో తేల్చుకుంటాం

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్**



**పామ్‌బీచ్ :** ఇరాన్‌పై దాడి చేస్తే అది ప్రాంతీయ యుద్ధంగా మారుతుందని అయొతొల్లా అలీ ఖమేనీ ఫిబ్రవరి ఒకటో తేదీన చేసిన హెచ్చరికపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో అణుఒప్పందం కుదురుతుందని తాము ఆశాభావంతో ఉన్నామని, ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఖమేనీ చేసిన హెచ్చరిక నిజమో కాదో తేల్చుకుంటామన్నారు. సోమవారం ఉదయం ఆయన పామ్‌బీచ్‌లోని మార్ ఏ లాగో నివాసంలో పాత్రికేయులతో మాట్లాడారు. అమెరికా వద్ద ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన, అతిపెద్ద యుద్ధ నౌకలు ఉన్నాయని, ఈ నౌకలను ఇప్పటికే అరేబియా సముద్రంలో మోహరించి ఉన్నాయని, ఇరాన్‌కు కొద్ది గంటల తరువాయి 12లో



## చైనాలో మరో నలుగురు మాఫియా నేరస్థులకు ఉరిశిక్ష

**బీజింగ్:** మయన్మార్ కేంద్రంగా చేసుకున్న చైనా ఈశాన్య సరిహద్దు ప్రాంతాలలో అనేక నేరాలకు పాల్పడుతున్న బాయి కుటుంబానికి చెందిన పేరుమోసిన నలుగురు నేరస్థులకు చైనా ప్రభుత్వం సోమవారం ఉరిశిక్ష అమలు చేసింది. దీంతో వారం రోజుల వ్యవధిలోనే ఈ విధంగా ఉరిశిక్షకు గురైనా మాఫియా ముఠా కుటుంబీకుల సంఖ్య 15కు చేరుకుంది. ఉద్దేశపూర్వక హత్యలు, టెలికాం మోసాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వ్యభిచార గృహాల నిర్వహణ, బెదిరింపులు, కేసినో, జూద గృహాల నిర్వహణ వంటి కేసులో గత ఏడాది నవంబరులో విచారణ సందర్భంగా వీరందరినీ నేరస్థులుగా నిర్ధారించారు. కాగా ఈ కేసులలో మరో ప్రధాన నేరస్థుడు బాయి సుయోచెంగ్ తీవ్ర ఆనారోగ్యం కారణంగా సోమవారం మరణించాడని జిన్హువా వార్తాసంస్థ ప్రకటించింది. ఇతడితోపాటు బాయి ఇంగ్‌కాంగ్, యాంగ్ లికియాంగ్, హూ జియావో జియాంగ్, చెన్ గువాంగీలకు మరణశిక్ష విధించగా వీరిలో సుయోచెంగ్ అనారోగ్యంతో మరణించాడు. మిగిలినవారిని ఉరి తీశారు. గాంగ్‌డాంగ్ రాష్ట్రంలోని షెన్‌ఝెన్ ఇంటర్మీడియట్ పీపుల్స్‌కోర్టు వారిని విచారించి శిక్షలు విధించింది. జనవరి 29వ తేదీన మొదటి విడతగా 11 మందికి ఉరిశిక్షలు అమలు చేశారు. చైనా–మయన్మార్ మధ్య 2,129 కి.మీ పొడవునా సరిహద్దులున్నాయి. ఈ సరిహద్దు ప్రాంతాల్లో మింగ్, బాయి కుటుంబాలవారు హత్యలు, అక్రమాలు, మోసాలు, జూదం, వ్యభిచార గృహాలు వంటి అనేక నేర కేంద్రాలతో మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మయన్మార్ ప్రభుత్వం ఈ కుటుంబీకులను పట్టుకుని చైనాకు స్వాధీనం చేసింది.

## ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో బయటకొస్తున్న పెద్దల జాతకాలు

## లేబర్‌పార్టీ నాయకుడు మాండెల్సన్ రాజీనామా



**లండన్ :** అమెరికా ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ రహస్య పత్రాలు, వీడియోలు, ఫొటోలు తీవ్ర ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. బ్రిటన్ లేబర్‌పార్టీ నాయకుడు, అమెరికాలో బ్రిటన్ మాజీ దౌత్యవేత్త లార్డ్ మాండెల్సన్ తన పదవికి రాజీనామా చేశారు. బ్రిటన్‌లో ప్రతిపక్షాలు ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రిన్స్ ఆంద్రూ జాతకం అందరికీ బట్టబయలైంది. బిల్‌క్లింటన్, ట్రంప్, ఎలాన్‌మస్క్‌లు కూడా బాధితులుగా ఉండటంతో వారు కూడా కొత్తగా దుర్భిణీ పరిధిలోకి వచ్చారు. అదేవిధంగా నార్వే యువరాణి మెట్టేమారిట్ పేరు కూడా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కొన్ని వందలసార్లు కనిపించింది. ఈ విషయంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై నార్వే ప్రధానమంత్రి జోనాస్ స్పందించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆమెకున్న సంబంధాలపై సమాధానం చెప్పాలని నిలదీశారు. కాగా, ఇక నా వల్ల ఎవ్వరూ ఇబ్బంది పడకూడదని, గతంలో తనకున్న సంబంధాలవల్ల పార్టీ ప్రతిష్ఠ దిగజారకూడదనే ఉద్దేశంతోనే లేబర్‌పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లార్డ్ మాండెల్సన్ ప్రకటించారు. ఎప్‌స్టీన్‌తో ఆయనకున్న సంబంధాలు గతంలోనే వెలుగుచూశాయి. దీంతో ఆయన అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్త పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు సాక్ష్యాధారాలవల్ల పార్టీకి రాజీనామా చేశారు. 2003,2004 సంవత్సరాలలో మాండెల్సన్‌కు జెఫ్రీ ఎప్‌స్టీన్ నుండి మూడు విడతలుగా 25,000 పౌండ్ల వంతున నగదు ముట్టిందని ఎప్‌స్టీన్ పత్రాల్లో బహిర్గతమైంది. ఐతే ఈ విషయం గురించి మాండెల్సన్‌ను అడిగినప్పుడు డబ్బు విషయం తనకు తెలియదన్నారు. అవన్నీ అబద్ధాలన్నారు. ఐనాగానీ తిరిగి తాను వ్యక్తిగతంగా ఈ విషయాలన్నింటినీ పరిశీలిస్తానన్నారు. లేబర్ పార్టీకి ఆయన సమర్పించిన రాజీనామా లేఖలో ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపట్ల విచారం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలకు ఆయన క్షమాపణలు తెలియజేశారు.

జపాన్ పర్యటన ముగించుకుని లండన్ తిరిగి వస్తూ బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల బాధితుల గురించి మాట్లాడుతూ ఎవ్వరైనా సరే ఈ విషయంలో తమకు తాముగా బాధ్యత వహించాలని, ఈ విషయంలో వారికి తెలిసిన వివరాలను సంబంధిత చట్ట వ్యవస్థలకు తెలియజేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. చట్టానికి ప్రిన్స్ ఆంద్రూ సహకరించాలని, ఎప్‌స్టీన్ గురించి తనకు తెలిసిన కొత్త సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని కీర్ స్టార్‌మర్ కోరారు. కాగా, మాండెల్సన్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని లేబర్‌పార్టీ నాయకులు వాదిస్తుండగా,ప్రధానమంత్రి స్టార్‌మర్ త్వరగా ఆయనపై చర్యలు తీసుకోవాలని కన్జర్వేటివ్ పార్టీ నాయకులు కోరుతున్నారు.

### అప్రదిష్ఠపాలైన ఎలిజిబెత్–2 కుమారుడు

### ఎప్‌స్టీన్ చేతికి ఆంద్రూ కుమార్తెల ఫొటోలు



మరణించిన బ్రిటన్ రాణి ఎలిజిబెత్–2 మూడో సంతానం, ఆమె రెండో కుమారుడు ప్రిన్స్ ఆంద్రూ..డ్యూక్ ఆఫ్ యోర్క్, ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల కావడంతో తీవ్రస్థాయిలో అప్రదిష్ఠపాలయ్యారు. ప్రిన్స్ ఆద్రూ పూర్తి పేరు ఆంద్రూ ఆల్బర్ట్ క్రిస్టియన్ ఎడ్వర్డ్ మౌంట్‌బాటెన్ విండ్సార్ (66). ఇప్పటికే ఆయనకు ఎప్‌స్టీన్‌తో ఉన్నసంబంధాలు బయటపడ్డాయి. ఎప్‌స్టీన్‌ను ఆంద్రూ సోదరుడుగా సంబోధించారు. మరో మహిళతో కూడా ఆయనకు సంబంధాలున్న విషయం తాజా పత్రాల ద్వారా వెలుగుచూసింది. ఈ రెండో మహిళపేరు ఏమిటో తెలియనప్పటికీ ఆమె తరపు న్యాయవాదులు మాత్రం నోటీసులు ఇచ్చారు. మర్యాదగా కూర్చుని విషయం పరిష్కరించుకోవడానికి రాజీకి రావాలని లేదా న్యాయస్థానాన్ని ఎదుర్కోవాలని ''ఆమె'' తన న్యాయవాదుల ద్వారా హెచ్చరిక చేశారు. ఎప్‌స్టీన్‌కు ఆయనకు మధ్య ఉన్న గాఢానుబంధం ఈ పత్రాల సాక్ష్యాల్లో స్పష్టంగా బహిర్గతమైంది. రష్యాన్ మహిళలను ప్రిన్స్ ఆంద్రూకు ఎప్‌స్టీన్ ఎరగా చూపించాడు. అందుకు ఆంద్రూ కూడా అత్యుత్సాహం కనబరిచి అతడితో లావాదేవీలు నడిపాడు. తన ఇంట్లో వేడుకలకు ఎప్‌స్టీన్‌ను ఆహ్వానించాడు. తన భార్య, కుమార్తెల ఫొటోలను కూడా ఎప్‌స్టీన్‌కు ఆంద్రూ పంపించిన సాక్ష్యాలున్నాయి. ఇవన్నీ ఈ శతాబ్దారంభంలో జరిగిన వ్యవహారాలే. రెండు రోజుల క్రితం ఈ పత్రాలు బహిర్గతమైన తర్వాత స్లోవేకియాలో ప్రధానమంత్రికి జాతీయ భద్రతా సలహాదారుడు మిరోస్లావ్ లాజ్‌కాక్ రాజీనామా చేశారు. ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్‌పై కూడా తీవ్రమైన లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఆంద్రూ మాజీ భార్య సారా ఫెర్గూసన్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను సోదరుడుగా అభివర్ణించారు.

## గాజా–ఈజిప్టు సరిహద్దు రాకపోకల పునరుద్ధరణ




**కైరో:** రెండు సంవత్సరాల పోరాటం తర్వాత ఎట్టకేలకు గాజా–ఈజిప్టు మధ్య రాకపోకలకు వీలుగా సరిహద్దుల్లో ఉన్న రఫా క్రాసింగ్‌ను సోమవారం పునరుద్ధరించారు. రఫా క్రాసింగ్‌ను ప్రయోగాత్మకంగా ఒకటో తేదీనే ప్రారంభించారు. ఈజిప్టు ప్రభుత్వ మీడియా, ఇజ్రాయెలీ భద్రతా దళాలు రఫా క్రాసింగ్ పునఃప్రారంభమైన విషయాన్ని అధికారికంగా ధృవీకరించినట్లు అసోసియేటెడ్ ప్రెస్ ప్రకటించింది. యుద్ధానికి ముందురోజుల్లో గాజా నుండి ప్రజలు వెళ్ళిపోవడానికి రఫా క్రాసింగ్ ప్రధానమైన మార్గంగా ఉండేది. గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత ఈ మార్గాన్ని పునరుద్ధరించే విషయంపై ఇజ్రాయెల్ తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. రఫా క్రాసింగ్‌ను పాలస్తీనియన్లు ప్రపంచ దేశాలలోకి ప్రవేశించడానికి ఒక ముఖద్వారంగా భావిస్తారు. 2024 మే నెలలో ఇజ్రాయెల్ సైన్యం ఈ గేట్ వేను మూసివేసింది. ఇప్పుడు ఈజిప్టులోకి వెళ్ళేందుకు గాజా ప్రజలను పరిమితంగా మాత్రమే అనుమతించారు. అంబులెన్సులు, సహాయ సామాగ్రి మోసుకెళ్ళే లారీలు భారీ సంఖ్యలో రఫా క్రాసింగ్ వద్ద క్యూ కట్టాయి. తీవ్ర అనారోగ్యం, అత్యవసర వైద్యసేవలు అవసరమైనవారిని ఈ క్రాసింగ్ ద్వారా వెళ్ళేందుకు అనుమతించచారు. సరుకుల రవాణాను అనుమతిచ లేదు. దాదాపు 20,000 మంది పాలస్తినా పిల్లలను, వయోజనులను శస్త్రచికిత్సలు, వైద్య అవసరాల నిమిత్తం వెళ్ళేందుకు సిద్ధంగా ఉండగా, ప్రతిరోజూ అటూవైపు–ఇటూవైపు రాకపోకలకు 50మందిని మాత్రమే అనుమతిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రకటించారు. కాగా ఈజిప్టులో దాదాపు 150 ఆసుపత్రులు గాజా నుండి పాలస్తినా రోగులకు చికిత్సలు అందించేందుకు తలుపులు తెరచి సిద్ధంగా ఉన్నాయి. ఐతే ఇజ్రాయెల్‌మాత్రం ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఉన్న ఆసుపత్రులకు పాలస్తినా రోగులు, గాయపడినవారిని తరలించడాన్ని నిషేధించింది. ఈజిప్టు నుండి గాజాలోకి వెళ్ళేందుకు వేలాదిమంది ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పదంలో కీలకమైన చర్యలు ముందు ముందు మరిన్ని అమలు కావాల్సి ఉన్న తరుణంలో రఫా క్రాసింగ్ పునఃప్రారంభం ఒక మైలురాయి ఘట్టంగా మారింది. కాగా గత ఏడాది అక్టోబరు 10న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ ఉల్లంఘనలకు పాల్పడింది. ఈ సందర్భంగా కాల్పుల్లో 520 మంది పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ 100 మంది పైగా పిల్లలు మరణించారని యూనిసెఫ్ ప్రకటించింది. గాజా యుద్ధంలో 71,700 మంది పాలస్తీనియన్లు హతులయ్యారు. మరో 10వేలమంది శిథిలాల్లో నిర్జీవులయ్యారు.

## ఎన్నికల్లో పోటీ కోసం కూతుర్ని చంపిన తండ్రి

**ప్రజాపక్షం/ఎడపల్లి/నిజామాబాద్ అర్బన్ :** రాజకీయ అధికారంపై వ్యామోహం ఒక తండ్రిని కిరాతకుడిగా మార్చింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అడ్డుగా ఉందని, కన్న కూతురినే కాలువలోకి నెట్టి హత్య చేసిన ఉదాంతం నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపింది. ఈ దారుణానికి ఒడిగట్టిన తండ్రితో పాటు అతనికి సహకరించిన ప్రస్తుత సర్పంచ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సిపి సాయి చైతన్య సోమవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా, ముఖేడ్ తాలూకా కెరూర్ గ్రామానికి చెందిన పాండురంగ కొండమంగలే అనే వ్యక్తి క్షౌరవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని పాండురంగ భావించాడు. కానీ ముగ్గురు సంతానం ఉంటే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హత ఉంటుందని భావించాడు. దీంతో ప్రస్తుత సర్పంచ్ గణేష్ షిండేతో కలిసి పథకం వేశాడు. మొదట తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్ మార్పించాలని పూణే కార్పొరేషన్ కార్యాలయం చుట్టు తిరిగినా పని కాలేదు. చివరకు ఒక బిడ్డను వదిలించుకుంటేనే ఎన్నికల బరిలో ఉండగలనని భావించి, తన పెద్ద కూతురు ప్రాచీ(6)ని చంపాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం, జనవరి 29న పాండురంగ తన కూతురు ప్రాచీని మాయమాటలు చెప్పి బైక్‌పై నిజామాబాద్‌కు తీసుకొచ్చాడు. ఎడపల్లి పరిధిలోని నిజాంసాగర్ డి46/8 కెనాల్ వద్దకు రాగానే పాప బతికి ఉండగానే కాలువలోకి తొసివేసి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బోధన్ ఎసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి సోషల్ మీడియాలో పాప ఫోటోలను వైరల్ చేశారు. వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టిన ఫోటోను చూసిన మహారాష్ట్ర బంధువులు, ఆ పాప ముఖేడ్ తాలూకా కెరూర్ గ్రామానికి చెందిన ప్రాచీగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఎంహెచ్ 26బివై 7495 బైక్, మూడు మోబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పాండురంగ కొండమంగలే తో పాటు ప్రస్తుత సర్పంచ్ గణేష్ షిండే ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్లిష్టమైన కేసును అత్యంత వేగంగా, చాకచక్యంగా చేదించిన బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, రెంజల్ ఎస్సై చంద్రమోహన్‌తో పాటు ఇతర సిబ్బందిని పోలీస్ కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

## విచారణ తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

నారాయణ రెడ్డి తన 500 ఎకరాల భూమిని ప్రజలకు పంచిపెట్టారని, 60 ఏళ్లు వచ్చాక ఆయన రాజకీయ పదవులను కూడా వదులుకున్నారని, తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని , తన ఆస్తులను త్యాగం చేశారన్నారు. 'వీరు' (కెసిఆర్ ) ఏం త్యాగం చేశారని, ఒకే కుటుంబం పదవులను పంచుకున్నదని, ఫామ్‌హౌస్‌లను కట్టుకున్నారని, వేలా కోట్ల రూపాలయను సంపాదించుకున్న వారు జాతీపీత, ఉద్యమకారులు ఎలా అవుతారని సిఎం నిలదీశారు.

హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో సోమవారం జరిగిన రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డ్ ప్రధానోత్సవానికి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. న్యాయమూర్తిగా చారిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీం కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ''తెలంగాణ రైతాంగాసాయుధ పోరాట సేనాని, సిపిఐ అగ్రనేత రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు2025'ను సిఎం రేవంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని శాలువాతో సత్కరించి, సన్మాన పత్రాన్ని అందజేశారు. కాగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి సన్మాన పత్రంలోని సారాంశాన్ని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సభలో చదివి వినిపించారు. అంతకుముందు రావి నారాయణ రెడ్డి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, తెలంగాణ చాడ వెంకట్ రెడ్డి, కందిమళ్ల ప్రతాప్ రెడ్డి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

అనంతరం చాడ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ఒక సారి హోదా వస్తే నేరాలు చేస్తాం...ఈ మధ్య తెలంగాణ జాతిపిత అని , ఉద్యమకారులమని కొందరు వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా ? అని అంటున్నారని, ఆనాడు గాంధీజీ పదవులు త్యాగం చేసి దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని, మరి ప్రస్తుతం జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమం నడిపించిన ప్రొపెసర్ కోదండరామ్ ఉద్యమకారుడు కాదా?, ఆయన ఇంటి తలుపులు బద్ధలు కొట్టి, ఆయనను అరెస్ట్ చేయలేదా?

అప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా?' అని నిలదీశారు. జెఎసి ఉద్యమకారుడైన చైర్మన్‌కు కోదండరామ్‌కు ఎంఎల్‌సిగా అవకాశం కల్పిస్తే , దీనిని అడ్డుకునేందుకు సుప్రీం కోర్ట్ వరకు వెళ్లారని, ఆయన ఏం తప్పు చేశారని అన్నారు. తమ ప్రభుత్వం అలా చేయలేదని, కనీ తమ ప్రభుత్వం కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చిందని, అధికారిక నివాసంలోనే ప్రశ్నిస్తామని చె ప్పిందని అన్నారు. ప్రజలు తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలని, హుందాగా తప్పుకుంటే కొంతైనా గౌరవం నిలబడేదని అన్నారు. చేయాల్సిన తప్పులన్నీ చేస్తే జాతిపిత, ఉద్యమకారులు ఎలా అవుతారని అన్నారు. స్వయాన ఎంఎల్‌ఎగానే ఎన్నికల్లో ఓడిపోయారని, వాళ్ల పార్టీ ఒక్క పార్లమెంట్ సీటును కూడా గెలుచుకోలేదని గుర్తు చేశారు. ప్రజలు తిరస్కరిస్తే ప్రజలే ఓటు వేయకుండా తప్పు చేశారని చెబితే ఇదెక్కడి ప్రజాస్వామ్యమన్నారు.

**సాయుధ పోరాటంలో 'రావి నారాయణ రెడ్డి 'ది కీలక పాత్ర**

రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటామని, మంత్రులతో సమావేశమై ఆయనకు తెలంగాణలో సముచిత గౌరవం కల్పించే బాధ్యత తమ ప్రభుత్వానిదని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు, అవార్డ్‌గ్రహిత జస్టిస్‌సుదర్శన్ రెడ్డితో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతిపాదనలను స్వీకరిస్తామని సిఎం చెప్పారు. అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని కొనియాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేశారని, రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెట్టిచాకిరీ విముక్తి చేశారని గుర్తు చేశారు. 'బండి వెనకాల బండి కట్టి'అని పాట కట్టిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. దేశంలో మొట్టమొదటి సారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే కూడా ఎంపిగా రావి నారాయణరెడ్డికే అధిక మెజారిటీతో దక్కిందని, ప్రజా తీర్పును ప్రతిబింబించే విధంగా మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డితోనే నెహ్రూ ప్రారంభింపజేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిబద్ధత మోదీని బయపెడుతుందనే ఉద్దేశంతోనే ఆయను ఉపరాష్ట్రపతిగా నాడు కాంగ్రెస్ పార్టీ, మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ బరిలో దించారని వివరించారు. ప్రజలకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని అందించాలంటే ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలనకు వ్యతిరేకంగా సుదర్శన్ రెడ్డి ఎన్నికల బరిలో దిగారని, అలాంటి వ్యక్తికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందించడం సముచితమని, ఇది సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

తొలి తరంలో బూర్గుల, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే , మలి తరంలో జైపాల్ రెడ్డి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి లాంటి వాళ్లు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తి అని అన్నారు. సమాజంలో వస్తున్న మార్పును, ప్రజల ఆలోచనను గౌరవించిన గొప్ప నాయకులు జైపాల్ రెడ్డి, రావి నారాయణరెడ్డి అని అన్నారు.



### కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లు బొమ్మా, బొరుసులు

సర్ పేరుతో ప్రజల ఓటు హక్కును కాలరాసే కుట్రలు జరుగుతున్నాయని, వీటి పట్ల కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజల పక్షాన నిత్యం ఎర్ర జెండా పోరాడుతుందని, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజలకు అవసరమని, ఈ రెండు పార్టీలు నాణానికి బొమ్మ, బొరుసులాంటి వారని అన్నారు. కమ్యూనిస్టులు పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకొచ్చిందని పునరుద్ఘాటించారు.ఆరుట్ల కమలాదేవి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, మల్లు స్వరాజ్యం లాంటి స్వేచ్ఛ కోసం, వెట్టిచారికి కోసం సర్వం త్యాగం చేశారని గుర్తు చేశారు.

### రావి నారాయణరెడ్డి యుగ పురుషుడు

రావి నారాయణ రె డ్డి రాసిన 'తెలంగాణ నగ్న సత్యం' అనే డాక్యుమెంట్ పైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమం తెలంగాణ అంటే ఏమిటి?, రైతాంగ సాయుధ పోరాటం, ఆ పోరాట స్వరూపం, స్వభావం?, ఫ్యూడల్ వ్యవస్థ అంటే ఏమిటి?, దీనికి ఎదురు నిలిచి పోరాటం చేసిన రావి నారాయణ రెడ్డి యోధుడి చరిత్రనే కాదని, తెలంగాణ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమన్నారు. తనకు ఎన్నో అవార్డులు వచ్చినప్పటికీ ఇది రావినారాయణ రెడ్డి జాతీయ అవార్డ్ తనకు ఎంతో గొప్పదని, ప్రత్యేకమని అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి కలిగిన వ్యక్తి అని, ఆయనొక యుగపురుషుడని, విప్లవవీరుడని కొనియాడారు. చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని, ట్రస్ట్‌కు ప్రత్యేక గుర్తింపు, దక్కాలని, రావినారాయణరెడ్డితో పాటు నాటి తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల చరిత్రను గుర్తించాలని, పది ఎకరాల స్థలంలో స్మృతి వనంను నిర్మి ంచేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. దేశ ప్రసంగాల గురించి స్వయాన ఒక ముఖ్యమంత్రి ఒక వర్గం వారికి చెందిన ఓట్లను తొలగించాలని ప్రొత్సహిస్తున్నారని, అలాగే పొరుగుదేశానికి వెళ్లాలని అంటున్నారని, ఇలాంటి విద్వేష ప్రసంగాలు రాజ్యాంగ బద్దంగా సిఎం ప్రమాణ సందర్భంగా చేసిన ప్రమాణానికి విరుద్ధమని చెప్పారు.

### ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం : కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి

తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోతుందన్నారు. భవిష్యత్ తరాలకు నాటి సాయుధ పోరాటం,నాటి పరిస్థితులను, తెలియజేయాలనే ఉద్దేశంతోనే ట్రస్ట్ పని చేస్తుందన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ స్వాగతోపన్యాసం చేస్తూ రావి నారాయణరెడ్డి పేరుతో ప్రతి ఏటా అవార్డులను అందజేస్తున్నామని, ఒక కరోనా సమయంలో ఇవ్వలేదని వివరించారు. తెలంగాణ అమర వీరుల స్మారక ట్రస్ట్ సభ్యురాలు రావి ప్రతిభ వందన సమర్పణ చేశారు. ఈ వేదికపైన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ సభ్యులు ఉజ్జిని రత్నాకర్‌రావు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్‌పాషా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఈ.టినర్సింహ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ సంగీత దర్శకుడు వందే మాతరం శ్రీనివాస్, ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ గేయాలను ఆలపించారు.

## ఎక్కడా అనుమతి లేదు

(మొదటి పేజీ తరువాయి)

సుదర్శన్ రెడ్డి స్వీకరించారు. అనంతరం 'భారత రాజ్యాంగంభావప్రకటన స్వేచ్ఛ' అనే అంశంపైన ఆయన 'రావి నారాయణ రెడ్డి' స్మారకోపన్యాసం చేశారు. తమకు భావ ప్రకటన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేదా?, తాము ఎవరి గురించైనా రాస్తాం, ఎవరి పరువైన తీస్తామనంటే ఏ దేశంలో ఏ రాజ్యాంగం కూడా పరిమితులను అనుమతించబోదని సుదర్శన్ రెడ్డి అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను మొదటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ ప్రగాఢంగా విశ్వసించేవారని, దేశ భద్రత, ప్రయోజనాలకు భంగం కేసుల విషయంలో సుప్రీం కోర్ట్ నేపథ్యంలో ఆయనే రాజ్యాంగానికి 1951 మొదటి, 1961లో దేశ సార్వభౌమత్వ విషయంలో రెండవ సారి సవరణ చేయాల్సి వచ్చిందని, ఈ రెండు సవరణకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా కమ్యూనిస్టులు కూడా కారణమయ్యారన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన అధికారణకు రెండవ సారి సవరణ ప్రతిపాదించినప్పుడు నాడు రావి నారాయణ రెడ్డి పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు ఆ అవసరం లేదని అన్నారని సుదర్శన్‌రెడ్డి తెలిపారని, ఈ విషయాన్ని 'అవుడస్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ వర్క్స్' అనే పుస్తకంలో అమెరికా రచయిత ఆస్టిన్ ప్రస్తావించారని ఆయన గుర్తు చేశారు.

## పత్తి కొనుగోళ్లలో కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్‌తో సహా ఆదిలాబాద్, బైంసా, ఖమ్మంతో పాటు పలు మార్కెట్‌లలో అవకతవకలు జరిగాయి. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగాయి. ఈ అక్రమాలు గుర్తించిన కొంత మంది గత సంవత్సరం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఫిర్యాదు చేశారు. ఆయన విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. వరంగల్ మార్కెట్‌తో పాటు అన్ని మార్కెట్ లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. భారీ అవకతవకలు వరంగల్ తో పాటు పలు మార్కెట్ లో గుర్తించారు. వారు అప్పుడు ఇచ్చిన తాత్కాలిక నివేదిక ప్రకారం గతంలోనే ఐదుగురు కార్యదర్శులపై వేటు వేశారు. తర్వాత మార్కెట్ల వారిగా విచారణ కొనసాగించారు. విజిలెన్స్ శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరిని ఏజెన్సీలకు సరెండర్ చేయాలని కోరారు. మరో 17 మంది కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. ఈ పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణంశాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల పై సస్పెన్షన్ వేటు వేశారు. వీరిని ఏజెన్సీలకు సరెండర్ చేయాలని కోరారు.ఈ పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరిగింది. గత సంవత్సరం తాత్కాలిక అనుమతుల పేరుమీద రైతుల వద్ద కొనుగోలు చేసి వారి పేరుమీదనే సీసీఐకి అమ్మకాలు చేశారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన దళారులు ఎక్కువ ధరకు అమ్ముకున్నారు.వ్యాపారులతో పాటు దళారులు కొనుగోలు చేయడానికి అధికారులు సహకరించారు. గత సంవత్సరమే వరంగల్ మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఆదిలాబాద్ తో సహా ఇతర కార్యదర్శులపైన కూడా సస్పెండ్ వేటు వేశారు. ఈ వ్యవహారంలో దళారులు, అధికారుల పై చర్యలు చేపట్టలేదు. నోటీసుల వరకే పరిమితం చేశారు. వరంగల్ మార్కెట్ లో పత్తి వందల కోట్ల రూపాయల కొనుగోలు జరుగుతుంది. సీసీఐతో పాటు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 55 కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల పరిధిలోగల పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. గత సంవత్సరం వ్యవహారంలో చర్యలు తీసుకోకుండా ప్రజాప్రతినిధుల ద్వారా దళారులు, అధికారులు ప్రయత్నాలు చేయడం ద్వారానే వారిపైన చర్యలు చేపట్టనట్లు తెలుస్తుంది. విజిలెన్స్ నివేదికలో భాగంగా తాత్కాలిక ఉద్యోగులపైనే వేటు వేయడం పలు విమర్శలకు తావిస్తుంది.

## లోక్‌సభలో రగడ

(మొదటి పేజీ తరువాయి)

చైనాపై తీసుకున్న నిర్ణయాలపై ప్రజల్లో పుష్కలంగా సమాచారం ఉందని, ఆయన 'తన సొంత రాజనీతిజ్ఞతను మరింత పెంచుకోవడానికి వేల ఎకరాల భూమిని వదులుకున్నారని' వారు ఆరోపించారు. ఈ అంశంపై తాను ఎప్పుడూ మాట్లాడకూడదని గాంధీ అన్నారు. కానీ బిజెపికి చెందిన సూర్య కాంగ్రెస్ పార్టీ దేశభక్తిని ప్రశ్నించడంతో తాను మాట్లాడాలని నిర్ణయించుకున్నానన్నారు. తన అభిప్రాయాలను తెలియజేయడానికి ఒక పత్రిక కథనాన్ని ఉటంకిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. స్పీకర్ ఓమ్‌బిర్లా మళ్ళీ దానిని తిరస్కరించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పీకర్ రూలింగ్‌ను పాటించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకుడు పదే పదే స్పీకర్ రూలింగ్‌ను విస్మరిస్తూ, నియమాలను ఉల్లంఘిస్తే, అటువంటి సభ్యుడిపై ఎలాంటి చర్య తీసుకోవాలో సభ చర్చించాల్సి ఉంటుందని రిజిజు అన్నారు. సభ నియమాలను పాటించకపోవడం ద్వారా యువ ఎంపిలకు గాంధీ తప్పుడు ఉదాహరణగా నిలుస్తున్నారని మంత్రి అన్నారు. ఆ పుస్తకాన్ని ఉటంకించవద్దని స్పీకర్ పదే పదే హెచ్చరించారు. ఈ క్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ లేచి ఆ పుస్తకాన్ని ప్రచురించడానికి అనుమతి లేదని, మరి నరవాణే దానిపై కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. రాహుల్ సభను తప్పుదారి పట్టిస్తున్నారని రక్షణ మంత్రి కూడా ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ రాహుల్‌గాంధీకి మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ నాయకుడిని మాట్లాడటానికి అనుమతించాలని స్పీకర్‌ను కోరారు. అధికార, ప్రతిపక్ష ఎంపిలు ఇద్దరూ పట్టు విడవకపోవడంతో స్పీకర్ మధ్యాహ్నం 3 గంటల వరకు సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు రాహుల్‌గాంధీ మళ్ళీ భారత దేశంచైనా సరిహద్దు సమస్యను లేవనెత్తడానికి ప్రయత్నించారు. దీంతో అధికారి బెంచీల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. సైన్యాన్ని తక్కువ చేసి మాట్లాడే మాటలు గాంధీ మాట్లాడకూడదని రిజిజు అన్నారు.ప్రతిష్టంభన కొనసాగుతుండగా బిర్లా సభను మరోసారి సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. టిఎంసికి చెందిన మహువా మొయిత్రా, కళ్యాణ్ బెనర్జీ, ఆర్జేడీకి చెందిన మనోజ్ ఝూ, ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్ సహా అనేక మంది ప్రతిపక్ష నాయకులు ఈ అంశంపై గాంధీకి మద్దతు ఇచ్చారు.


**ప్రభుత్వం అతిగా స్పందించింది: శశిథరూర్**


రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై లోక్‌సభలో ప్రభుత్వ పక్షం అతిగా స్పందించిందని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ వ్యాఖ్యానించారు. సంబంధిత పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పే బదులు.. ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వాల్సింది అని అన్నారు.

**ఎందుకు భయపడుతున్నారు?: ప్రియాంక గాంధీ**

రాహుల్‌గాంధీ మాట్లాడుతున్న మాటల్లో నిజం లేకపోతే, వాటికి సరైన ప్రామాణికత లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. పుస్తకంలోని ఒక్క లైన్ గురించి రాహుల్ ప్రస్తావించగానే అధికార పక్ష సభ్యులు అంత ఆగ్రహానికి గురవ్వాల్సిన అవసరం ఏముందన్నారు.

# రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవ దృశ్యాలు












## 12న రవాణా రంగ కార్మికుల సమ్మె

### ఆటో, క్యాబ్, లారీ మోటార్ రవాణా రంగ కార్మిక సంఘాల జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో విఫలమైనందున కేంద్ర కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా 4 లేబర్ కోడ్‌లతో పాటు మోటార్ వాహనాల చట్టం 2019 రద్దు చేయాలని సమ్మెకి పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా రంగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12 న రాష్ట్ర వ్యాప్తంగా ఒకరోజు సమ్మె నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం కమిషనర్‌ను కలిసి యూనియన్ నేతలు (ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, టియుసిఐ, టిఎన్‌టియుసి, బిఆర్‌టియు, టిఎడిఎస్, టిఎఎండియు, జియుటిఎస్, టిటిడబ్ల్యుయు) వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నేత బి.వెంకటేశం(ఎఐటియుసి)మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ సారధి వాహన పోర్టల్ వలన ఆటో డ్రైవర్లకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. ఓలా, ఉబర్, రాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్లను నిషేధించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వమే వాటి స్థానంలో ఒక కొత్త యాప్‌ను తీసుకురావాలని వెంకటేశం కోరారు.



## మహాత్మా ఇంత ఘోరమా..

### అన్నంలో గుట్కా కవర్.... రోడెక్కిన విద్యార్థులు

### హాస్టల్స్ మెస్ భోజనంలో పురుగులు, గుట్కాలు ప్రత్యక్షం

### ఎంజియు వైస్ ఛాన్స్‌లర్ హామీతో ఆందోళన విరమణ




**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వసతి గృహ విద్యార్థుల భోజనంలో గుట్కా ప్యాకెట్ బయటపడడంతో వైస్ ఛాన్స్‌లర్ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఆగ్రహానికి గురై విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. సోమవారం బాలుర వసతి గృహంలో జీరా రైస్‌లో గుట్కా ప్యాకెట్ రావడం విద్యార్థుల ఆరోగ్య భద్రతపై పెద్ద ప్రమాదంగా మారిందని మండిపడ్డారు. గతంలో కూడా అన్నంలో క్రిమికీటకాలు బయటపడిన సంఘటనలు ఉన్నప్పటికీ యూనివర్సిటీ యాజమాన్యం, ముఖ్యంగా వైస్ ఛాన్స్‌లర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిన్నెలతో యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తున్న యూనివర్సిటీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కంటే యాజమాన్యానికి విద్యార్థుల హాజరు శాతం ముఖ్యమని పునరావృతమవుతున్న ఘటనలపై వైస్ ఛాన్స్‌లర్ స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకొని, నాణ్యమైన ఆహారం అందించే వరకు మా ఆందోళన ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఎంజియు అధ్యక్షులు హనుమాన్ చారి, విద్యార్థి నాయకులు మోహన్, సుధీర్, అజయ్, సతీష్, శంకర్, సూర్య, విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.


GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-9, ఉప్పల్.

టెండర్ నోటీసు

TENDER NOTICE NIT No.28/EEC-9/UPL/GHMC/2025-26 తేదీ: 31-01-2026

**పని పేరు:** 10 పనుల కోసం "జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, చిల్కానగర్, వార్డు నెం.7, శ్రీ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో మొదటి అంతస్తు నిర్మాణం..... జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, రామంతాపూర్, వార్డు నెం.9, ఇందిరానగర్‌లోని ఇందిరానగర్ జెండా నుండి పాపయ్య టిఫిన్ సెంటర్ వరకు, నెహ్రూ నగర్‌లోని ప్రిన్స్‌టన్ కళాశాల సమీపంలో సిసి రోడ్డు వేయడం". **అంచనా విలువ:** రూ.189.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 09.02.2026న మ.03.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరికిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.9, జిహెచ్ఎంసి, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://Tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-9, ఉప్పల్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14880-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

NIT No.68/SE(KZ)/GHMC/TA/2025-2026 తేదీ: 02-02-2026

**పనుల సంఖ్య:** డిజిల్టింగ్-1, **మొత్తం:** 1 పని, **అంచనా విలువ:** రూ.61.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ: 03.02.2026న మ.03.30గం.ల నుండి, బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ: 06.02.2026న మ.03.00గం.ల వరకు, **మొత్తం:** 1 పని, **మొత్తం అంచనా విలువ:** రూ.61.00లక్షలు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ (కెజెడ్), జిహెచ్ఎంసి, ఫోన్ నెం. 8790522144. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (కెజెడ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14889-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026

దేవాదాయ ధర్మాదాయ శాఖ

శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము

మారుతీనగర్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లా.

Ref: 5/S.A.S.T/2026 లీజు కొరకు తేది: 02-02-2026

మల్కాజ్ గిరి, మారుతీ నగర్ లో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నందు షాప్ నెంబర్లు 1, 2, 3, 4 సైజు 10x15 మరియు షాప్ నెం. 5 సైజు 6x15 మరియు షాప్ నెం. 6 సైజు 5x5 సైజులు గల వాణిజ్య సముదాయము ఇం.నెం. 4-95 నందు మూడు సంవత్సరముల అద్దెకు లీజుకు ఇచ్చుటకు తేది: 9-02-2026 సోమవారం రోజున ఉదయం 10 గంటలకు బహిరంగ వేలము జరుగును. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఒకరోజు ముందుగా రూ.5,000/- రూపాయలు డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే వేలం పాటలో పాల్గొనగలరని కోరడమైనది. వివరముల కొరకు దేవాలయ కార్యాలయంలో సంప్రదించగలరు.

పైన తెలిపిన షాపుల లీజు కాలము వివరములు

| నెం. | సైజు | కాలము |
|---|---|---|
| షాప్ నెం. 1 | 10 x 15 | 01-11-2026 నుండి 31-10-2029 |
| షాప్ నెం. 2 | 10 X 15 | 01-11-2026 నుండి 31-10-2029 |
| షాప్ నెం. 3 | 10 x 15 | 01-03-2026 నుండి 28-02-2029 |
| షాప్ నెం. 4 | 10 x 15 | 09-01-2026 నుండి 08-01-2029 |
| షాప్ నెం. 5 | 6 x 15 | 01-03-2026 నుండి 28-02-2029 |
| షాప్ నెం. 6 | 5x5 | 01-03-2026 నుండి 28-02-2029 |

ఫోన్ నెం. 9391006157

సం/ - సిహెచ్. శ్రీనివాస రావు, మేనేజర్

DIPR R.O. No. : 14858-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026

తెలంగాణ ప్రభుత్వం

వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయము, గడ్డిఅన్నారం

టెండరు నోటిఫికేషన్

నెం.వ్య.మా.క.గ./టెండర్స్/35/2022-23 తేది: 02-02-2026

వ్యవసాయ మార్కెట్ కమిటి, గడ్డిఅన్నారం పరిధిలో ఒక సంవత్సరం కాలము పాటు ఈ క్రింద చూపబడిన పనికి గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్ర.మ | టెండరు పేరు | టెండరు షెడ్యూల్ ధర | ధరావత్తు రూ.లు | టెండరు షెడ్యులు అమ్మకము తేదీలు |
|---|---|---|---|---|
| 1 | బాటసింగారం పండ్ల మార్కెట్ యార్డ్ నందు చెత్త చెదారములు ఊడ్చుట, ప్రోగు చేయుట, ఎత్తి వేయుట మరియు అట్టి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించుటకు | 3,000/- | 3,00,000/- | 06-02-2026 మరియు 07-02-2026 (కార్యాలయ పని వేళల్లో) |
| 2 | ఎల్.బి.నగర్ సబ్-యార్డ్ నందు చెత్త చెదారములు ఊడ్చుట, ప్రోగు చేయుట, ఎత్తి వేయుట మరియు అట్టి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించుటకు గాను. | 3,000/- | 1,00,000/- | |
| 3 | ఎల్.బి.నగర్ సబ్-యార్డ్ నందు గల మరుగు దొడ్లను నిర్వహించుటకు గాను | 3,000/- | 50,000/- | |

1. టెండర్ షెడ్యులు దాఖలు చేయు తేది: 10-02-2026 నాడు ఉదయం 10:00 గం.ల నుండి మ.12.30 గం.ల వరకు మరియు అదే రోజు టెండరు దారుల సమక్షంలో మధ్యాహ్నం 12.45గం.లకు టెండర్లు తెరువబడును.
2. టెండరు షెడ్యులు ధర మరియు ధరావత్తు సొమ్ము రూపాయలు డిమాండు డ్రాఫ్టు ద్వారా Selection Grade Secretary, Agril. Market Committee, Gaddiannaram నందు చెల్లుబాటు అగునట్లు ఉండవలయును.

ఎటువంటి కారణము లేకుండానే టెండర్ నిలుపుదల చేయుటకు గాని, రద్దు పరుచుటకు గాని ఈ క్రింది సంతకము దారునికి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యాలయము పని వేళలలో ఉ.10:30 నుండి సా.5:00 గం.లకు స్వయముగా సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, గడ్డిఅన్నారం.

DIPR R.O. No. : 14897-PP/CL/ADVT/1/2025-26, Date: 02-02-2026



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నోరి దత్తాత్రేయుడు పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా సిఎం ఆయనకు అభినందనలు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికలతో అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు వాయిదా

### తిరిగి ఈ నెల 17 నుంచి మార్చి 10వ తేదీ వరకు నిర్వహణ


ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాయిదా పడ్డ ఈ డిగ్రీ మూడవ, రెండవ, మొదటి సంవత్సరం వేర్వేరు సెమిస్టర్ల పరీక్షలను తిరిగి ఈ నెల 17 నుండి మార్చ్ 10 వతేదీ వరకు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్. భోజు శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, పరీక్షకు మూడు రోజుల ముందు విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్ www.braouonline.in లో హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.. మరిన్ని వివరాలకు అభ్యర్థులు వారి సంబంధిత ఆధ్యయన కేంద్రంలో, లేదా వెబ్ సైట్ www.braou.ac.in లో సంప్రదించవచ్చాని పేర్కొన్నారు.

## హెచ్ఆర్సిలో పాడి కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు

### బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి : టీం రిస్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి

ప్రజాపక్షం /హైదరాబాద్: బిఆర్ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మానవ హక్కుల ఉల్లంఘనలకు దారి తీస్తున్నాయని ఆరోపిస్తూ టీంరిస్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి నాంపల్లి మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సి)లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫహీం ఖురేషి మీడియాతో మాట్లాడుతూ పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు విషపు మాటలుగా అభివర్ణించారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగినవని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉంటే బిఆర్ఎస్ 24 గంటల్లోపు కౌశిక్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల పట్ల బిఆర్ఎస్ వైఖరి ఇప్పుడు స్పష్టంగా బయటపడిందని ఆయన వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయకపోతే ముస్లింలను టార్గెట్ చేస్తారా? అని ప్రశ్నించారు. ముస్లింల పట్ల బిఆర్ఎస్ ఇంత విషం ఎందుకు పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యులర్ అని చెప్పుకోవడం కాదనీ, పాడి కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చేసి నిరూపించుకోవాలని స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డి గతంలో కూడా అనుచిత వ్యాఖ్యలు చేసి, 24 గంటల్లో సారీ చెప్పడం అలవాటుగా మారిందని విమర్శించారు. ఈసారి చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత దాడులు కాదని, యావత్తు సమాజం మీద చేసిన వ్యాఖ్యలేనని ఆయన పేర్కొన్నారు. తమ పార్టీలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే పార్టీ అధ్యక్షుడు వెంటనే సస్పెండ్ చేసేవారని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో ముస్లింల పట్ల చిన్నచూపు కొనసాగుతోందని ఫహీం ఖురేషి ఆరోపించారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై మానవ హక్కుల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా కాదా నిర్ణయించేది కోర్టే : హరీశ్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ చీఫ్, హైదరాబాద్ సిపి సజ్జనార్ చేసిన వ్యాఖ్యలు నిబంధనలకు విరుద్ధమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కోర్టు తీర్పు లేకుండానే ఫోన్ ట్యాపింగ్ అక్రమమని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. దర్యాప్తు దశలోనే తీర్పు చెప్పే అధికారం సిట్ చీఫ్‌కు లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా కాదా అనేది కోర్టు మాత్రమే నిర్ణయించాలని స్పష్టం చేశారు. మాజీ సిఎం, ప్రతిపక్ష నేతకు సంబంధించిన రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇటువంటి వ్యాఖ్యలు దర్యాప్తుపై పక్షపాతం అన్న అనుమానాలు కలిగిస్తున్నాయని తెలిపారు.

## ఫిబ్రవరి 21, 22 తేదీల్లో తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు

### పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏ.వి. కాలేజి ప్రిన్సిపాల్.. డాక్టర్ రాజలింగం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు ఈనెల 21, 22 తేదీల్లో ఏ.వి. కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి తెలిపారు. ఏ.వి. కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రాజలింగం, పత్రికా సంపాదకులు ఆర్. రమేశ్‌లతో కలిసి సోమవారం దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ తెలంగాణ సాహితి గత పదేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా అనేక సాహిత్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఐదు లిటరరీ ఫెస్టులను నిర్వహించామని, ఆరో లిటరరీ ఫెస్టును దశాబ్ది ఉత్సవాలుగా ఏ.వి. కళాశాల తెలుగు శాఖతో సంయుక్తంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాల సందర్భంగా డిగ్రీ, పిజి విద్యార్థుల కోసం 'యాంటీ డ్రగ్స్' అంశంపై కవితా, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ సాహితీవేత్తలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. ఏ.వి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రాజలింగం మాట్లాడుతూ తెలంగాణ సాహితి నిర్వహిస్తున్న లిటరరీ ఫెస్ట్‌లో తమ కళాశాల భాగస్వామ్యం కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులకు సాహిత్యాన్ని మరింత చేరువ చేయడంలో ఇలాంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ ఫెస్టులో కళాశాల తెలుగు శాఖ పూర్తి స్థాయిలో భాగస్వామ్యం వహిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర కోశాధికారి అనంతోజు మోహన్ కృష్ణ, సహాయ కార్యదర్శి ఎస్.కె. సలీమ, ఏ.వి. కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ జి. భాస్కర్ యాదవ్, భౌతిక శాస్త్ర విభాగం అధ్యక్షులు మంజుల దేవి, రసాయన శాస్త్ర విభాగం అధ్యక్షులు డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుధారాణి, హరిప్రియతో పాటు అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, ముఖ్యంగా రాష్ట్ర రైతాంగానికి తీవ్ర నిరాశ కలిగించిందని శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది రైతుల ఆశలను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, ఆయిల్ పామ్ దిగుమతులపై సుంకం పెంపు విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, దీని వలన రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన బదులు, దిగుమతులకు అనుకూలంగా కేంద్రం వ్యవహరించడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుకు నిధుల కేటాయింపు లేకపోవడం, అలాగే పసుపును అత్యంత ప్రాధాన్యతగల పంటగా గుర్తించకపోవడం తెలంగాణ పసుపు రైతులకు తీవ్ర నిరాశను కలిగించిందని తెలిపారు. లక్షలాది మంది పసుపు రైతులు ఎదురుచూస్తున్న డెడికేటేట్ ఫండ్ అంశం బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన లేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నార్థకంగా మార్చిందని పేర్కొన్నారు. అదేవిధంగా, కొబ్బరి (కోకనట్) బోర్డు ఏర్పాటు విషయమై కూడా ఎలాంటి ప్రకటన లేకపోవడం రాష్ట్ర రైతాంగానికి మరో ఎదురుదెబ్బగా మారిందన్నారు. ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉందన్న సంకేతాలు రైతులపై మరింత భారం మోపనున్నాయి. ఇప్పటికే పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించే చర్యలు బడ్జెట్‌లో పూర్తిగా లేవని మంత్రి తెలిపారు.రైతులకు అత్యంత కీలకమైనకనీస మద్దతు ధర కు చట్టబద్ధ హక్కు కల్పించడంలో కేంద్రం మరోసారి విఫలమైంది. దీని వలన రైతుల ఆదాయ భద్రతపై అనిశ్చితి మరింత పెరిగిందన్నారు. వ్యవసాయ మార్కెటింగ్, ధరల స్థిరీకరణ, మార్కెట్ సంస్కరణలపై స్పష్టమైన దిశానిర్దేశం లేకపోవడం కేంద్ర బడ్జెట్ లోని ప్రధాన లోపమని అన్నారు. వ్యవసాయ రంగంలో బడ్జెట్‌లో ప్రస్తావించదగిన ఏకైక అంశం ఎఐఆధారిత కార్యక్రమాల ప్రస్తావన మాత్రమేనని, అయితే ధర భద్రత, మార్కెట్ భరోసా లేకుండా కేవలం ఎఐ రైతు సమస్యలకు పరిష్కారం కాదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు .మొత్తంగా, కేంద్ర బడ్జెట్–2026 తెలంగాణ రైతాంగానికి ఆశలు నింపడంలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏలాంటి ప్రత్యేక ప్రయోజనం లేకుండా రూపొందించబడిందని మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## కెటిఆర్ వ్యాఖ్యలు రాజరిక పోకడలకు నిదర్శనం

### మున్సిపల్ ఎన్నికల్లో 'గుణం' చూసి ఓటేయండి

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థి మంచోడైనా చెడ్డోడైనా కెసిఆర్‌ను చూసి ఓటేయాలన్న కెటిఆర్ వ్యాఖ్యలు రాచరిక, నియంతృత్వ పోకడలకు నిదర్శనమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె కాంగ్రెస్ ప్రభుత్వంపై, బిఆర్ఎస్ వైఖరిపై నిప్పులు చెరిగారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థి ఎవరైనా సరే కెసిఆర్ ముఖం చూసి ఓటెయ్యాలన్న కెటిఆర్ పిలుపును ఆమె తప్పుబట్టారు. ఇలాంటి రాచరిక పోకడలు మార్చుకోకపోతే బిఆర్ఎస్ పార్టీని ఎవరూ కాపాడలేరు అని కవిత వ్యాఖ్యానించారు. కులం, మతం, డబ్బు చూసి కాకుండా, ఆపదలో ఆదుకునే గుణం ఉన్న అభ్యర్థులనే ప్రజలు గెలిపించాలని ఆమె కోరారు. ఈ ఎన్నికల్లో జాగృతి మద్దతుతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (సింహం గుర్తు) అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, వారికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ 'కట్టుకథలు' అని కవిత ఆరోపించారు. వేల కోట్ల పెట్టుబడులు పెడతామన్న కంపెనీలకు కనీసం వెబ్‌సైట్‌లు కూడా లేవని ఆమె ఎద్దేవా చేశారు. ట్రంప్ మీడియా, ఏడిఐజిసి వంటి సంస్థల మార్కెట్ వాల్యూ కంటే ఎక్కువ పెట్టుబడులు చూపుతున్నారని, ఇవన్నీ బ్యాంకులనో, ప్రజలనో మభ్యపెట్టడానికేనని విమర్శించారు.

**'స్టాండ్ వేసి సైకిల్ తొక్కినట్టుంది'..**

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తీరుపై కవిత సెటైర్లు వేశారు. ప్రభుత్వం విచారణకు పిలిస్తే తాను వెళ్తానని స్పష్టం చేస్తూనే, కెసిఆర్‌ను విచారణకు పిలవడం నేరమన్న కెటిఆర్ వ్యాఖ్యలను ఆమె తప్పుబట్టారు. చట్టానికి ఎవరూ అతీతం కాదన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం 'గుంటనక్క'తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుందని, అందుకే విచారణ 'స్టాండ వేసి సైకిల్ తొక్కినట్లు' ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్లు సాగుతోందని విమర్శించారు.

**కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం**

కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగింటి కోడలైన నిర్మలా సీతారామన్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. విభజన హామీలు, మెట్రో ఫేజ్2, ఐఐఎం వంటి అంశాల్లో రూపాయి నిధులు కేటాయించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి 30 సార్లు ఢిల్లీ వెళ్లినా 30 వేల కోట్లు కూడా తీసుకురాలేకపోయారని ఎద్దేవా చేశారు.

**నగరంలో శాంతిభద్రతల వైఫల్యం..**

హైదరాబాద్‌లో అగ్నిప్రమాదాలు, మహిళలపై దాడులు పెరుగుతున్నా హోంమంత్రిగా ఉన్న సిఎం పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు. నాంపల్లి ప్రమాద బాధితులను పరామర్శించలేదని, ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యపై దాడి జరిగినా స్పందన లేదని మండిపడ్డారు. నగరంలో పెరుగుతున్న 'గన్ కల్చర్'పై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 20 తర్వాత 'జనంబాట' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తామని, రాజకీయాల్లోకి యువత, మేధావులు రావాల్సిన అవసరం ఉందని కవిత ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## బూటకపు హామీలతో కాంగ్రెస్ మోసం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ :కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. మున్సిపల్, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పాలనపై 'బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు' పేరిట బిజెపి రాష్ట్ర శాఖ ఛార్జిషీట్‌ను విడుదల చేసింది. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మహారాష్ట్ర మంత్రి, ఎన్నికల ఇన్‌చార్జ్ అశిష్ షెలార్లు ఛార్జిషీట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఈటల రాజేందర్, అశోక్ పర్ణామి, డాక్టర్ ఎన్. గౌతం రావు, ఎన్.వి. సుభాష్ సహా పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, అనేక హామీలతో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, కానీ రెండేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు కాలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు కేవలం ఓట్ల కోసమేనని విమర్శించారు. మున్సిపాలిటీల్లో చెత్త, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్యలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీల్లో సుమారు రూ.2,500 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమైందని, డ్రగ్స్, దొంగతనాలు, దేవాలయాలపై దాడులు పెరిగాయని తెలిపారు. 'సేవ్ తెలంగాణ – ఓట్ ఫర్ బిజెపి' నినాదంతో ప్రజలు ముందుకు రావాలని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

## ప్రజల సాంస్కృతిక ఆచారాలతో చిత్తడి నేలలకు విడదీయరాని బంధం

### అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సి. సువర్ణ



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజల జీవన విధానాలు, సాంస్కృతిక ఆచారాలతో చిత్తడి నేలలు విడదీయరాని బంధాన్ని కలిగి ఉన్నాయని అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డాక్టర్ సి. సువర్ణ అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె అధ్యక్షతన సోమవారం అరణ్యభవన్‌లో అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, రాష్ట్రంలోని చిత్తడి నేలల సంరక్షణ, నిర్వహణ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చిత్తడి నేలల పరిరక్షణలో స్థానిక ప్రజల అనుభవాలు, తరతరాలుగా వస్తున్న సంప్రదాయ జ్ఞానం కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. నీటిని సహజంగా శుద్ధి చేయడం, భూగర్భ జలాలను నిల్వ చేయడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో చిత్తడి నేలల పాత్ర అత్యంత ముఖ్యమని అధికారులు వివరించారు. అడవుల కంటే ఎక్కువగా కార్బన్‌ను చిత్తడి నేలలు నిల్వ చేయగలవని, దీంతో గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు ఇవి గణనీయంగా దోహదపడుతున్నాయని తెలిపారు. జీవ వైవిధ్యానికి కేంద్రాలుగా ఉన్న చిత్తడి నేలలు పక్షులు, చేపలు తదితర జీవజాతులకు ప్రధాన ఆవాసాలుగా ఉన్నాయన్నారు. చిత్తడి నేలల సంరక్షణ, నిర్వహణ కోసం 2017 నిబంధనల ప్రకారం తెలంగాణ రాష్ట్ర చిత్తడి నేలల అధికారాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అటవీ శాఖ మంత్రి చైర్‌పర్సన్‌గా, అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తుండగా, జిల్లాల స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు పనిచేస్తున్నాయని చెప్పారు. పర్యావరణపరంగా కీలకమైన చిత్తడి నేలలను గుర్తించి నోటిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. మంజీరా, పాఖాల్, పోచారం, కిన్నెరసాని వంటి చిత్తడి నేలలను అంతర్జాతీయ స్థాయిలో రాంసార్ స్థలాలుగా గుర్తించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో పిసిసిఎఫ్‌లు వినయ్ కుమార్, రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్‌లు శరవణన్, క్షితిజ, వైల్డ్‌లైఫ్ ఒఎస్‌డి శంకరన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పెట్టుబడుల ఉపసంహరణను తీవ్రంగా ప్రతిఘటిస్తాం

### ఎఐటియుసి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.యస్.బోస్



ప్రజాపక్షం/హైదరాబాద్: 2026–27 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.80వేల కోట్లు ప్రభుత్వరంగ సంస్థల నుండి పెట్టుబడులు ఉపసంహరిస్తామని ప్రకటించటం తెలివితక్కువ తనమని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.యస్.బోస్ అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యంలో పాల్గొనని వారికి దేశ సంపదను అమ్మే హక్కులేదని ఆయన అన్నారు. కార్మికులు, శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలుగా కష్టపడి నాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంకురార్పణ చేసిన ప్రభుత్వరంగ సంస్థలను కష్టపడి, పెద్దచేసి, కాపాడితే వాటి ఫలితాలను ప్రజలకు అందించకుండా కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టటానికి మార్గం తెరిచే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడిన నాటి నుండి ప్రభుత్వరంగ సంస్థల విధ్వంసం, మూసివేయటం లేక అమ్మివేయటం తప్ప వాటి అభివద్ధి కోసం ఆలోచించకపోవటం దేశాభివద్ధికి ప్రమాదకరమని అన్నారు. బిజెపి కేంద్రంలో తన సొంత మెజార్టీ ప్రభుత్వంలో లేదు, కావున తన విధానాలు అమలు చేయటం నీతిమాలిన చర్య అని అన్నారు. రూ.80 వేల కోట్లు ప్రభుత్వరంగ సంస్థల నుండి ఉపసంహరిస్తామని అంటున్న మోడీ ప్రభుత్వం, ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థల ఆస్తులను దేశ అవసరాల మేరకు ఎందుకు జాతీయం చేయటం లేదని ఆయన ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థల ఆస్తులు కూడా కార్మికుల శ్రమతో సష్టించినవేననీ, వాటిని దేశం కోసం, దేశ ప్రజల కోసం జాతీయం చేయటం నిజమైన దేశభక్తి అని ఆయన తెలియజేశారు. దొంగ దేశభక్తితో ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను ఉపసంహరించాలని ప్రయత్నిస్తే ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

## జనగణనలో కులగణన చేర్చాల్సిందే

### లేని పక్షంలో బిజెపిని ఢిల్లీ గద్దె దించుతాం : జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశవ్యాప్తంగా జరగనున్న జనగణనలో బిసి కులగణన చేపట్టాలని, లేకపోతే దేశ వ్యాప్తంగా ఉన్న బిసిలంతా ఏకమై ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణలతో కలిసి ఆయన మాట్లాడుతూ 1931 సంవత్సరంలో జరిగిన కులగణన తర్వాత, బిసిల మూడు దశాబ్దాల పోరాట ఫలితంగా జనగణనతో పాటు కులగణనను కూడా చేపడతామని ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారని, కానీ, దానిని పూర్తిగా విస్మరిస్తుందని ఆయన ఆరోపించారు. జనవరి 22న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 33 ప్రశ్నలతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, అందులో 12వ ప్రశ్నలో మీరు ఎస్‌సి, ఎస్‌టినా లేదా ఇతరులు అని మాత్రమే అడిగిందని, ఇతరులు అన్నచోట ఓబిసినా అని ప్రశ్నావళిలో అడిగితే కేంద్ర ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏముందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను చించివేసి, తమ నిరసన తెలియజేశారు. ఓబిసి కాలాన్ని ప్రత్యేకంగా చేర్చకపోవడం మూలంగా దేశవ్యాప్తంగా ఉన్న 70 కోట్ల మంది బిసిలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నారని, బిసి కులగణన చేపట్టకుండా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోట దక్కదని, దేశంలో 50 శాతం విధించిన పరిమితి ఎత్తివేయరని, బడ్జెట్, విద్యా, ఉద్యోగ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బిసిల వాటా ఒక హక్కుగా, చట్టబద్ధంగా దక్కకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లోనే దేశవ్యాప్తంగా ఉన్న 29 రాష్ట్రాల ఓబిసి సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా భారత్ బంద్ కానీ, జాతి జనగణన బహిష్కరించే విషయం కానీ చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈ సమావేశంలో కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, ఉప్పరి శేఖర్ సగర, దీటి మల్లయ్య, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, సత్యరాజు గౌడ్, గూడూరు భాస్కర్ మేరు, విజయలక్ష్మి, కరుణ, ఇంద్రమ్ రజక, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు రాయితీలు

### కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు దోచిపెట్టేలా ఉన్నదని.. రైతులు, కూలీలు, కార్మికులు, పేద ప్రజానీకానికి ఇస్తున్న సంక్షేమ పథకాలపై కోత విధించేలా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌టిసి క్రాస్‌రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో జాన్‌వెస్లీ పాల్గొని ప్రసంగించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించాలని కోరగా.. బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, అణగారిన వర్గాలకు ఈ బడ్జెట్ మొండిచేయి చూపిందని, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి అరకొర కేటాయింపులతో పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రాల కేటాయింపులలో భారీ కోత విధించారని, స్థూలంగా ఇది పేద, అణగారిన వర్గాల వ్యతిరేక బడ్జెట్ అని, ఈ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజానీకం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో విఫలమయ్యారని.. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా నోరు మెదపడం లేదని, విఫలమైన ఎంపిలు, కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ప్రతిపక్షాలన్నింటినీ కూడగట్టి తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో కేటాయింపులు జరిగేలా నిరసన తెలియచేయాలన్నారు. నిరసనలో పాల్గొన్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టీ.జ్యోతి మాట్లాడుతూ... కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మహిళ కాబట్టి మహిళా సంక్షేమానికి నిధులు కేటాయిస్తారని ప్రజానీకం ఆశించారని.. వారి ఆశలను వమ్ము చేశారని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి నిధుల కేటాయింపులు లేవని.. హైదరాబాద్ నగరానికి మెట్రో రైల్ విస్తరణకు మొండి చేయి చూపారని.. తెలంగాణ రాష్ట్రం పట్ల సవతి తల్లి ప్రేమ చూపారని మండిపడ్డారు. నిరసన కార్యక్రమానికి సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షత వహించగా.. నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.మహేందర్, నగర కమిటీ సభ్యులు జి.నరేష్, ఎన్.మారన్న, సి.మల్లేష్, ఎం.అజయ్ బాబు, జి.కిరణ్, కె.అశోక్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు వరలక్ష్మి, పి.విమల, షబానా తదితరులు పాల్గొన్నారు.



# పేదల జీవనాడిని మోదీ సర్కార్ లాగేసుకుంది

ఎంజి నరేగా రద్దుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ:** 'ఎంజిఎనరేగా' రద్దుపై మరోసారి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. గత రెండు దశాబ్దాల క్రితం యుపిఎ ప్రభుత్వం ప్రారంభించిన ఉపాధిహామీ పథకం పేదల ప్రజలకు జీవనాడి అని, అయితే అహంకార పూరిత మోదీ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు ఖర్గే సోమవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'సరిగ్గా 20 సంవత్సరాల క్రితం, కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురం నుండి ఈ పథకాన్ని ప్రారంభించింది. భారత ప్రభుత్వం ఇప్పటివరకు ఎంజిఎనరేగా కోసం దాదాపు రూ. 10.63 లక్షల కోట్లు ఖర్చు చేసింది, ఇది ఉపాధిహామీ కార్మికులకు రోజుకు రెండుసార్లు ఆహారం పొందడానికి, పిల్లలకు విద్యను అందించడానికి, ఆరోగ్య సంరక్షణను పొందడానికి, వలసలను నిరోధించడానికి, దోపిడీ నుండి వారిని విముక్తి చేయడానికి సహాయపడింది. నరేగా ద్వారా, మొత్తం దాదాపు 4,879 కోట్ల దినాల ఉపాధిని సృష్టించారు. ఫలితంగా, దాదాపు 10.10 కోట్ల గ్రామీణ ఆస్తులు సృష్టించబడ్డాయి' అని ఆయన హిందీలో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పంచాయతీల ఖర్చులో దాదాపు 40 శాతం నరేగా పైనే అని ఖర్గే అన్నారు. ఇది మహాత్మా గాంధీ 'గ్రామ స్వ రాజ్' దార్శనికతకు జీవం పోసిందని స్పష్టం చేశారు. అయితే నేడు దురహంకారపూరితమైన, పేద వ్యతిరేక మోదీ ప్రభుత్వం కోట్లాది మంది పేద కార్మికుల జీవనాధారాన్ని లాక్కుందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా 'సేవ్ ఎంజిఎనరేగా ప్రచారం' కింద, కాంగ్రెస్ పార్టీ మన కార్మికులు, కార్మికుల గొంతును లేవనెత్తుతూనే ఉంటుంది. ఈ నిరంకుశ ప్రభుత్వం తలవంచాల్సి ఉంటుంది! ఎంజిఎనరేగాను తిరిగి స్థాపించాల్సి ఉంటుంది! అని ఆయన నొక్కి చెప్పారు. ఎంజి నరేగాను తిరిగి తీసుకురావడానికి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ప్రచారాన్ని ప్రారంభించింది. పాత చట్టం స్థానంలో ఇటీవల కేంద్ర తీసుకువచ్చిన 'విబి – జి రామ్ జి' చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు నిర్వహిస్తోంది.

**రాజస్థాన్‌లో కాంగ్రెస్ నిరసన**

నరేగాను పునరుద్ధరించాలని, రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి–జి రామ్ జి) కోసం విక్షిత్ భారత్ హామీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజస్థాన్ జైపూర్‌లోని షాహీద్ స్మారక్ వద్ద పలువురు కాంగ్రెస్ నాయకులు, సామాజిక కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన సందర్భంగా, మజ్దూర్ మహాపంచాయత్ జరిగింది. సభకు ఉద్దేశించి కార్యకర్త అరుణా రాయ్ మాట్లాడుతూ విబి–జి రామ్ జి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నరేగా గ్రామీణ పేదలకు రాష్ట్రం నుండి ఉపాధి డిమాండ్ చేసే చట్టబద్ధ హక్కును ఇచ్చిందన్నారు. కానీ కొత్త చట్టం ఆ హక్కును తీసివేస్తుందని, ఉపాధిని కేంద్ర ప్రభుత్వ విచక్షణపై ఆధారపడి చేస్తుందని, తద్వారా ప్రజాస్వామ్య హక్కులను బలహీనపరుస్తుందని, ప్రోత్సహిస్తుందని రాయ్ అన్నారు. మరో కార్యకర్త నిఖిల్ డే మాట్లాడుతూ ప్రతిపాదిత చట్టం ఉపాధికి హామీ ఇవ్వదని, బదులుగా కార్మికులకు అభద్రతకు హామీ ఇస్తుందన్నారు.

## మత మార్పిడీ చట్టాలపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం

# కేంద్రం, 12 రాష్ట్రాలకు నోటీసులు




**న్యూఢిల్లీ:** మతమార్పిడి చట్టాలపై దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి (పిఐఎల్) ప్రతిస్పందనలు ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంతోపాటు 12 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మత మార్పిడులకు వ్యతిరేకంగా చేసిన చట్టాలకు ఉన్న చెల్లుబాటును సవాలు చేస్తూ ఎన్‌సిసిఐ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చ్‌స్ ఇన్ ఇండియా) దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం కోరింది. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాజస్థాన్,ఉత్తరప్రదేశ్, ఒడిసా,ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, హర్యానా,మధ్యప్రదేశ్, కర్ణాటక,హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలున్నాయి. కేంద్రం, రాష్ట్రాల నుండి ప్రతిస్పందనలు వచ్చిన తర్వాత విచారణ ప్రారంభమవుతుంది. మత మార్పిడులు జరుగుతున్నాయనే పేరుతో పనిచేస్తున్న ప్రోత్సాహకాల లబ్ధి పొందుతున్న కొన్ని గ్రూపులు ఫిర్యాదులు చేయడంవల్ల కొన్ని రాష్ట్రాలలో ఇలాంటి చట్టాలు చేశారని ఎన్‌సిసిఐ తన వ్యాజ్యంలో కోర్టుకు తెలియజేసింది. ఐతే కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విజ్ఞప్తులను తోసిపుచ్చారు. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తన తీర్పు ద్వారా ఈ చట్టాలను సమర్థించిందని గుర్తుచేశారు. ఈ తాజా పిటిషన్లతో పాటు ఇప్పటికే న్యాయస్థానం వద్ద అపరిష్కృతంగా ఉన్న సంబంధిత పిటిషన్లను కూడా ఈ విచారణకు జత చేస్తారు. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఇంకా ఇదేవిధంగా రాష్ట్రాలు చేసిన చట్టాలను కూడా సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయని, ఐతే కేంద్ర ప్రభుత్వంతన సమాధానాన్ని ఇప్పటికే సిద్ధం చేసిందని, త్వరలోనే న్యాయస్థానానికి తమ ప్రతిస్పందనను లిఖితపూర్వకంగా సమర్పిస్తామని ధర్మాసనానికి తుషార్ మెహతా తెలియజేశారు. ఎన్‌సిసిఐ తరపున సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఒడిసా, రాజస్థాన్ రాష్ట్రాలు కూడా వేరు వేరుగా మత మార్పిడులకు వ్యతిరేకంగా చట్టాలు చేశాయని, వారు కూడా తమ సమాధానాలతో ముందుకు రావాల్సి ఉందని అరోరా అన్నారు. ఐతే ఇంతకుముందు దాఖలైన పిటిషన్లలో ఈ రెండు రాష్ట్రాల చట్టాలను సవాలు చేయలేదు. అందువల్ల న్యాయమూర్తులందరికీ ఈ నోటీసులు అందవలసి ఉందని అప్పటివరకూ వేచి ఉండాలని ఆమె కోరారు. "నోటీసులు ఇవ్వండి, ఆ యా రాష్ట్రాల ప్రభుత్వాలకు చెందిన అడ్వకేట్ జనరల్స్‌కు కూడా ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం ప్రతులను జారీ చెయ్యండి, నాలుగు వారాలలో సమాధానం రావాల్సి ఉంటుంది, ఉమ్మడి అఫిడవిట్‌ను వారంతా సమర్పించమనండి, దానికి ఉన్న ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఏమిటో చెప్పమనండి, ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు తీసుకుంటుంది" అని జస్టిస్ సూర్యకాంత్ జారీ చేసిన ఉత్తర్వు ప్రకటించింది.

# టివికె రాకతో మారిన ఎన్నికల ముఖచిత్రం

అధికారం మాదే: విజయ్



**న్యూఢిల్లీ:** టివికె పార్టీ రాకతో తమిళనాడులో రాజకీయ వాతావరణం మారిందని అధినేత విజయ్ తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని అన్నారు. తమిళగ వెట్రి కళగం పార్టీని ప్రారంభించి సోమవారంతో రెండేళ్లు పూర్తి చేస్తుకున్న సందర్భంగా విజయ్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సవాళ్లు ఎదురైనా టివికె స్థిరంగా ఉందని, సామాన్య ప్రజలకు సాధికారత కల్పించే రాజకీయాల కోసం దీనిని ఒక ఉద్యమంగా అభివర్ణించారు. '2026 అసెంబ్లీ ఎన్నికల క్షేత్రం గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీనికి ఏకైక కారణం మన రాజకీయ రాక అని అందరూ అంటున్నారు. అందుకే ఈ క్షేత్రాన్ని మనమే సొంతం చేసుకుందాం. స్పష్టమైన, నైపుణ్యం కలిగి వ్యూహంతో, అధికార రాజకీయాల్లో గుర్తింపు వైపు ముందుకు సాగుతాము. ప్రజలందరి మద్దతుతో, దృఢ సంకల్పం, ఐక్యతతో రంగంలోకి దిగి పోరాడుదాం. పాలనా పగ్గాలను చేజిక్కించుకునే ప్రజాస్వామ్య లక్ష్యాన్ని మనం దృఢంగా సాధిస్తాం' అని విజయ్ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**అవినీతి, దుష్టశక్తులను ఓడించేది టివికెనే : విజయ్**

తమిళనాడులో అవినీతి, దుష్టశక్తులను టివికె ఓడించగలదని విజయ్ చెప్పారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'దుష్టశక్తులను ఓడించాలంటే, పవిత్ర శక్తి అయిన టివికెనే అవసరం. మేమే టాప్ ఇంజిన్. ప్రజలు విజిల్ గుర్తుకు ఓటేయేలా మీరు కృషి చేయాలి. టివికె తమిళ రాజకీయాల్లో విజిల్ బ్లోయర్. మీ విజిల్ శబ్దం అవినీతి పరులను భయపెట్టి పారిపోయేలా చేయాలి. అది టివికె పాలక శక్తిని ఉత్తేజపరుస్తుంది. డీఎంకే చేసే తప్పులను మేము ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇంతకు ముందు ఎవరూ దీన్ని ధైర్యంగా చేయలేదు' అని విజయ్ అన్నారు. తనపై వస్తున్న విమర్శల గురించి విజయ్ స్పందించారు. నటుడిగా రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఎన్‌జీ రంగా ఎదుర్కొన్న విమర్శలను గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి కూటమి సహా బహుముఖ పోటీ ఏర్పడే అవకాశం ఉందని విజయ్ చెప్పారు.

# పెండింగ్‌లో కేంద్ర బకాయిలు

రాజ్యసభ నుంచి టిఎంసి ఎంపిలు వాకౌట్



**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్‌కు కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆ పార్టీ ఎంపిలు రాజ్యసభలో మరోసారి లేవనెత్తారు. సోమవారం ఉదయం సభ సమావేశమైన కొద్దిసేపటికే వారు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కేంద్రం పశ్చిమ బెంగాల్‌కు రూ. 2 లక్షల కోట్లు బాకీ ఉందని రాజ్యసభలో పార్టీ ఉప నాయకురాలు సాగరిక ఘోష్ ఆరోపించారు. బడ్జెట్‌లో బెంగాల్ గురించి ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం, బెంగాల్ బకాయిలు ఇప్పటికీ నిలిచిపోవడంతో సోమవారం రాజ్యసభలో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) వాకౌట్ చేసింది. ఎంజి నరేగా, ఆవాస్ యోజన వివిధ విభాగాల కింద బెంగాల్‌కు రూ. 2 లక్షల కోట్లు రావాల్సి ఉందని ఘోష్ పిటిఐకి వెల్లడించారు. ఇది సమాఖ్య నిర్మాణాన్ని, కేంద్ర,రాష్ట్ర సంబంధాలను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ఆరోపించారు. ఆదివారం సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమ బెంగాల్‌ను విస్మరించారని ఘోష్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో బెంగాల్‌ను విస్మరించడానికి ఎంచుకున్న విధానం వల్లే తాము ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తామని, వాకౌట్ చేశామని ఆమె అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ఓటమి పాలైన తర్వాత కేంద్రం రాష్ట్రంపై వివక్ష చూపుతోందని రాజ్యసభ ఎంపి మమతా ఠాకూర్ ఆరోపించారు. 2021లో బెంగాల్ ప్రజలు బిజెపిని నిర్ణయాత్మకంగా తిరస్కరించినప్పటి నుండి, కేంద్రం ఎంజినరేగా వేతనాలను నిరోధించడం, రోడ్లు, గ్రామీణ మౌలిక సదుపాయాలకు నిధులను నిలిపివేయడం, పేదలు, అణగారిన వర్గాల కోసం ఉద్దేశించిన సంక్షేమ సంబంధిత కేటాయింపులను నిలిపివేయడం ద్వారా సమాఖ్య బాధ్యతకు బదులుగా ప్రతీకార వైఖరితో స్పందించిందని టిఎంసి నాయకులు అన్నారు. 'రాష్ట్రంపై ఈ క్రమబద్ధమైన వివక్ష ఆమోదయోగ్యం కాదని నొక్కి చెబుతూ, ఈ తీవ్రమైన అన్యాయానికి నిరసనగా, టిఎంసి రాజ్యసభ ఎంపిలు పార్లమెంటు నుండి వాకౌట్ చేశారు. బెంగాల్‌కు సరైన బకాయిలు లభించే వరకు పార్లమెంటు లోపల, వెలుపల మేము మా గొంతును లేవనెత్తుతూనే ఉంటాము' అని ఆమె పేర్కొన్నారు.

# 25 శాతం తగ్గనున్న పదో తరగతి సిలబస్..

వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు చేయనున్న కేరళ

**తిరువనతంపురం :** విద్యారంగంలో ముందుండే రాష్ట్రంగా గుర్తింపు తెచ్చుకున్న కేరళ.. మరో కీలక మార్పు దిశగా అడుగులేయబోతుంది. పదో తరగతి విద్యార్థులపై అకడమిక్ భారాన్ని తగ్గించేందుకు 25 శాతం సిలబస్ తగ్గించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని కేరళలోని కొల్లాంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి వి.శివకుట్టి ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ నిర్ణయం అమలవుతుందని ఆయన వెల్లడించారు. విద్యార్థులపై ప్రస్తుతం సిలబస్ ఎక్కువగా ఉండటంతో ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సిలబస్ తగ్గించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అక్కడి ప్రభుత్వాన్ని చాలా కాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నిపుణుల సూచన మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి సిలబస్‌ను 25 శాతం తగ్గించనున్నారు. ఇందుకు సంబంధిత కమిటీ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో 25 శాతం తగ్గుతుందని, అయితే, కంటెంట్ మాత్రం మారకుండా చూసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలని, ఒత్తిడి తగ్గించాలనే లక్ష్యంతోనే, విశాల దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

# తమిళనాడు–కర్ణాటక జలవివాదంపై ట్రిబ్యునల్

నెలరోజుల్లో నోటిఫికేషన్: కేంద్రానికి 'సుప్రీం' ఉత్తర్వు



**న్యూఢిల్లీ:** తమిళనాడు–కర్ణాటక మధ్య జల వివాద పరిష్కారానికి, పెన్నానదీ జలాల సమాన పంపిణీకోసం ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మార్గదర్శనం చేసింది. ఈ మేరకు నెల రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ మార్గదర్శనం చేసింది. "ఈ రెండు రాష్ట్రాలమధ్య జల వివాద పరిష్కారానికి ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ అధికారిక గజెట్‌లో నోటిఫికేషన్ జారీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం దూరంగా ఉండటానికి గకారణం మాకు కనిపించలేదు, అందువల్ల సమస్య పరిష్కారం నిమిత్తం ఈ రోజు నుండి నెలరోజులలోపు ఒక నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది" ఉత్తర్వులో ధర్మాసనం తెలియజేసింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య పెన్నానదీ జలాల పంపిణీపై వివాదాలున్నాయి. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం 2018 లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1892 నాటి ఒప్పందానికి కర్ణాటక కట్టుబడి ఉండాలని కోరింది. ఈ ఒప్పందం ప్రకారం పొరుగురాష్ట్రం తమిళనాడుకు చెప్పకుండా, ఎలాంటి సమాచారం, ప్రణాళికలు ఇవ్వకుండా నదిపై ఎలాంటి చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ జలాల దారి మళ్ళింపు చర్యలూ చేపట్టకూడదని, ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరింది. నదిని దారి మళ్ళించి చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్న కర్ణాటక ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకించింది. రాష్ట్రాలమధ్య ప్రవహించే ఈ నదీ జలాలు జాతీయ ఆస్తి అని, ఏ రాష్ట్రం ప్రత్యేకంగా ఇదంతా మాదే అని ప్రకటించుకునే అవకాశం లేదని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన తన పిటిషన్‌లో వాదించింది. దక్షిణ పెన్నార్ నదిని కర్ణాటకలో దక్షిణ పినాకిని, తమిళనాడులో పెన్నైయార్,పొన్నైయార్ అనీ పిలుస్తారు. తమిళనాడులో 497 కి.మీ పరీవాహకప్రాంతం గల రెండో అతిపెద్ద నది పెన్నైయార్. కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్ళాపుర జిల్లా నందిహిల్స్ పెన్నానది జన్మస్థానం కావడంతో కర్ణాటక ప్రభుత్వం పెద్ద గొంతుతో వాదిస్తోంది. పెన్నానదికి రెండు రాష్ట్రాల లోనూ 3,690 చదరకు కి.మీ పరీవాహకప్రాంతం ఉంది. వర్షాకాలంలో తప్ప దాదాపు ఏడాది అంతా ఈ నదిలో నీటి ప్రవాహం ఉండదు. కర్ణాటకలో పరిశ్రమల మురికినీరు ఈ నదిలోనే కలుస్తూ ఉండటం మరో వివాదంగా ఉంది.

## ఎఐ విమాన ప్రమాదంపై

# దర్యాప్తు జరుపుతున్నాం

రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానమిచ్చిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ



**న్యూఢిల్లీ :** గత ఏడాది జూన్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలను దర్యాప్తు చేస్తున్నామని, దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. 260 మంది మృతి చెందిన ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) దర్యాప్తు చేస్తోంది. భారతదేశంలో అత్యంత దారుణమైన విమాన ప్రమాదాలలో ఒకటి, జూన్ 12, 2025న అహ్మదాబాద్ నుండి లండన్ గాట్విక్‌కు వెళ్లే ఎయిర్ ఇండియా బోయింగ్ 7878 విమానం ఎఐ 171 అయిన వెంటనే కూలిపోవడంతో 241 మంది ప్రయాణికులు సహా మొత్తం 260 మంది మరణించారు. ఎఎఐబి దర్యాప్తు పురోగతిలో ఉందని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ సోమవారం రాజ్యసభకు తెలిపారు. 'ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఆయన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. గత ఏడాది జులై 12న విడుదలైన ఈ ప్రమాదంపై ప్రాథమిక నివేదికలో, విమానం రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా ఒక సెకను వ్యవధిలో నిలిపివేయబడిందని, దీని వలన అయిన వెంటనే కాక్‌పిట్‌లో గందరగోళం ఏర్పడిందని ఎఎఐబి తెలిపింది. 'కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్‌లో, పైలట్‌లలో ఒకరు మరొకరిని ఎందుకు ఆపివేసారని అడుగుతున్నట్లు వినబడింది. మరొక పైలట్ తాను అలా చేయలేదని ప్రతిస్పందించాడు' అని ఆయన చెప్పారు.

## బిజెపి స్కామ్ బయటపెడతానన్న

# 10 రోజులకే అజిత్ మృతి

దాదా' మరణంపై సంజయ్ రౌత్ అనుమానం



**ముంబయి :** మహారాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణంపై శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ అనుమానం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ కుంభకోణాన్ని బయటపెడుతానని బిజెపిని బెదిరించిన 10 రోజుల్లోనే ఆయన మరణించారని తీవ్ర ఆరోపణలు చేశారు. బిజెపితో తెగదెంపులు చేసుకుని ఎన్‌సిపిలో తిరిగి విలీనం కావాలని అజిత్ పవార్ నిర్ణయం తీసుకున్నారని ఆయన వెల్లడించారు. ఈ పరిణామాలన్నింటిని పరిశీలిస్తే ఆయన మరణం అనుమానాస్పదంగా కనిపిస్తుందని అన్నారు. 'అజిత్ దాదా మరణంపై కచ్చితంగా ప్రశ్నలు తలెత్తుతాయి, అలాగే ప్రశ్నించాలి కూడా. మహారాష్ట్రకు చెందిన అజిత్ పవార్ లాంటి కీలక నేత విమాన ప్రమాదంలో మరణించిన తీరు, వెలుగులోకి వస్తున్న వాస్తవాలపై విచారణ జరపాలి. ఈ విషయంలో ఏదో అనుమానాస్పదంగా ఉందని నేను అనుకుంటున్నాను. ఈ ప్రశ్నలను అజిత్ దాదా పార్టీ వారే లేవనెత్తుతున్నారు. ఆయన మరణం అనుమానాస్పదంగా ఉంది. అజిత్ పవార్ చాలా రోజుల నుంచి బిజెపి స్కామ్‌కు సంబంధించిన ఫైల్ తన వద్ద ఉందని చెబుతున్నారు. దీనిని బయటపెడతానని ఇటీవలె జనవరి 15న కూడా చెప్పారు. ఆయన చెప్పిన పది రోజులకే మరణించారు. ఇవన్నీ చూస్తే అనుమానాస్పదంగా కనిపిస్తుంది. బిజెపి స్కామ్‌కు సంబంధించిన ఫైల్ ఉందని చెప్పినప్పటి నుంచే నాకు అనుమానంగానే ఉంది. వీటిని గమనిస్తే బిజెపితో తెగదెంపులు చేసుకోవాలని అజిత్ పవార్ నిర్ణయించుకున్నట్లే ఉన్నారు. తిరిగి శరద్ పవార్‌తో కలిసి పని చేయాలని నిర్ణయం తీసుకున్నట్లే కనిపిస్తుంది. స్వయంగా ఉపముఖ్యమంత్రే స్కామ్ గురించి బయటపెట్టారు. ఇరిగేషన్ బడ్జెట్‌ను ఎక్కువగా పెంచి వాటిని పార్టీ నిధులకు మళ్లించారని అజిత్ పవార్ చెప్పారు. అజిత్ పవార్ లాంటి ముఖ్య నేత ప్రయాణించే విమానంలో ఓఎస్‌డీ సహా కీలకమైన వ్యక్తులు ఎవరూ లేరు. ఇంకా ఆ విమానానికి ఎలాంటి మెయింటెనెన్స్ సర్టిఫికెట్ లేదు.

# డిప్యూటీ సిఎంగా సునేత్ర వెనుక బిజెపి 'సూత్రధారి'

శివసేన (యుబిటి) అధికారక పత్రిక సామ్నా సంపాకీయంలో ఆరోపణలు

**ముంబయి :** తన భర్త అజిత్ పవార్ నిష్క్రమించిన కొద్ది రోజులకే, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎన్‌సిపి నాయకురాలు సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేయడం వెనుక బిజెపి నాయకత్వం 'సూత్రధారి' అని ప్రతిపక్ష శివసేన (యుబిటి) సోమవారం పేర్కొంది. సేన (యుబిటి) అధికార పత్రిక 'సామ్నా'లోని సంపాదకీయం కూడా బిజెపి నాయకత్వం, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సునీల్ తట్కరే, ప్రఫుల్ పటేల్ రెండు ఎన్‌సిపి వర్గాల ఏకీకరణను కోరుకోవడం లేదని ఆరోపించింది. పుణె జిల్లాలోని బారామతి వద్ద జరిగిన విమాన ప్రమాదంలో ఎన్‌సిపి నాయకురాలు అజిత్ పవార్, మరో నలుగురు మరణించిన మూడు రోజులకే, రాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సిఎంగా సునేత్రా పవార్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ పరిణామం జరిగిన వేగంపై కొన్ని వర్గాల నుండి విమర్శలు వచ్చాయి. ప్రత్యర్థి ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత, అజిత్ పవార్ బాబాయ్ శరద్ పవార్ శనివారం తన ప్రమాణ స్వీకారం గురించి తనకు తెలియదని పేర్కొన్నారు. సునేత్రా పవార్ డిప్యూటీ సిఎం పదవి అలంకారప్రాయంగా ఉండకూడదని, ఆమె 'గుంగి గుడియా' (మూగ బొమ్మ) కాకపోవచ్చునని, సమర్థవంతంగా పనిచేయవచ్చని సంపాదకీయం పేర్కొంది. ఎన్‌సిపి 'సనాతన భావాలు కలిగిన' బిజెపితో పొత్తులో ఉందని, తన భర్త మరణానంతర కర్మలు పూర్తి కాకముందే సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేయడం హిందూత్వ విశ్వాసాలకు సరిపోదని అది పేర్కొంది. సునేత్రా పవార్ డిప్యూటీ సిఎంగా ఎవరి కోరిక అనేది మహారాష్ట్ర ముందున్న ప్రశ్న అని, ఎందుకంటే ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షురాలు శరద్ పవార్, దాని వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సులే, లేదా పవార్ కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియదని సంపాదకీయం పేర్కొంది. సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం కోసం బారామతి నుండి ముంబైకి వెళ్తున్నట్లు కనీస సూచన కూడా ఇవ్వలేదని అది పేర్కొంది. ఈ రాజకీయాల వెనుక బిజెపి నాయకత్వం 'సూత్రధారి' అని ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) పేర్కొంది. అజిత్ పవార్ మరణం తర్వాత పవార్ కుటుంబంలో, మహారాష్ట్ర రాజకీయాల్లో చిక్కులు పెరిగాయి. ఈ సమస్యలు పరిష్కారం కాకూడదని చాలామంది కోరుకుంటున్నారు' అని సామ్నా సంపాదకీయంలో పేర్కొన్నారు. అజిత్ పవార్ మరణం తర్వాత, కొంతమంది నాయకులు మరింత ప్రతిష్టాత్మకంగా మారడంతో, పార్టీలో డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించడానికి పోటీ ఏర్పడటంతో ఎన్‌సిపిలో అశాంతి నెలకొందని సంపాదకీయం పేర్కొంది. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి కచ్చితంగా స్వతంత్రంగా పోటీ చేస్తుందని, శివసేన, ఎన్‌సిపి నుండి చాలా మంది ఎమ్మెల్యేలు కాషాయ పార్టీలో చేరుతారని సంపాదకీయం పేర్కొంది.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం – C
**ప్రకటన**
(చట్టంలోని సెక్షన్ – 11 క్రింద 10 A మినహాయింపు ఇవ్వబడినది)
(రూల్ 6/12 చూడుము)

గెజిట్ నెం. GHMC-12 తేది: 27.01.2026
నెం. C/37/2026 తేది: 27.01.2026

తెలంగాణ ప్రభుత్వం/ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) & కమిషనర్, జిహెచ్ఎంసి వారికి ప్రజా ప్రయోజనం కోసం రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలో మొత్తం 4427.31 చదరపు గజాలు ప్రతిపాదిత 60 మీటర్ల వెడల్పు రహదారి విస్తరణ కోసం H-CITI కింద గచ్చిబౌలి ఫ్లైఓవర్ నుండి మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్ వరకు బొటానికల్ గార్డెన్ (అంజయ్య నగర్ నుండి రామ్కీ టవర్ రోడ్డు) వరకు భూమి అవసరమని భావించడమైనది.

కాబట్టి, పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలో సుమారుగా 4427.31 చదరపు గజాల ప్రామాణిక కొలత గల భూమిని సేకరించడానికి ప్రతిపాదించబడినట్లుగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది, దాని వివరణాత్మక వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| క్ర సంఖ్య | ప్రాంగణం నెం. / సర్వే నెం | ఖుష్కీ రకం | తరి రకం | సేకరణ క్రింద విస్తీర్ణం చ.గ. లలో | ఆసక్తి గల వ్యక్తి పేరు | సరిహద్దులు: దక్షిణం | ఉత్తరం | తూర్పు | పడమర | చెట్లు: రకం | సంఖ్య | కట్టడాలు: రకం | ఇంటి నెం. వివరాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 1-60/30/1/134 | - | - | 36.66 | శ్రీ పి.మఘరం చౌదరి | లోకేషన్ స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 2 | 1-60/30/1/134 | - | - | 36.66 | శ్రీ పి.ప్రకాష్ చౌదరి | | | | | - | - | - | - |
| 3 | 1-60/30/1/134 | - | - | 9.22 | శ్రీ అజహర్ హుస్సేన్ | | | | | - | - | - | - |
| 4 | 1-60/30/2/134 | - | - | 95.77 | శ్రీమతి ఎం.వసంత | | | | | - | - | - | - |
| 5 | 1-60/A/3 | - | - | 110.44 | శ్రీమతి పోని దేవి చౌదరి | | | | | - | - | - | - |
| 6 | ప్లాట్ నెం.4, సర్వే నెం.134 | - | - | 110.00 | శ్రీమతి కళావతి | | | | | - | - | - | - |
| 7 | 1-60/30/11/134 | - | - | 26.11 | ఎల్ నరసింగరావు | | | | | - | - | - | - |
| 8 | 1-60/30/8/5 | - | - | 160.44 | శ్రీ చెల్లూరి శ్రీనివాస్ | | | | | - | - | - | - |
| 9 | 1-60/8/6 | - | - | 121.00 | శ్రీ మంథని సుధాకర్ | | | | | - | - | - | - |
| 10 | 1-60/30/8/134 | - | - | 65.11 | శ్రీ పవన్ కుమార్ | | | | | - | - | - | - |
| 11 | 1-60/30/9/134 | - | - | 55.55 | శ్రీ నవీన్ చౌదరి | | | | | - | - | - | - |
| 12 | 1-60/30/7/134 | - | - | 140.00 | గణేష్ గౌడ్ & కె.సుచిత్ర | | | | | - | - | - | - |
| 13 | 1-60/30/7/134/1 | - | - | 19.44 | శ్రీమతి కె.భాగ్యమ్మ | | | | | - | - | - | - |
| 14 | సర్వే నెం. 134 | - | - | 192.22 | ఆలయ ఆస్తి | | | | | - | - | - | - |
| 15 | 1-60/30/12 | - | - | 10.44 | శ్రీమతి గంగాదేవి చౌదరి | | | | | - | - | - | - |
| 16 | 1-60/34/1 | - | - | 31.66 | ఎల్. దశరథ రామ రెడ్డి | | | | | - | - | - | - |
| 17 | 1-60/36 | - | - | 97.55 | శ్రీ పి.శ్రీనివాసరావు | | | | | - | - | - | - |
| 18 | 1-60/38/A | - | - | 112.33 | శ్రీమతి ఓ సాయిలు | | | | | - | - | - | - |
| 19 | ఉత్తర భాగం 1-60/30/10/A | - | - | 55.00 | శ్రీమతి కమలా దేవి | | | | | - | - | - | - |
| 20 | దక్షిణ భాగం 1-60/30/10/A | - | - | 54.78 | శ్రీ ప్రకాష్ చౌదరి | | | | | - | - | - | - |
| 21 | 1-60/30/10 & 1-60/30/9/5/9 | - | - | 163.33 | శ్రీ చి.కార్తీక్ రెడ్డి | | | | | - | - | - | - |
| 22 | 1-60/30 | - | - | 132.00 | శ్రీ ఇ.గోపాల్ & ఇ.జైపాల్ | | | | | - | - | - | - |
| 23 | 1-60/30/118/136 | - | - | 136.66 | శ్రీమతి మాయా అగర్వాల్ | | | | | - | - | - | - |
| 24 | 1-60/30/89/136/1 | - | - | 121.00 | శ్రీ కె గణేష్ గౌడ్ | | | | | - | - | - | - |
| 25 | 1-60/30/90/136 | - | - | 11.44 | శ్రీ కె.రవీంద్ర | | | | | - | - | - | - |
| 26 | 1-88/136 | - | - | 63.22 | 1. డాక్టర్ అమరేందర్ రెడ్డి, 2. సి.శ్రీధర్ రెడ్డి, 3. పి.సుదర్శన్ రెడ్డి | | | | | - | - | - | - |
| 27 | సర్వే నెం. 136 | - | - | 116.66 | M/s. ఎస్‌సి కార్పొరేషన్ | | | | | - | - | - | - |
| 28 | 1-60/30/34/136 & 2-62/A/4/1 | - | - | 573.33 | శ్రీ మహమ్మద్ షహనాజ్ ఖానా | | | | | - | - | - | - |
| 29 | 1-60/30/7/136 | - | - | 240.00 | శ్రీమతి మసరత్ బేగం | | | | | - | - | - | - |
| 30 | 1-60/30/9/136 | - | - | 34.89 | శ్రీ జగత్ కుమార్ గౌడ్ | | | | | - | - | - | - |
| 31 | 1-60/30/5/136 | - | - | 110.00 | శ్రీమతి విద్యా బాయి | | | | | - | - | - | - |
| 32 | 1-60/30/6/136 | - | - | 110.00 | శ్రీ సి.వెంకట రాజు | | | | | - | - | - | - |
| 33 | 1-60/30/10/136 | - | - | 30.77 | శ్రీ ఎం.నీలావతి | | | | | - | - | - | - |
| 34 | 1-60/30/11/136 | - | - | 19.44 | శ్రీ.రవికాంత్ | | | | | - | - | - | - |
| 35 | 1-60/30/12/136 | - | - | 11.66 | శ్రీమతి.పి.భారతమ్మ & శ్రీ పి.ప్రతాప్ రెడ్డి | | | | | - | - | - | - |
| 36 | 1-60/4 | - | - | 126.44 | శ్రీ బాబీ వెంకటేష్ | | | | | - | - | - | - |
| 37 | 1-60/30/1/136 | - | - | 156.22 | శ్రీ సయ్యద్ మొహియుద్దీన్ అలీ ఖాన్ | | | | | - | - | - | - |
| 38 | 1-60/2 | - | - | 152.22 | శ్రీ చదవ తరుణ్ రెడ్డి | | | | | - | - | - | - |
| 39 | 1-60/20/1 | - | - | 47.55 | శ్రీ కె.నిఖిల్ రెడ్డి & కె. నరసింహారెడ్డి | | | | | - | - | - | - |
| 40 | 1-60/3/P& 1-60/3 | - | - | 112.22 | శ్రీ నాదెళ్ల శ్రీనివాస్ | | | | | - | - | - | - |
| 41 | 1-60/8 | - | - | 212.44 | శ్రీమతి లీలా దేవి మరియు సంతోషి దేవి | | | | | - | - | - | - |
| 42 | సర్వే నెం.136 | - | - | 123.00 | పోచమ్మ మైసమ్మ దేవాలయం | | | | | - | - | - | - |
| 43 | 1-60/1 | - | - | 82.44 | శ్రీ బి రాజశేఖర్ రెడ్డి | | | | | - | - | - | - |
| | మొత్తం | | | 4427.31 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) సెక్షన్-11(1) యొక్క సవరించబడిన భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయ బద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు చట్టం 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017) ఏర్పాట్ల క్రింద సంబంధితులు అందరికీ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమిషనర్, GHMC, హైదరాబాద్ వారి కార్యాలయంలో ఉంచబడిన భూమి యొక్క ప్లాన్‌ను ఏదేని పని రోజున కార్యాలయ పని వేళల్లో తనిఖీ చేసుకొనగలరు. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్–సహిత–సముచిత ప్రభుత్వం అధీకృత అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, కమిషనర్, GHMC, హైదరాబాద్ వారిని మరియు వారి సర్వే సిబ్బందిని సర్వే భూమి నందు ప్రవేశించుటకు మరియు భూమిని సర్వే చేయుటకు, ఏదేని భూమి యొక్క లెవల్స్ తీసుకొనుటకు, సబ్–సాయిల్‌ను తవ్వుటకు లేదా బోరు వేయుటకు మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ – 12 నందు ఏర్పాటు చేయబడిన మరియు నిర్దిష్ట పరిచిన విధంగా తమ పని కొరకు అవసరమైన అన్ని ఇతర చర్యల్ని చేపట్టు నిమిత్తం వారిని అధీకృతుల్ని చేయుటకు సమ్మతించినారు.

చట్టం యొక్క సెక్షన్–11(4) క్రింద స్పెషల్ కలెక్టర్ వారి ముందస్తు అనుమతి లేకుండా సదరు ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అయినా సదరు భూమికి సంబంధించి ఏ విధమైన లావాదేవీ నిర్వహించుట కానీ, ఏదేని లావాదేవీ కొరకు ప్రేరేపించుట కానీ అనగా విక్రయం / కొనుగోలు, వగైరా లేదా సదరు భూమిపై ఏవేని తాకట్టు రుణభారాలు కల్పించుట కానీ చేయరాదు.

ఒకవేళ సేకరణకు సంబంధించి ఏవేని అభ్యంతరములు ఉన్న యెడల మరియు సంప్రదింపు ద్వారా నష్ట పరిహారం సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తి గల / బాధిత వ్యక్తులు అందరి నుండి ఏవేని క్లెయిములు ఉన్నచో చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజుల్లోగా స్పెషల్ కలెక్టర్ / అధీకృత అధికారి సమక్షమున ఫైల్ చేయవలెను.

సం/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.),
జి.హెచ్.ఎం.సి., హైదరాబాద్.

సం/- స్పెషల్ కలెక్టర్, (భూ.సే.) &
కమీషనర్, జి.హెచ్.ఎం.సి., హైదరాబాద్.


DIPR No. 1098/LA/PP-Advt/Agency/2025-26

# పని హక్కుపై ఉక్కుపాదం!

ఉపాధి కల్పించలేని ప్రభుత్వాలు ఎవరికి ప్రయోజనం. ఏటా కోటి ఉద్యోగాల హామీ దశాబ్దానికిపైగా అటకపైనే ఉంది. 2006 ఫిబ్రవరి 2న గ్రామీణ ఉపాధికి హామీ ఇచ్చే 'ఎంజినరేగా' చట్టం వచ్చినప్పుడు, దేశ చరిత్రలో ఒక కీలక మలుపుగా పేర్కొన్నారు. కానీ మోదీ సర్కారు ఆ ఉన్నతాశయంతో చేసిన చట్టాన్ని అటకెక్కించి, 'విబి – జి రామ్ జి'ని ప్రవేశపెట్టడం ముమ్మాటికీ పని హక్కుపై ఉక్కుపాదం మోపడమే. ప్రతిపక్ష పార్టీలు సోమవారం పార్లమెంటులో పలు అంశాలు లేవనెత్తాయి. విస్తృత చర్చకు డిమాండ్ చేశాయి. గ్రామీణ భారత సమాజంలో ఉపాధి అనేది కేవలం ఆదాయం పొందే మార్గంగా మాత్రమేగాక, జీవన భద్రత, ఆత్మగౌరవం, సామాజిక స్థిరత్వం, ప్రజాస్వామ్య భాగస్వామ్యం వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్న ఓ కీలక అవసరం. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన 'ఎంజినరేగా'గ్రామీణ పేదలకు పని దయ కాదు, హక్కు అనే భావనను అందించింది.

రెండు దశాబ్దాల పాటు ఆ చట్టం గ్రామీణ జీవితాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేసింది. అదే చట్టాన్ని పూర్తిగా భర్తీ చేస్తూ కొత్త వ్యవస్థను తీసుకురావడం పట్ల ఇప్పుడు సహజంగానే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వ్యతిరేకత వెనుక రాజకీయ భావోద్వేగా లు కంటే లోతైన సామాజిక, ఆర్థిక, రాజ్యాంగ సంబంధిత కారణాలే ఎక్కువ గా ఉన్నాయి. పాత గ్రామీణ ఉపాధి చట్టం ఒక హక్కు ఆధారిత చట్టం. గ్రామీణ ప్రాంతంలో నివసించే ఏ పౌరుడైనా పని కావాలంటూ దరఖాస్తు చేస్తే, నిర్దిష్ట కాలవ్యవధిలో పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండేది. పని ఇవ్వలేకపోతే పరిహారం చెల్లించాల్సిన నిబంధన కూడా ఉండేది. ఈ చట్టం ఒక సంక్షేమ పథకం కాదు. ఒక చట్టబద్ధమైన హక్కు. ఈ భావన రాజ్యాంగంలోని దిశానిర్దేశక సూత్రాల నుంచి ప్రేరణ పొందింది. గ్రామీణ పేదరికాన్ని ఎదుర్కొనే బాధ్యత రాష్ట్రానిదే అనే భావన దీనిలో నిక్షిప్తమై ఉంది. కొత్త చట్టం ఈ హక్కు భావనను బలహీనపరుస్తోంది. ఇప్పుడు పని పౌరుల డిమాండ్ ఆధారంగా కాకుండా, ప్రభుత్వ ప్రణాళికలు, బడ్జెట్ పరిమితులు, ఎంపిక చేసిన ప్రాంతాల ఆధారంగా మాత్రమే అందుబాటులోకి వస్తోంది. పాత వ్యవస్థలో డిమాండ్ ఆధారిత ఉపాధి ఒక కీలక బలంగా ఉండేది. గ్రామంలో వర్షాలు పడకపోయినా, పంటలు నష్టపోయినా, మార్కెట్ పరిస్థితులు దెబ్బతిన్నా, ప్రజలు వెంటనే పని కోరగలిగేవారు. అవసరాన్ని ప్రాతిపదికగా తీసుకున్న కారణంగా, పని అవసరం పెరిగినప్పుడు ఖర్చును కూడా పెంచేవారు. కానీ, కొత్త విధానంలో ముందుగా కేటాయించిన బడ్జెట్ మేరకే పని ఉంటుంది. ఎంత అవసరం ఉన్నా, కేటాయింపు పూర్తయిన తర్వాత పని నిలిచిపోతుంది. ఇది గ్రామీణ జీవితం ఎదుర్కొనే అనిశ్చిత పరిస్థితులకు సరైన స్పందన కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రకృతి మీద, వ్యవసాయం మీద ఆధారపడినది. అక్కడ అవసరాలు ముందుగా అంచనా వేయడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. అలాంటి పరిస్థితుల్లో హక్కు స్థానంలో పరిపాలనా హామీ మాత్రమే ఉండటం పేదల భద్రతను తగ్గిస్తుంది. సంవత్సరంలో రెండు నెలలు ఉపాధిని పూర్తిగా నిలిపివేయడం కొత్త చట్టంలో మరో ప్రధాన అభ్యంతరం. ఈ విరామం వ్యవసాయ పనుల కాలంతో ముడిపడి ఉందని చెప్పబడుతున్నప్పటికీ, వాస్తవ ప్రభావం మాత్రం భిన్నంగా ఉంటుందని విమర్శకులు చెబుతున్నారు. గ్రామీణ ఉపాధి హామీ ఉన్నప్పుడు, కూలీలకు ఒక ప్రత్యామ్నాయ అవకాశం ఉండేది. వ్యవసాయ యజమానులు తక్కువ కూలి ఇవ్వాలనుకున్నప్పుడు, కూలీలు ప్రభుత్వ పనికి వెళ్లే అవకాశం ఉండేది. ఈ పరిస్థితి వల్ల కూలీలకు తమదైన ఎంపిక ఉండేది. కొత్త వ్యవస్థలో రెండు నెలల విరామంతో కూలీలు పూర్తిగా ప్రైవేట్ యజమానులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల తక్కువ వేతనాలు, అసురక్షిత పనిపరిస్థితులు పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా భూమిలేని కూలీలు ఈ మార్పుతో ఎక్కువగా నష్టపోతారు. స్థానిక స్వయం పాలనపై ప్రభావం కూడా వ్యతిరేకతకు ఒక ప్రధాన కారణం. పాత చట్టంలో గ్రామ పంచాయతీల పాత్ర అత్యంత కీలకం. గ్రామానికి ఏ పనులు అవసరం, ఎక్కడ నీటి సంరక్షణ చేయాలి, ఏ రహదారి అవసరం, ఏ చెరువు పూడిక తీయాలి వంటి నిర్ణయాలు గ్రామస్థాయిలోనే తీసుకునేవారు. ఈ ప్రక్రియలో గ్రామ సభలు, ప్రజల భాగస్వామ్యం కీలక పాత్ర పోషించేవి. దీనివల్ల గ్రామీణ ప్రజాస్వామ్యం బలోపేతమైంది. కొత్త చట్టంలో ఈ అధికారాలు పైస్థాయికి వెళ్లిపోవడం ఆందోళనకరం. పనుల ప్రణాళికలు, ప్రాధాన్యతలు కేంద్రస్థాయిలో జరిగితే, గ్రామ పంచాయతీలు కేవలం అమలు చేసే యంత్రాంగంగా మారిపోతాయి. ఇది భారత రాజ్యాంగంలో ప్రతిపాదించిన వికేంద్రీకరణ సూత్రాలకు విరుద్ధమని విమర్శలు వస్తున్నాయి.

ఆర్థిక కోణంలో చూస్తే, రాష్ట్రాలపై పెరుగుతున్న వ్యయం మరో ప్రధాన సమస్యగా మారింది. పాత వ్యవస్థలో రాష్ట్రాల వాటా తక్కువగా ఉండేది. దీనివల్ల ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలు కూడా ఉపాధి పనులను విస్తృతంగా అమలు చేయగలిగాయి. కొత్త చట్టంలో రాష్ట్రాలపై భారీ వ్యయాన్ని మోపుతున్నారు. ఇప్పటికే అప్పులు, ఆదాయ లోటు, సంక్షేమ వ్యయాలతో ఇబ్బంది పడుతున్న రాష్ట్రాలకు ఇది అదనపు భారం అవుతుంది. ఫలితంగా కొన్ని రాష్ట్రాలు ఖర్చును భరించలేక పనులను పరిమితం చేసే అవకాశం ఉంది. అలా జరిగితే ఉపాధి హక్కు కాగితాలకే పరిమితమై, వాస్తవంలో గ్రామీణ పేదలకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉంది. పారదర్శకత, సామాజిక తనిఖీల విషయంలో కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ఆస్తుల సృష్టి విషయంలో కూడా పాత చట్టం కీలక పాత్ర పోషించింది. చెరువులు, కాలువలు, గ్రామ రహదారులు, నీటి సంరక్షణ నిర్మాణాలు వంటి లక్షలాది ఆస్తులు ఈ చట్టం ద్వారా వృద్ధి చెందాయి. ఇవి కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా, దీర్ఘకాలిక గ్రామీణ అభివృద్ధికి పునాదిగా నిలిచాయి. కొత్త వ్యవస్థలో ప్రాధాన్యతలు మారడం వల్ల ఇలాంటి స్థానిక అవసరాల ఆధారిత ఆస్తుల సృష్టి తగ్గిపోతుందనే భయం ఉంది. కేంద్రస్థాయి ప్రణాళికలు స్థానిక అవసరాలను పూర్తిగా ప్రతిబింబించలేవన్న భావన కూడా దీనికి తోడవుతోంది. ఏ రకంగా చూసినా ఎంజినరేగాతో పోలిస్తే కొత్త చట్టం భారత గ్రామీణ అవసరాలకు ఏమాత్రం అనువుగా లేవు. ఈ చట్టాన్ని ఉపాధి హక్కుపై గొడ్డలిపెట్టుగా ప్రతిపక్షాలు అభవర్ణించడంలో ఏమాత్రం తప్పులేదు.



## కేంద్రం తెచ్చిన కొత్త చట్టం ఓ లోపం

**రెండు దశాబ్దాల క్రితం యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక పరివర్తనాత్మక చట్టం. ఇటీవల కేంద్ర తీసుకొచ్చిన కొత్త పథకం ఒక లోపం. పాత పథకాన్ని కొత్త పథకం బుల్డోజ్ చేసింది. ఈ 20 ఏండ్లలో గ్రామీణ ప్రజలకు ఈ పథకం 180 కోట్ల పనిదినాలను కల్పించింది. అంతేగాక దాదాపు 10 కోట్ల సామాజిక ఆస్తులను సృష్టించింది. ఈ పథకం వలసలను తగ్గించింది. గ్రామపంచాయతీలను బలోపేతం చేసింది. గ్రామీణ పేదలు అధిక వేతనాలు పొందే శక్తిని ఇచ్చింది. ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన వారికి నేరుగా వారి ఖాతాల్లోనే నగదు బదిలీ అయింది. ఉపాధి హామీ పథకం కింద సన్నకారు రైతులకు వారి సొంతభూముల్లో బావులు తవ్వడం లాంటి సాగునీటి సదుపాయాలు సమకూరాయి.**

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి
జైరామ్ రమేశ్



# మహిళా వైద్యుల అంకితభావాన్ని అభినందించలేమా !

1849లో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ 'డాక్టర్:ఎలిజబెత్ బ్లాక్ వెల్' జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ఫిబ్రవరి 03న జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం (నేషనల్ ఉమెన్ ఫిజీషియన్స్‌డే) జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్యరంగంలో మహిళల అంకిత భావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్యరంగానికి అంకితంచేసిన మహిళా వైద్యులు ఎందరో ఉన్నారు.

**వైద్యరంగంలో లింగ అసమానతలు:** ప్రస్తుతం దాదాపు 35శాతం మంది వైద్యులు మహిళలు ఉన్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈ రోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటితరం మహిళా వైద్యులకు స్ఫూర్తినిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం యొక్క సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగిక వేధింపులు, ఎక్కువమంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు.

**భారతదేశంలో మహిళా వైద్యులు:** భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్: ఆనందీబాయి జోషి (1886), డాక్టర్: కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకులుగా నిలిచారు. ప్రస్తుతం ఎంబిబిఎస్ విద్యార్థులలో దాదాపు 50శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. డాక్టర్: ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళా వైద్యురాలు), డాక్టర్: కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియోథెరపిస్ట్), డాక్టర్: ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీని ప్రసవించారు), డాక్టర్: మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్: గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్యరంగానికి చారిత్రాత్మక కృషి చేశారు. వైద్యులకు వృత్తి వ్యక్తిగత జీవన సమతుల్యత, మానసిక ఆరోగ్య మద్దతు అవసరాన్ని గుర్తిద్దాం. ప్రస్తుత పౌర సమాజం, తల్లిదండ్రులు తమ యువ బిడ్డలు, బాలికలను వైద్యరంగంలోకి రావడానికి ప్రోత్సహించాలి. మహిళల వైద్యరంగ ప్రవేశం, సమానత్వ సాధనలకు సహాయపడే ఉద్యమాన్ని ప్రారంభించండి. మహిళా వైద్యుల అద్భుతమైన విజయాలను కొనియాడడం, సహోద్యోగులు సహాయపడడం, స్నేహితుల ప్రోత్సాహం, కుటుంబ సభ్యులచేయూత, పౌర సమాజం మద్దతు ఇవ్వడం మన కనీస కర్తవ్యంగా భావిద్దాం.

(ఫిబ్రవరి 03న 'జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం'సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూధన్ రెడ్డి, 9949700037

# పడిపోయింది రూపాయి విలువ కాదు, ప్రభుత్వం విలువ!



ప్రొ॥ దేవరాజు మహారాజు

''రూపాయి పడిపోవడం దేశ ఆర్థిక వ్యవస్థకి చాలా మంచిది'' – అని సెలవిచ్చారు నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు. అందుకే కాబోలు దేశ ఆర్థికమంత్రి సంతోషంగా ఉన్నారు. నిజమే మరి! ఆయన చెప్పిన లాజిక్కే అధికారంలో ఉన్న దేశ నాయకులంతా పాటిస్తున్నట్లుంది. కాలుష్యం ఆరోగ్యానికి మంచిది అని పర్యావరణ మంత్రి ఆనందంగా ఉన్నారు. ఢిల్లీతో పాటు దేశంలోని ప్రధాన నగరాలు కాలుష్యమయమైపోయినా, ఆయన నోరు విప్పడం లేదు. ఇండిగో విమానాల రద్దు దేశంలో పెద్ద సమస్యగా తయారైనా, విమాన శాఖా మంత్రి ఎంత సంతోషంగా ఉంటున్నారో చెప్పలేం. పైగా ఈయన తెలుగువాడు. మోడి చంకలో చేరి, ఆయనకు ఊతమిచ్చి నిలబెట్టిన ఎన్‌డిఎ భాగస్వామి పార్టీ సభ్యుడు. ఈ దెబ్బతో తెలుగు వారి ప్రతిభ ప్రపంచ వ్యాప్తం చేశాడు. తెలుగు దేశం పార్టీ సభ్యులే కాదు, తెలుగు వాళ్ళంతా చంకలు గుద్దుకుని ఎగిరి గంతేయాల్సిన సందర్భం! ''బరువైన వస్తువులు వేగంగా కింద పడతాయి. అలాగే భారతదేశపు రూపాయి బరువుగా ఉంటుంది కనుక, త్వరత్వరగా కింద పడిపోతుంది'' – ఈ వ్యాఖ్య ప్రతిపక్షాల వారిది కాదు. స్వయానా అధికార పక్షం లోకసభ బిజెపి యం.పి కంగనా రనౌత్ జీ అన్నదే! బిజెపి వారి పరువు తీయడానికి ప్రతిపక్ష సభ్యులు అవసరం లేదు. వాళ్ళ పరువు వారే తీసుకోగల సమర్థులు. ఇదిగో ఇలాంటి వాళ్ళకే పద్మశ్రీలు కూడా దక్కుతూ ఉంటాయి.

రూపాయి విలువ పడిపోయి, దేశ ఆర్థిక వ్యవస్థ బలపడిన సందర్భంలో దేశ ఆర్థిక మంత్రి ఒకే ఒక్క మాట ఎంతో నిజాయితీగా చెప్పారు. '' నేను డా. మన్ మోహన్ సింగ్ లాగా కాదలుచుకోలేదు'' అని! నిజమే మరి! ఆయన చదువూ, విజ్ఞత, దార్శనికత ఎక్కడ? మోడి భక్తురాలైన ఈమె అవగాహనా స్థాయి ఎక్కడ? పైగా ఈమె తెలుగింటి కోడలు. అందువల్ల తెలుగువాళ్ళు తమ వీపు తామే చరుచుకుని అభినందించుకోవాల్సిన సందర్భం! మన తెలుగువారు పి.వి. నరసింహారావు ప్రధాని అయినప్పుడు ఆయనకు ఆర్థిక రంగం గురించి తెలియకపోయినా, డా.మన్ మోహన్ సింగ్ వంటి ప్రొఫెసర్ ను తన ఆర్థిక మంత్రిగా చేసుకుని ఆర్థిక వ్యవస్థను స్థిరపరిచారు. తర్వాత మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యాక పరిస్థితిని మరింతగా మెరుగు పరిచారు. ఆ తర్వాత దేవగౌడ, ఐ.కె.గుజ్రాల్ వంటి వారు ప్రధానులయిన కాలంలో కూడా రూపాయి విలువ ఇంతగా దిగజారలేదు.

ఇక బిజెపి పూర్తి మెజారిటీతో గెలిచి, నరేంద్ర మోదీ ప్రధాని కావడంతో ఈ దేశ ప్రజలందరూ ఎంతో ఆశించారు. మంచి మెజారిటీతో గెలిచిన ప్రభుత్వం గనుక, చాలా మంచి పనులు చేస్తూ ప్రజారంజకమైన పరిపాలన అందిస్తారని ఆశించారు. కానీ, వారి ఆశ అడియాసే అయింది. మోదీ ప్రభుత్వం ఆర్థికరంగాన్నే కాదు, క్రమంగా అన్ని రంగాలనూ దిగజార్చుతూ వచ్చింది. నోట్ల రద్దుతో దేశానికి పెద్ద దెబ్బ తగిలింది. దాని ప్రభావంతో వందలమంది చనిపోయారు. ఒక రకంగా దేశ ఆర్థిక వ్యవస్థ అప్పుడే కుప్ప గూలింది. ఆ తర్వాత జి.ఎస్.టి ఎప్పుడైతే ప్రవేశపెట్టారో అప్పుడు మధ్యస్థాయి, కింది స్థాయి పారిశ్రామిక రంగాలన్నీ మూల పడ్డాయి. లక్షల మంది ఉపాధి కోల్పోయారు. మళ్ళీ పుంజుకునే అవకాశం కూడా మోడి ప్రభుత్వం ఆ పరిశ్రమలకు ఇవ్వలేదు. ఇక కొవిడ్ సమయంలో దేశం మరింతగా కుప్పకూలింది. కూలి, నాలి జనానికి బస్సు, రైలు సౌకర్యం కూడా కల్పించలేని నిస్సహాయ స్థితికి ప్రభుత్వం దిగజారింది. పనికిరాని మాటలు తప్ప, స్థూలంగా దేశ పౌరులకు చేసింది ఏమీ లేదు. చెయ్యాల్సింది చేయకుండా – 'చప్పట్లు చరచండి! పళ్ళాలు మోగించండ'ని దేశ ప్రధాని పిలుపు నిచ్చారు. ఏళ్ళు గడుస్తున్నా, ఈ దేశ ప్రజలింకా చప్పట్లు చరిచి ప్లేట్లు మోగిస్తూనే ఉన్నారు. ఎందుకంటే వారికి ఇంత తిండి పెట్టే నాథుడో, ఉపాధి కల్పించే యోధుడో వస్తాడేమోనని!

అమెరికా డాలర్ తో భారతదేశపు రూపాయి 91 అయ్యింది. ఇది ఇంకా ఇంకా పడిపోవచ్చని నిపుణులు చెపుతున్నారు. కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు మాత్రం 'దేశ ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంది' అని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రతి మనిషికి ఆత్మసాక్షి అనేది ఉంటుంది. బహుశా, ప్రస్థుత మన దేశ నాయకులకు అదంటే ఏమిటో కూడా తెలియనట్టుంది. డా. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రూపాయి విలువ కొద్దిగా పడిపోయింది(సుమారు 53 రూపాయలు). అప్పుడు ఇదే మోడీజీ దాన్నొక పెద్ద సమస్యగా చిత్రించి నాటి ప్రభుత్వాన్ని నానా మాటలు అన్నారు. అప్పుడు కొద్దిగా పడిపోయిన దానికీ, ఇప్పుడు పూర్తిగా పడిపోయిన దానికీ పోలికే లేదు. గతంలో తను మాట్లాడిన వీడియో క్లిప్పింగ్ చూసుకుని మోడీజీ నాలిక కరుచుకుని, దేశ ప్రజలకు క్షమాపణలు చెపుతారా? అసలు అంత హుందాగా ఆయన ఎప్పుడు ప్రవర్తించారనీ! పైగా ఆయన భక్తులేమో ఇక్కడ విషయాల్ని వక్రీకరించి చెపుతూ ఉంటారు. రూపాయి విలువ ఎంత పడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థ అంత బలపడుతుందని వివరణలిస్తారు. ఆర్థికరంగం గురించి ఏమాత్రం పరిజ్ఞానం లేని వారికైనా – అదొక మూర్ఖపు ప్రకటన అని తెలిసిపోవడం లేదా ? రూపాయి విలువ ఇంతగా పడిపోతే అంతర్జాతీయ మార్కెట్లో నిలబడేదెట్లా? నిలదొక్కు కునేది తర్వాత సంగతి! తమ తమ అహాల్ని వదిలి ఆర్థికమంత్రి, ప్రధాని ఆర్థికరంగ నిపుణుల్ని సంప్రదించాలి! పునరుద్ధరణకు పూనుకోవాలి! పన్నెండేళ్ళుగా అధికారంలో కొనసాగుతున్న ఈ ప్రభుత్వం, ఏ రంగం మీద దృష్టి పెట్టిందన్నది ఆత్మ విమర్శ చేసుకోవాలి!

ఒకప్పుడు నమస్తే ట్రంప్‌లాగా ఇప్పుడు నమస్తే పుతిన్ కార్యక్రమం జరిగింది. దేశంలో మారణకాండలు జరిపించిన మోడీజీ విదేశాలలో శాంతి కాముకుడిగా తిరిగొస్తాడు. అక్కడ ఉక్రెయిన్‌ను సర్వనాశనం చేసిన పుతిన్, మరో శాంతి కపోతంలా భారత్ పై ఇలా వాలి అలా వెళ్ళిపోతాడు. ఇక ఇరు దేశాల ప్రజలు ఏదో అద్భుతం జరిగిందన్న భ్రమలో పిచ్చివాళ్ళయి బతుకుతూ ఉండాలి. ఇవన్నీ గమనించే 'సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. ఎన్. శ్రీ కృష్ణ ఇలా అన్నారు. ''నేడు పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. నేను ఎక్కడైనా పబ్లిక్ ప్లేస్‌లో నిలబడి ప్రధాన మంత్రి ముఖం నాకు నచ్చలేదు.. అని చెపితే చాలు! అంతే ఇంకా ఏమీ అననక్కరలేదు. ఆ మాటతో ఎవరైనా నా మీద దాడి చేయొచ్చు. అరెస్ట్ చెయ్యొచ్చు. కారణమేదీ చెప్పకుండానే జైల్లో కూడా వెయ్యొచ్చు–'' జస్టిస్ అంతటివాడే అంతగా భయపడుతూ ఉంటే, ఇక సామాన్యుల హక్కుల గూర్చి మాట్లాడేదెవరు?

దేశ ప్రజల కష్టార్జితమైన రూపాయికి విలువే లేదని విమానయాన సంస్థ కూడా ఈ మధ్య రుజువు చేసింది కదా? 2025 డిసెంబర్ 4–8 తేదీల్లో వందల సంఖ్యలో విమానాలు రద్దయి వేలమంది ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. విమానాల రద్దు గురించి వారికి మెసేజో, మెయిలో పంపలేదు. వేలమంది ప్రధాన నగరాల్లోని ఎయిర్ పోర్టులకు పోయి చివరి క్షణంలో విమానాలు రద్దయ్యాయన్న బోర్డులు చూసి నీరుగారిపొయ్యారు. ఆ ప్రయాణాలు కొందరికి ఎంతో ముఖ్యమైనవి కావచ్చు. భావోద్వేగాలకు గురై కొందరు భోరుమని ఏడ్చారు. విమానాలు రద్దయినప్పుడు విమాన సంస్థ ప్రయాణికుల ఛార్జీలు వెంటనే వెనక్కి తిరిగి ఇచ్చేయాల్సింది. ఆ పని వారు చేయలేదు. విమానాశ్రయాల నిర్వహణ కుప్పకూలింది. టి, డ్రింక్స్, స్నాక్స్ అందివ్వక పోవడం – అలా ఉంచి వాష్ రూంలు వాడకానికి పనికిరాకుండా అయ్యాయి. విమానయాన మంత్రిత్వ శాఖ ఉంది. దానికో మంత్రి ఉన్నాడు. సంవత్సరకాలంగా ఇండిగో సంస్థ నిర్వహణ సరిగా లేక విమానాలు రద్దవుతుంటే కేంద్ర ప్రభుత్వమేం చేస్తోంది ? డబ్బులు పోగొట్టుకొని ప్రయాణికులు అల్లలాడుతూ ఉంటే అక్కడేం జరిగిందీ? ప్రజల రూపాయికి విలువే లేదని తేలిపోయింది!!

2014కు ముందు డా.మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఏ ఒక్క విమాన సంస్థనూ బలపడనీయలేదు. ఎక్కువ సంస్థలకు అవకాశమిచ్చారు. అన్నింటినీ ఒక హద్దులో ఉంచారు. ఉదాహరణకు అప్పటి వివరాలు... ఎయిర్ ఏసియా ఒక శాతం – గో ఎయిర్ తొమ్మిది శాతం – ఎయిర్ ఇండియా 18 శాతం – స్పైస్ జెట్18 శాతం, జెట్ ఎయిర్ వేస్ 21 శాతం , ఇండిగో 30 శాతం ఇతరులు 3 శాతం ఉండేవారు. 2014 తర్వాత మోదీ ప్రధాని అయ్యాక పరిస్థితి మారింది. తనకు కావల్సిన వారికి ఎక్కువ మేలు చేస్తూ వచ్చారు. వారినే బలపడనిచ్చారు. ఇప్పటి వివరాలు ఇలా ఉన్నాయి. ఇండిగో 65 శాతం అయితే, ఎయిర్ ఇండియా 18 నుండి 30కి పెరిగింది. మిగతా సంస్థలు 5 శాతం ఉన్నాయి. ఇండిగోకు ఎక్కువ మేలు చేసిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. నిబంధనలకు అనుగుణంగా పనిచేయలేకపోతున్న ఇండిగో తన గుత్తాధిపత్యం వదులుకోలేకపోతోంది. సంవత్సరకాలంగా సమస్యలు సృష్టిస్తున్నా భారత విమాన మంత్రిత్వ శాఖ చోద్యం చూస్తూ ఉంది. 2025 డిసెంబర్ నెల మొదటి రెండువారాలు విమాన సర్వీసులు రద్దయి లక్షల మంది ప్రయాణికులు లబోదిబోమన్నారు. టికెట్ డబ్బులు వారివి వారికి వెంటనే తిరిగి ఇవ్వాలి కదా? అది కూడా చేయలేక పోయారు. దీనికి ప్రధాన కారణం మోదీ, షా వారి మంత్రివర్గ సహచరుడు ఎన్డీఏ భాగస్వామి (తెలుగుదేశం) మంత్రి రామమోహన్ నాయుడి అసమర్థత ! ఆంధ్ర రాష్ట్రంతో సంబంధమున్న ఆర్థికమంత్రీ, విమానయాన మంత్రీ తెలుగువారి పరువు ప్రపంచం ముందు ఏ మాత్రం మిగల్చలేదు –


ఇండిగో సంక్షోభంలో పడడంతో మిగతా ఎయిర్ లైన్స్ విమాన ఛార్జీలు ఉన్నఫళంగా 5–6 రెట్లు పెంచాయి. ఫలితంగా దగ్గరున్న విదేశాలకు అయ్యే ఛార్జీ కంటే దేశంలో మరో నగరానికి వెళ్ళాలంటే ఎక్కువ ఛార్జి పెట్టాల్సి వచ్చింది. ఇంత ఘోరం జరుగుతూ ఉంటే, ఈ దేశానికి ఓ ప్రధానీ ఓ హోం మంత్రి ఉన్నారు కదా? వాళ్ళెందుకు నోరు మెదపలేదు? ముందు నిలబడి సహాయక చర్యలు చేపట్టడం తర్వాత సంగతి! ఇదీ ప్రస్తుతం దేశ పరిస్థితి ఇక్కడ దేశంలో పెరిగిన ధరలూ, టాక్సులూ చూసి బతుకు భారమైపోవడం చూసి, ఉపాధి లేకపోవడం చూసి, స్వేచ్ఛ లేకపోవడం చూసి యువత ఎలాగోలా విదేశాలకు వెళ్ళిపోవాలనుకుంటోంది. ముందే వెళ్ళిపోయిన వారు తిరిగి రావడానికి సాహసించడం లేదు. ఇక్కడ జైశ్రీరామ్ అంటూ కూచుంటే కడుపునిండే అవకాశం లేదుకదా? పాలకులు ఎంతసేపూ గల్లీల పేర్లు, ఊర్ల పేర్లు, నగరాల పేర్లు మార్చడమే గొప్ప సంస్కరణ అని అనుకుంటున్నారు. బెంగాల్ ఎన్నికలు వస్తున్నాయి గనుక వందేమాతరం గీతాన్ని వివాదాస్పదం చేసి పార్లమెంట్‌లో చర్చకు పెడతారు. దేశ ప్రజల సమస్యలు వీరికి కనపడవు, ఇవన్నీ గమనించే ప్రఖ్యాత రచయిత్రి అరుంధతీ రాయ్ అన్నారు... ''భారతదేశం కార్పొరేట్ దేశంగా, హిందూమత రాజ్యంగా, పోలీస్ రాజ్యంగా, భయపెట్టే దేశంగా మారిపోయింది''— అని! ''నఫ్రత్ కి బజార్ మె హం మొహబ్బత్ కి దుకాన్ ఖోల్ తే జాయింగే'' – విద్వేష పూరితమైన మీ వీధుల్లో మేం ప్రేమ దుకాణాలు తెరుస్తాం!– అన్నది కేవలం ప్రతిపక్ష నేత ఇచ్చిన నినాదం కాదు. అందులో ప్రతి భారతీయుడి గుండె కొట్టుకుంటోంది!

**(రచయిత : సాహితీవేత్త, జీవశాస్త్ర వేత్త)**

# డబ్బుకు కాదు.. ప్రజాస్వామ్యానికి ఓటు

మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది. ఈ పునాదిని ఈ రోజు డబ్బు రాజకీయాలు బలహీనపరుస్తున్నాయి. సేవ, అభివృద్ధి, ప్రజా సమస్యలపై పోటీ ఉండాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడు ఖర్చుల పోటీగా మారుతున్నాయనే ఆందోళన పెరుగుతోంది. అభ్యర్థులు గెలుపుకోసం డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేయడం, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర భంగం కలిగిస్తోంది. డబ్బు శక్తి పెరిగితే సామాన్యుడి గొంతు నొక్కబడుతుంది. నైతిక రాజకీయాలు కనుమరుగవుతాయి. ఈ పరిస్థితిని అడ్డుకోవాలంటే ఎన్నికల కమిషన్ కఠిన చర్యలతో పాటు రాజకీయ పార్టీ బాధ్యతాయుత ప్రవర్తన, ప్రజల చైతన్యం తప్పనిసరి. ఎన్నికల ఖర్చులపై పారదర్శకత లేకపోతే, మున్సిపల్ పాలన కూడా డబ్బుకు బానిస అవుతుంది. నగదు పంపిణీ, మద్యం, ఉచితాల పేరుతో లంచాలు ఇవ్వడం.. ఇవన్నీ ఎన్నికల నేరాలుగా పరిగణించి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సోషల్ మీడియా ప్రచార ఖర్చులకు లెక్కలు ఉండాలి. ఫ్లయింగ్ స్క్వాడ్లు కేవలం పేరుకే కాకుండా, ఫలితాలు చూపాలి. ఇక ఓటర్లు కూడా మౌన ప్రేక్షకులుగా ఉండకూడదు. డబ్బు తీసుకుని ఓటువేస్తే, రేపటి పాలనపై నైతిక హక్కును కోల్పోయినట్టే. డబ్బుకు కాదు అభివృద్ధికి ఓటు అనే అవగాహన పెరగాల్సిన సమయం ఇది. మున్సిపల్ ఎన్నికల్లో ఖర్చుల కట్టడే నిజమైన సంస్కరణ. డబ్బు ప్రభావం తగ్గితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. పట్టణాభివృద్ధి నిజమవుతుంది.

**గెలిచినా గాయమే..ఓడినా అప్పులే..** గత సర్పంచ్ ఎన్నికలలో కళ్లారా కనిపించిన సంఘటన లు ఎన్నో ఉన్నవి. మున్సిపల్ ఎన్నికల్లో మళ్లీ పునరావృతం కాకూడదనేదే మేధావుల అభిప్రాయం. గత సర్పంచ్ ఎన్నిక లు గ్రామీణ రాజకీయాల్లో ఒక చేదు నిజాన్ని బయటపెట్టాయి. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుచేసి గెలిచినవారు, ఓడినవారు చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గెలుపు ఆనందం కంటే అప్పుల భారం ఎక్కువైంది. ఓడిన వారికి రాజకీయ పరాజయం సరిపోక ఆర్థిక విధ్వంసం వెంటాడింది. ఓట్లు కొనేందుకు, ప్రచారానికి, ఉచితాలకు ఖర్చుచేసిన డబ్బు కోసం కొందరు అభ్యర్థులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. మరి కొందరు భూములు తాకట్టు పెట్టారు. ఇంకొందరేమో వ్యక్తిగత ఆస్తులు అమ్ముకున్నారు. ఇవన్నీ కూడా యదార్థ సంఘటనలు మరువకముందే మళ్లీ మున్సిపల్ ఎన్నికల కూడా రానే వచ్చాయి. సర్పంచ్ ఎన్నికల ఫలితం ఏమైంది సర్పంచ్ పదవి వచ్చిందా? రాలేదా? అన్నది పక్కనపెడితే చాలామంది జీవితాలు అప్పుల పాలయ్యాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల వేళ అదే పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారులు, పోలీసు యంత్రాంగం, ఎన్నికల అధికారులు, ప్రజాప్రతినిధులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నిబంధనలు స్పష్టంగా ఉన్నా అమలులో సడలింపు ఉంటే డబ్బు రాజకీయాలు మళ్లీ రాజ్యం చేస్తాయి. నగదు పంపిణీ, మద్యం, ఉచితాల పైన కఠిన విధానం అమలు చేయాల్సిన సమయం ఇది. ఫ్లయింగ్




స్క్వాడ్లు, చెక్‌పోస్టులు కేవలం ఫార్మాలిటీగా కాకుండా ఫలితాలు కనిపించేలా పనిచేయాలి.

పట్టుబడిన డబ్బు వివరాలు ప్రజలకు వెల్లడించాలి. నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థుల పై అనర్హత వరకు వెళ్లే చర్యలు తీసుకోవాల్సిందే. అంతేకాదు. రాజకీయ పార్టీలు బాధ్యత వహించాలి. డబ్బు, ఖర్చు చేసే వారికే టికెట్లు అన్న అపవాదుకు చెక్ పెట్టాలి. లేకపోతే ప్రజాసేవ పేరుతో ప్రజలను అప్పులపాలు చేసే రాజకీయాలే మిగులుతాయి. ఇక ప్రజల పాత్ర అత్యంత కీలకం. డబ్బు తీసుకుం టే క్షణిక లాభం. కానీ రేపటి పాలనపై నష్టం. డబ్బుకు ఓటు అంటే అప్పుల పాలనకు ఆహ్వానం ఇచ్చినట్టే. గత సర్పంచ్ ఎన్నికలు ఒక హెచ్చరిక. మున్సిపల్ ఎన్నికలు మరోసారి అదే తప్పు చేయకూడదు. గెలుపు తర్వాత అప్పులు మిగలకుండా ఉండాలంటే ఎన్నికల సమయంలో కఠినత తప్పదు.

**నిబంధనలు స్పష్టం అమలే ప్రశ్న?**

మున్సిపల్ ఎన్నికల్లో ఖర్చుల నియంత్రణపై ఎన్నికల కమిషన్ కఠిన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, అమలు స్థాయిలో అవి ఎంతవరకు ఫలిస్తున్నాయన్నది కీలక ప్రశ్నగా మారింది. ఎన్నికల ప్రవర్త నా నియమావళి ప్రకారం ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చును నిర్దేశిత పరిమితిలోనే ఉంచాలి. నగదు పంపిణీ, మద్యం, ఉచిత వస్తువుల పంపకాన్ని ఎన్నికల నేరంగా పరిగణించాలన్నది. స్పష్టమైన ఆదేశం. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థిచేసే ప్రతి ప్రచార ఖర్చు లెక్కలోకి రావాలి. నగదు లావాదేవీలకు అవకాశం లేకుండా బ్యాంక్ ఖాతాల ద్వారానే ఖర్చులు జరగాలి. ఫ్లెక్సీలు, వాహనాలు, సభలు, సోషల్ మీడియా ప్రచారం అన్ని వ్యయాల్లో నమోదు చేయాలి.

నిబంధనలకు విరుద్ధంగా ఖర్చులు చేస్తే అనర్హత, కేసులు తప్పవు, అయితే వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ప్రచార ఖర్చులు అధికారిక లెక్కలను దూరంగా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగదు, మద్యం స్వాధీనాలు జరుగుతున్నా డబ్బు ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే స్థాయిలో నియంత్రణ కనిపించడం లేదన్న విమర్శలు చాలా స్పష్టం. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పనిచేసే ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అలాగే రాజకీయ పార్టీలు కూడా తమ అభ్యర్థుల ఖర్చులపై అంతర్గత నియంత్రణ పెట్టాలని నిబంధనలు సూచిస్తున్నాయి. ఇక ఓటర్ల పాత్ర కూడా కీలకం.

ఎన్నికల కమిషన్ స్పష్టం చేసినట్టుగా డబ్బు, మద్యం తీసుకోవడమే ఎన్నికల నేరం. అవి స్వీకరించినా, ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవు. నిబంధనలు ఉన్నాయి. ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. ఇప్పుడు అవసరం ఉంది. కఠిన అమలు, రాజకీయ సంకల్పం, ప్రజల చైతన్యం. అప్పుడే మున్సిపల్ ఎన్నికలు డబ్బు ప్రభావం నుంచి భయటపడి, నిజమైన ప్రజాస్వామ్య పండుగగా మారగలవు.

**జి.మధు,** వనపర్తి, ప్రజాపక్షం ప్రతినిధి



## సిపిఐ అభ్యర్థులకు బిఫామ్‌లు

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికలలో 2, 7 వార్డులలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులు షేక్ షరీఫ్, బొలుగూరు సురుణమ్మలు సోమవారం రోజున బి ఫామ్‌లను అందజేశారు. అలాగే 1వ వార్డు నుండి పోటీలో ఉన్న సిపిఐ(ఎం) అభ్యర్థి జిట్ట నగేష్ కూడా తన బి ఫామ్‌ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, మండల పార్టీ కార్యదర్శి ఎండి అక్బర్, సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు బొలుగూరి లింగయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఓటర్లను కోరారు. సోమవారం పట్టణంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాటుగా, పలు వార్డులలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను ఓటు అభ్యర్థిస్తూ రాష్ట్రంలో ప్రజాపాలనను అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ఆశీర్వదిస్తున్నట్లుగానే, కౌన్సిల్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని వీరేశం కోరారు. ఆయన వెంట డిసిసి అధ్యక్షులు పున్న కైలాస్ నేత ఉన్నారు.
**కాంగ్రెస్‌లో చేరికలు:** 6వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన రేపాక ప్రణయ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని తన సహచరులతో నేడు ఎంఎల్‌ఎ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని వారిని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు జడల చినమల్లయ్య, నాయకులు పాటి మాధవరెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కార్పొరేషన్13వ డివిజన్లో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరించి మంత్రి సహకారంతో అభివృద్ధి చేస్తానని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి అన్నారు. గుమ్మల జానకి మోహన్ రెడ్డి 13వ డివిజన్ కార్పొరేషన్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సందర్భంగా 13వ డివిజన్ లోని విద్యుత్ నగర్,ఎన్‌టిఆర్ కాలనీలో ప్రస్తుతం ప్రచారం కొనసాగించారు.ఈసందర్భంగా గడప గడపకి తిరిగి ప్రతి ఒక్కరిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈప్రచారం కార్యక్రమంలో కాలనీ నాయకులు కంచరకుంట్ల వెంకటరెడ్డి,మర్రిగూడ గ్రామ శాఖ అధ్యక్షుడు గురజ వెంకన్న గౌడ్, జిల్లా అంజిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

## తుర్కపల్లిలో గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతూ గంజాయితో సమాజాన్ని నాశనం చేద్దామనుకునే వారికి చట్టరీత్యా చర్యలు తప్పవని, ఎన్ని రోజులైనా కటకటాల్లోకె వెళ్తారని తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ హెచ్చరించారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో మోటకొండూర్ మండలం తేర్యాల గ్రామనికి చెందిన చామల అఖిల్ రెడ్డి, గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన మాజోజు ప్రశాంత్ అనే ఇద్దరు వ్యక్తులు, తమ ఫోర్డ్ కారులో గంజాయితో ప్రయనిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో తుర్కపల్లి పోలీస్ స్టేషన్ తమ సిబ్బందితో ఎపి 29ఎన్5878 నంబర్‌గల కారును ఆపి తనిఖీ చేయగా సుమారు 200 గ్రాముల గంజాయి పట్టుబడిందని, సదరు గంజాయిని కొండమడుగు, బీబీనగర్ వద్ద కొనగోలు చేసి తుర్కపల్లి వైపు వెళ్తుండగా పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. నిందితుల వద్ద నుంచి 200 గ్రాముల గంజాయి, ఒక ఫోర్డ్ ఫిస్ట కార్, రెండు మొబైలు ఫోన్‌లు, ఒక బరువు కొలిచే యంత్రం ఒక బ్యాగ్, కొన్ని కవర్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## ఓటర్ స్లిప్పుల పంపిణీలో నిర్లక్ష్యం తగదు

**ప్రజాపక్షం/హాలియా:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ల ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ పై బిఎల్‌ఓ లకు మున్సిపల్ కమిషనర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.సోమవారం హాలియా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బిఎల్‌ఓలకు ఓటర్ ఫోటో ఓటర్ స్లిప్పులు పంపిణీ పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఈ సందర్భంగా కమిషనర్ వారికి తెలిపారు.హాలియా మున్సిపాలిటీలో సోమవారం నుంచి ఓటర్ ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభించినున్నట్లు చెప్పారు.అన్ని రాజకీయ పార్టీలతో ఏర్పాటుచేసిన ఈసమావేశంలో ఓటర్ స్లిప్పుల పంపిణీలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు వాటిని పంపిణీ చేయనున్నట్లు వారికి చెప్పారు.ఓటర్ స్లిప్పుల పంపిణీ పారదర్శకంగా,నిష్పక్షపాతంగా,సమర్థవంతంగా నిర్వహించాలని బిఎల్‌ఓలకు కమిషనర్ సూచించారు.ప్రతి ఇంటికి ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ చేయాలని వీటిని ఈనెల 7వ తేదీ వరకు పూర్తి చేయాలని బిఎల్‌ఓలకు తెలిపారు ఓటర్లు కూడా ఫోటో ఓటర్ స్లిప్ లను తప్పకుండా తీసుకొని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టలో కాంగ్రెస్ జోరు

గడపగడపకూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

పట్టణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం ఎమ్మెల్యే హామీ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో రాజకీయ వేడి పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎన్నికల ప్ర చారంలో దూసుకుపోతున్నారు. సోమవారం పట్టణంలోని 9వ వార్డులో , 10వ వార్డుల్లో ఆయ న విస్తృతంగా పర్యటించి, ఓటర్లను అభ్యర్థించారు.
**ప్రజాపాలనే మా ఆయుధం..** ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అయిలయ్య ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న 'ప్రజాపాలన' ద్వారా ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రజలకు వివరించారు. అభివృద్ధికి పట్టాభిషేకం చేయండి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తే, యాదగిరిగుట్ట పట్టణ రూపురేఖలను మారుస్తాం. మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాకు మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది' అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక అభ్యర్థులకు ప్రజల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులతో నేరుగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, వాణి భరత్ గౌడ్, ధనలక్ష్మి మధుకర్, నవీన్, పాండురాజు శీను, కాటంరాజు పాల్గొన్నారు.

## నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధుడు పిచ్చిరెడ్డి

ఘనంగా కామ్రేడ్ పిచ్చిరెడ్డి శతజయంతి



**ప్రజాపక్షం/తుంగతుర్తి (నాగారం) :** నాగారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, గ్రామ మాజీ సర్పంచ్, సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి శతజయంతిని సోమవారం సామాజిక ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంగరి వెంకట్రామ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప పోరాట యోధుడు అని కొనియాడారు. పేద ప్రజలు, కార్మికులు, కర్షకుల సమస్యలపై పోరాటం చేసి విజయాలు సాధించిన యోధుడని అన్నారు. 1962 నుండి 1982 వరకు ఉమ్మడి సూర్యాపేట తాలూకా సిపిఐ ప్రధాన కార్యదర్శిగా సేవలందించారని చెప్పారు. నాగారంలో సిండికేట్ బ్యాంక్, ఎస్‌సి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ మంజూరు చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు మాట్లాడుతూ కామ్రేడ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు పాటుపడాలని కోరారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. పెత్తందారులకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి పోరాడిన ఆయన అనంతరం ప్రజాప్రతినిధిగా ప్రజలచేత ఎన్నికై వారికి 25 సంవత్సరాలపాటు సేవలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణ, సామాజిక ఆలోచన వేదిక కార్యదర్శి నీలా శ్రీనివాస్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, అశోక్ కుమార్, రాజారాం, జనార్థన్ పాల్గొన్నారు.

# బాలల రక్షణ కోసం నిరంతర తనిఖీలు



సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వెట్టిచాకిరికి, నిరాధరణకు గురైన బాలబాలికలకు, తప్పిపోయి వచ్చిన బాలలను గుర్తించి సంరక్షించడంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. జిల్లాలో జనవరి నెలలో నెలరోజుల పాటు జిల్లా పోలీసు, జిల్లా యంత్రాంగం, జిల్లా సంక్షేమం, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ, హెల్త్ మొదలగు డిపార్టుమెంట్‌ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంను పగడ్బందిగా నిర్వహించామన్నారు. ఆపరేషన్ స్మైల్ పూర్తయిన సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు సమావేశం నిర్వహించి స్మైల్ కార్యక్రమంలో బాగా పనిచేసి ఎక్కువ పిల్లలను సంరక్షించడంలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా నిరాదరణకు, వెట్టిచాకిరికి గురవుతున్న 176 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, సంరక్షకులకు క్షేమంగా అప్పగించడం జరిగిందన్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు 56 మంది బాలలు ఉండగా వీరిలో 49 మంది బాలురు, 7గురు బాలికలు ఉన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 120 మంది బాలలు ఉండగా వీరిలో 80 మంది బాలురు, 40 మంది బాలికలు ఉన్నారని ఎస్‌పి తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా రిస్క్యూ టీమ్స్ వివిధ ప్రదేశాల్లో వీరందరిని గుర్తించి వీరికి రక్షణ కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, పోలీస్ ఐటి ఆర్‌ఎస్‌ఐ రాజశేఖర్, చైల్డ్ సంరక్షణ అధికారులు రవి, నాగుల్‌మీరా, స్మైల్ బృందం ఎస్‌ఐ మల్లేశం, ఏఎస్‌ఐ వెంకన్న, స్మైల్ టీమ్స్ సిబ్బంది ఉన్నారు.

## 118 బాల కార్మికులకు విముక్తి

ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా జిల్లాలో రికార్డ్ స్థాయిలో బాల కార్మికులకు నల్లగొండ జిల్లా పోలీసు శాఖ విముక్తి కల్పించిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఒక్క జనవరి నెలలో 92 కేసులలో 118మంది బాల కార్మికుల రెస్క్యూ కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు.పలకా బలపం పట్టి బడి బాట పట్టాల్సిన బాలలను వెట్టిచాకిరీతోనే బంధీ అయిపోతున్న పసిబాల్యాన్ని తమ చేతులతో ఒడిసి పట్టుకుని వారిని పోలీస్ శాఖ విముక్తి చేసిందన్నారు.ఒక్కరు కాదుఇద్దరు కాదుఏంకంగా 118 మంది పసిపిల్లల భవితవ్యం అంధకారంలో మునిగిపోకుండా కాపాడిందన్నారు.నల్లగొండ జిల్లా పరిధిలోని మూడు సబ్ డివిజన్లలో అడిషనల్ ఎస్‌పి రమేష్,పోలీస్ శాఖ ఏహెచ్‌టియు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ ,వివిధ డిపార్మెంటు అధికారుల సమన్వయంతో టీమ్ లుగా ఏర్పడి ఒక్క జనవరి నెలలోనే 92 కేసుల్లో 118 మంది పిల్లలను రెస్క్యూ చేయడం వీరిలో 105 మంది బాలలు 13 మంది బాలికలు వీరంతా ఎక్కువగా ఇతర రాష్ట్రాలు బీహార్,చత్తీష్ఘాడ్, ఒరిస్సా,యూపీ,ఆంధ్రప్రదేశ్ కి చెందిన వారు కావడం గమనార్హం అన్నారు.

## శ్రీయోగానంద లక్ష్మినృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సోమవారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిన శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి ఆలయాన్ని పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో రూ. కోటి లతో గెస్ట్‌హౌజ్ నిర్మిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నాయకులు కిషన్ రావు, బైరబోయిన సైదులు, కోమటి సోమయ్య, ధర్మకర్తలు శ్రీధర రెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో టిక్కెట్ల లొల్లి

పార్టీ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ 27వ వార్డు అభ్యర్థి కోడి శివ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్ల లొల్లి వదవలేదు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయా వార్డుల నుండి టిక్కెట్లను ఆశిస్తున్న అభ్యర్థులు అధికంగా ఉన్నారు. దీనికితోడు పార్టీలో రెండు వర్గాలు ఉండడంతో ఇరు వర్గాలకు చెందిన నాయకులు టిక్కెట్ తమకంటే తమకంటూ పట్టుపడుతున్నారు. టిక్కెట్ల కేటాయింపులు జరగకముందే టిక్కెట్ వస్తుందనే ధీమాతో ఆశావహులు అనేక మంది నామినేషన్ దాఖలాలు చేసి ఏకంగా వార్డుల్లో ప్రచారాన్ని కూడా కొనసాగిస్తున్నారు. ఎన్నికల అధికారులకు బిఫామ్ సమర్పించేందుకు కేవలం ఒక్క రోజే గడువు ఉండడంతో ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పలానా వ్యక్తికి పలానా వార్డులో టిక్కెట్ ఖరారైందని లీకులు బయటకు రావడంతో పార్టీ కోసం కష్టపడ్డ మాకు టిక్కెట్ ఇవ్వకపోవడం ఏమిటంటూ కొంత మంది నామినేషన్ ఇప్పటికే దాఖలు చేసిన అభ్యర్థులు పార్టీ పెద్దలను ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగుతున్నారు. ఈ క్రమంలో సోమవారం 25వ వార్డు నుండి టిక్కెట్ ఆశిస్తూ ఇప్పటికే నామినేషన్ దాఖలు చేసిన కోడి శివ అనే నాయకుడు తనకు టిక్కెట్ ఖరారు కాలేదని బిఫామ్ వచ్చే అవకాశం లేదని తెలుసుకొని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్దకు తన అనుచరులతో వచ్చి ఆందోళనకు దిగారు. తనకు టిక్కెట్ ఖరారు చేస్తూ బిఫామ్ ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానటూ ముందుగానే తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడ ఉన్న వారు అప్రమత్తమై అతనిని బలవంతంగా నిలువరించారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. ఇక్కడ కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి బ్రతికుంటే తనకు ఈ పరిస్థితి వచ్చేది కాదంటూ కంట తడి పెట్టుకున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం 11వ వార్డు రాయినిగూడెం నుండి కౌన్సిలర్ టిక్కెట్ ఆశిస్తున్న ఎల్గూరి ఇందిరా కూడా తన అనుచరులతో పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని అక్కడి నుండి పంపించారు. ఈ పరిస్థితి చూస్తుంటే మరో రెండు మూడు రోజులు టిక్కెట్ ఆశించి భంగపడ్డ వారు మరింత ఆందోళనలకు దిగే అవకాశం లేకపోలేదు.

## పట్టణ పేదలందరికీ గృహ యోగం కలగాలి

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** పట్టణ స్థానిక సంస్థల్లో ఆదాయ సమీకరణ, బడ్జెట్ నిర్వహణ అంశాలపై జరిగిన పార్లమెంటరీ హౌసింగ్, పట్టణ వ్యవహారాల స్థాయి కమిటీ సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలపై గళం విప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన పట్టణ స్థానిక సంస్థలను తక్షణమే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని బలంగా కోరారు. తద్వారా రాష్ట్రంలో మెప్మాపి ఎంఏవై (యు) 2.0 పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసి, నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయవచ్చని ఆయన కమిటీకి వివరించారు. అలాగే, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 27 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్న ప్రక్రియను ప్రస్తావిస్తూ, ఈ విస్తరించిన ప్రాంతాల్లోని పేదలకు కూడా పిఎంఏవై ప్రయోజనాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ కేటాయింపులు, పథకాల అమలులో ప్రాధాన్యత ఇస్తేనే పట్టణ ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని కిరణ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికల విధులు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం యాదాద్రి 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆలేరు, యాదగిరిగుట్ట, భువనగిరి మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ పనులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నియమ, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఇప్పటి వరకు వార్డుల వారీగా ఒక్కొక వార్డులో ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. అందులో ఎంతమంది అభ్యర్థులు నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. విత్ డ్రా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల పార్టీలకు సంబంధించి ఫార్మ్ ఏ, ఫారం బి సమర్పించారా అని ఆరా తీశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పక పాటిస్తూ పోటీలో ఉన్న అభ్యర్థులకు ఆల్ఫాబెటికల్ ఆర్డర్ ప్రకారం ఎన్నికల కమిషన్ ఇచ్చిన గుర్తులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 4న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మిర్యాలగూడ రూరల్ పర్యటన సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి మిర్యాలగూడ సమీపంలోని గూడూరు వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్న బహిరంగ సభ, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, బహిరంగ సభ వేదిక, బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకు కుర్చీలు, తాగునీరు, బ్యారికేడింగ్, అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. బహిరంగ సభకు వచ్చే అప్రోచ్ రోడ్లు, హెలిప్యాడ్, బ్యారికేడింగ్, భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వివిధ శాఖలకు కేటాయించిన విధులను తూ.చా తప్పకుండా పాటించాలన్నారు. వారి వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డిఎస్పీ రాజశేఖర్‌రాజు, ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీపీవో శంకర్ నాయక్, మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏండ్లు నిండిన రజక వృత్తిదారుడికి రూ.4వేల పింఛన్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రజక వృత్తి చేసుకునేటటువంటి వారికి 50ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ.4వేల పింఛను మంజూరు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ రూపొందించిన 2026 సంవత్సరం క్యాలెండర్‌ని జిల్లా అధ్యక్షలు రేవల్లి అంజయ్య అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యాలయం మాగ్దూమ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ యొక్క కార్యక్రమానికి బొడ్డుపల్లి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న రజకులు,రజక వృత్తిదారులు అనేక సమస్యలపై కొట్టుమిట్టాడుతున్నారని ప్రభుత్వాలు మారిన వారి జీవితాలు మారటం లేదని అన్నారు.గత ఉమ్మడి రాష్ట్రంలో తీసుకొచ్చినటువంటి రజక సామాజిక వర్గానికి ఉపయోగపడే చట్టాలన్నిటిని అన్ని శాఖల ద్వారా అమలు అయ్యేటట్టు చూడాలని డిమాండ్ చేశారు.ప్రధానం గా దేశంలో 18 రాష్ట్రాలు,రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్‌సి జాబితాలో ఉన్న రజకుల లాగానే తెలంగాణ రాష్ట్రంలోని రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో రజక సొసైటీలకు సబ్సిడీరుణాలు మంజూరు చేస్తామని ఆన్లైన్ చేసుకున్నటువంటి సొసైటీలు అన్నిటికీ ఈ ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వృత్తి సంఘాల నాయకులు పబ్బు వీరస్వామి,ఎల్.శ్రవణ్ కుమార్,వి.లెనిన్, కే.ముత్తయ్య తదితరులుపాల్గొన్నారు.

## క్రీడలతో మంచి భవిష్యత్తు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపాలిటి స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను డీఎస్పీ రాజశేఖర్‌రాజు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని, కావునా విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో మాతంగి రమేష్, ఎంఈవో ధర్మానాయక్, రాజారత్నం, రామకృష్ణారెడ్డి, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, సాహిద్, అనిల్ కిరణ్, శోభారాణి, మనోహరి, అరుణ, శ్రీలేఖ, సావిత్రి, సతీష్, పీఈటీలు ఇందిరా, వినోద, పీడీలు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో జీవిత నైపుణ్యాల పెంపే లక్ష్యం

### స్లేట్ ది స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్‌నాథ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పిల్లల్లో విద్యతోపాటు ఆలోచన శక్తి, విలువలు, జీవిత నైపుణ్యాలను పెంపొందించేడమే తమ లక్ష్యమని స్లేట్ ది స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్‌నాథ్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో కర్మన్‌ఘాట్‌కు చెందిన స్లేట్ ది స్కూల్ 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాసిరెడ్డి అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రపంచాన్ని శాసిస్తున్న ఎఐని ఎదుర్కొవడానికి విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్య అనేది కేవలం మార్కులకే పరిమితం కాకుండా వారికి ఆసక్తి రంగాల్లో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంకృతిక నత్య ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిఎన్‌జిఒ డైరీ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిఎన్‌జిఒ హైదరాబాద్ జిల్లా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలు జరిగాయి. ఈ మేరకు జలమండలి ఎండి అశోక్‌రెడ్డి, టిజిఒ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో టిఎన్‌జిఒస్ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఒస్ కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఖాలెద్ అహ్మద్, ప్రచార కార్యదర్శి వైబీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## అప్పీల్ డిస్మిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలోని వివాదస్పద భూమి విషయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సర్వే నం.82లోని భూ సర్వేను నిలిపివేయాలనే అప్పీల్‌ను కొట్టేసింది. 0.30 గుంటల భూమి తనదేనంటూ శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో భూమి హద్దులు నిర్ణయించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. సర్వే చేయాలంటూ సింగిల్ జడ్జి ఆదేశాలు ఇవ్వడాన్ని మల్లారెడ్డి ఇతర కుటుంబసభ్యులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. సర్వే వల్ల భూయాజమాన్య హక్కులు తేలవని, భూమి హద్దులు మాత్రమే తేలుతాయని, కాబట్టి అప్పీల్‌దారులు ఆందోళన అవసరం లేదని ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది.

## నేటి నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 3 నుంచి 28 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను మరోసారి జిహెచ్‌ఎంసి నిర్వహించనుంది. ప్రతి రోజూ 300 డివిజన్‌లలో శుభ్రత కార్యక్రమాలు చేపడతారు. లెగసీ వ్యర్థాలు, మున్సిపల్ ఘన వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఫ్లైఓవర్లు, ఫుట్‌పాత్‌లు, నాలాలు, పార్కులు తదితరల ప్రాంతాలు శుభ్రం చేయనున్నారు. బహిరంగ మూత్ర విసర్జన, చెత్త పారవేతపై స్పాట్ ఫైన్లు విధించనున్నారు. నగర పరిశుభ్రతకు పౌరుల సహకారం అవసరమని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు.

## పార్కులు ప్లాట్లుగా మారుతున్నాయ్

### హైడ్రా ప్రజావాణికి 65 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లేఔట్‌లలో పార్కులుగా చూపిన స్థలాలను తర్వాత ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్నారని హైడ్రా ప్రజావాణికి పలు ఫిర్యాదులు అందాయి. గ్రామపంచాయతీ నుంచి హుడా లేఔట్‌ల వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోందని బాధితులు తెలిపారు. పార్కులుగా గిఫ్ట్ డీడ్లు రాసిచ్చినప్పటికీ ఆ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావసరాల కోసం ఉద్దేశించిన రోడ్లు, స్థలాలనూ ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు అందాయని హైడ్రా అధికారులు తెలిపారు. సోమవారం వచ్చిన 65 ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

## భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన ఎన్.రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు మహారాష్ట్ర మంత్రి, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఆశిష్ శెలార్తో కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు, శాంతి, సమృద్ధి కోసం అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు చేశామని వారు తెలిపారు.

## హసీనాకు రెండు కేసుల్లో పదేళ్ళు కఠిన శిక్ష

**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా (79) కు ఆ దేశ ప్రత్యేక కోర్టు పది సంవత్సరాలు కఠిన జైలుశిక్ష విధించింది. రెండు వేరు వేరు అవినీతి ఆరోపణల కేసులో ఆమెను నేరస్థురాలుగా నిర్ధారించి ఈ శిక్ష విధించారు. ఆమెతోపాటు ఆమె బంధువులకు కూడా ఈ శిక్షలు విధించారు. ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూమి కేటాయింపులలో అవినీతి జరిగిందనేది ఆమెపై ప్రధాన ఆరోపణ. తన అధికారాన్ని ఉపయోగించి ఆమె అవినీతికి పాల్పడ్డారని విచారణలో ప్రాసిక్యూషన్ రుజువు చేసింది. హసీనాకు, ఆమె మేనల్లుడికి ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తి రోబియుల్ అలమ్ ఇంతకుముందే నోటీసులు జారీ చేశారు. హసీనా సోదరి కుమార్తె బ్రిటన్ లేబర్‌పార్టీ ఎంపి, మాజీ మంత్రి తులిప్ సిద్ధిఖ్‌కు ఈ నోటీసులు పంపారు. సిద్ధిఖ్ చెల్లెలు అజామన్ సిద్ధిఖ్, సోదరుడు రద్వాన్ ముజిబ్ సిద్ధిఖ్‌బాబీలకు ఏడుళ్ళు వంతున కఠిన శిక్షలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వారంతా అజ్ఞాతంలో ఉండగానే ఈ తీర్పు వెలువడింది. ఈ కేసులో ఇతర నిందితులు అంటే మాజీ గృహశాఖామంత్రికి, ఆ శాఖ మాజీ కార్యదర్శి, ఇతర అధికారులకు ఐదేళ్ళు వంతున శిక్షలు విధించారు. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌ను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించారు. ఈనెలలోనే బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి.

# 18 శాతానికి టారిఫ్‌లు తగ్గింపు

### భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గుడ్‌న్యూస్

### సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ప్రకటన

### హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్‌కు గుడ్‌న్యూస్ చెప్పారు. భారత్‌పై విధిస్తున్న టారిఫ్‌లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఇవాళ ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడిన సంగతి తెలిసిందే. అక్కడికి కొద్ది సేపటికే టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అదనపు సుంకాలను విధిస్తున్న సంగతి తెలిసిందే. 'భారత ప్రధాని మోదీతో మాట్లాడాను. నా అత్యంత సన్నిహిత మిత్రుల్లో ఆయననొకరు. శక్తివంతమైన నేత. ఇరువురం వాణిజ్యం, ఉక్రెయిన్ రష్యా యుద్ధంతోపాటు అనేక అంశాలపై చర్చించాం. రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేసి.. అమెరికా, వెనెజువెలా నుంచి ఎక్కువ చమురు కొనుగోలు చేయడానికి మోదీ అంగీకరించారు. ఈ నేపథ్యంలో తక్షణమే అమల్లోకి వచ్చేలా అమెరికా–భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని మేం అంగీకరించాం. దీని ప్రకారం అమెరికా విధించే ప్రతీకార సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తాం. అంతేకాకుండా అమెరికాపై విధిస్తున్న సుంకాలను పూర్తిగా తొలగించేందుకు భారత్ ముందుకొస్తుంది. సుమారు 500 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఇంధన, సాంకేతిక, వ్యవసాయ, బొగ్గు, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని మోదీ హామీ ఇచ్చారు. భారత్‌తో సంబంధాలు భవిష్యత్‌లో మరింత బలోపేతం కానున్నాయి' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేతపై భారత్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.



**చాలా ఆనందంగా ఉంది: మోదీ**

టారిఫ్‌లను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రకటన చేసినందుకు 140 కోట్ల భారత్ ప్రజల తరఫున ట్రంప్‌నకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. నా ప్రియ మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది. భారత్‌లో తయారైన ఉత్పత్తులపై సుంకాన్ని 18శాతానికి తగ్గించినందుకు ఆనందంగా ఉంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసిన పని చేసినప్పుడు.. ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా, పరస్పర సహకారానికి అపారమైన అవకాశాలు ఏర్పడతాయి. ప్రపంచశాంతి, శ్రేయస్సు కోసం డొనాల్డ్ ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేస్తున్న కృషికి భారత్ పూర్తి మద్దతిస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఇరుదేశాల భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలను తీసుకెళ్లేందుకు ఆయన కలిసి పని చేయాలని ఆశిస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు.

## కష్టపడిన కార్యకర్తలకే తగిన ప్రాధాన్యత



**ప్రజాపక్షం/వెల్దండ/అచ్చంపేట :** కష్టకాలంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి సైనికుల్లా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రభుత్వపదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించి గుర్తింపునిస్తామని ఎఐసిసి ప్రధానకార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షినటరాజన్ అన్నారు. సోమవారం పట్టణకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మీనాక్షినటరాజన్‌కు ఘనస్వాగతం పలికి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మీనాక్షినటరాజన్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పేదప్రజలను అభివృద్ధికి దూరంచేసేదిశగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యంచేసే విధంగా ప్రధానమంత్రి నరేంద్రమోడి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనలో జరుగుత్ను సంక్షేమ, అభివృద్ధిపథకాల అమలుతీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిసిసి సమన్వయకర్త గంపవేణుగోపాల్, ఎన్‌ఎస్‌యు జాతీయ కార్యదర్శి అనులేఖ, మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, సర్పంచ్ మట్టయాదమ్మవెంకటయ్యగౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు భూపతిరెడ్డి, తక్కళ్లపల్లి శేఖర్, ఎర్రశ్రీను, కృష్ణ ముదిరాజ్, రాజశేఖర్, ముదిగొండ రమేష్, పుల్లయ్య, పురుషోత్తమచారి, హమీద్, వెంకట్‌రెడ్డి, రషీద్, భరత్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

**పేరుమార్పుతో ఉపాధిహామీని ఎత్తివేసేకుట్ర**

ఉపాధిహామీపేరును మారుస్తూ తీసుకున్న నిర్ణయం నిలిపివేసే కుట్రలోభాగమని ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షినటరాజన్ అన్నారు. సోమవారం అచ్చంపేట నియోజకవర్గంలోని బుద్దతండాలో ఆమె రైతుకూలీలతో మాట్లాడుతూ కూలీలకు కుల, మత భేదంలేకుండా పేదలకు నేరుగా అందుతున్న పథకానికి మట్టికొట్టాలని చూస్తున్నారన్నారు. ఇటీవల మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకానికి వీరాంజి పేరుపెట్టడం ఏం అవసరమన్నారు. గాంధీజీ భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన వ్యక్తి అన్నారు. 2006లో ఈపథకం ప్రారంభమైందన్నారు. పథకానికి తిలోదకాలు వదిలేందుకు రాముడి పేరు వాడుతున్నారన్నారు. ఈవిషయంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ ఆందోళ చేస్తుందన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎమ్మెల్సీశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## 'లైట్ ది నైట్' క్యాన్సర్ బాధితులకు అండ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్యాన్సర్ రహిత సమాజం లక్ష్యంగా నిర్వహించిన లైట్ ది నైట్ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ మేరకు క్యూర్ ఫౌండేషన్, అపోలో క్యాన్సర్ సెంటర్స్ ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే వేడుకలు నిర్వహించారు. అంతేకాకుండా బౌల్డర్ హిల్స్ గోల్స్, కంట్రీ క్లబ్‌లో క్యూర్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా క్యాన్సర్ బాధితులకు సంఘీభావం తెలుపుతూ వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విశిష్ట వ్యక్తులు ర్యాంప్‌పై వాక్ చేశారు. కార్యక్రమంలో సీవీ ఆనంద్, లలిత ఆనంద్, పుల్లెల గోపీచంద్, లక్ష్మీ, డాక్టర్ గురువారెడ్డి, డాక్టర్ భవానీ, జయేష్ రంజన్, రుచి రంజన్, రాజీవ్‌రెడ్డి, మంజుల, సురేష్‌రెడ్డి, పద్మజ, డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి, డాక్టర్ శశి, వికాస్‌రాజ్, శైలజ, అజితారెడ్డి, యోగేష్‌పూరి, డాక్టర్ సమీర్ మహేంద్ర, రష్మీ ఆజాద్ తదితరులు పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు చొరవ చూపారు. ప్రదర్శనలో మిసెస్ ఇండియా శిల్పారెడ్డి షోస్టాపర్‌గా నిలిచారు.



## టిజిఎస్‌పిఎస్‌సి ఒటిఆర్‌లో వివరాల నమోదుకు మరోసారి అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల షెడ్యూల్డ్ కులాల వర్గీకరణతో పాటు విద్యా అర్హతల మార్పులు చేర్పులకు సంబంధించి అభ్యర్థుల అభ్యర్థనల మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ఓటిఆర్)లో కొత్త వివరాల నమోదుకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ప్రస్తుతం దాదాపు 31.56లక్షల మంది అభ్యర్థులు ఒటిఆర్‌లో నమోదు చేసుకున్నారని వారంతా తమ తమ అదనపు వివరాలను మరోసారి నమోదు చేసుకోవాలని కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం సూచించారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాలతో పాటు విద్య సామాజిక వర్గం విద్యా అర్హతల సంబంధింత ధృవీకరణ పత్రాలతో పాటు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను ఈ నెల 9వ తేదీ నాటికి అప్‌లోడ్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఒటిఆర్‌లో అందించిన సమాచారాన్నే భవిష్యత్తులో వచ్చే అన్ని నియామక నోటిఫికేషన్‌లకు ప్రాథమిక, తుది డేటాగా పరిగణించబడుతుందని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ఒటిఆర్ డేటాను నిర్దేశిత వ్యవధిలోపు అవసరమైనసర్టిఫికేట్లను అప్‌లోడ్ చేసిన అభ్యర్థులకు మాత్రమే కమిషన్ త్వరలో జారీ చేయబోయే నియామక ప్రకటనలకు దరఖాస్తు చేసుకోవడానికిఅనుమతించబడుతుందని తెలిపారు.



## కేంద్రంలో గుడ్ గవర్నెన్స్ తెలంగాణలో కరప్షన్ రేస్

### మాజీ ఎంపి, బిజెపి నేత జివిఎల్ నరసింహారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ 2047 భారత ఆర్థిక లక్ష్యాలకు బలమైన పునాదిగా నిలుస్తుందని మాజీ రాజ్యసభ సభ్యుడు, బిజెపి నాయకుడు జి.వి.ఎల్. నరసింహారావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు, డేటా సెంటర్లకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే, 'బయో ఫార్మా శక్తి' వంటి నిర్ణయాలతో దక్షిణాది రాష్ట్రాలకు భారీ అభివృద్ధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. అయితే కేంద్రం ఇస్తున్న నిధులకు కూడా కృతజ్ఞతలు చెప్పని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో మునిగిపోయిందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన అంటే నో గవర్నెన్స్, ఓన్లీ కరప్షన్ అని వ్యాఖ్యానించారు. ధరణి స్థానంలో వచ్చిన భూభారతి కూడా అవినీతికే కేంద్రంగా మారిందని విమర్శించారు. మోదీ పాలనలో 12 ఏళ్లుగా అవినీతి మరక లేదని, కానీ తెలంగాణలో మాత్రం 40 నుంచి 60 శాతం కమీషన్‌ల పాలన నడుస్తోందని ఆరోపించారు. 2028లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని జివిఎల్ అన్నారు. ఈ సమావేశంలో నేతలు ఎన్.వి.సుభాష్, సునీతా రెడ్డి పాల్గొన్నారు.

## ఫొటో మార్ఫింగ్ కేసు వివరాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిఎం ఫొటోను మార్ఫింగ్‌ను తీవ్రంగా పరిగణించాలని హైకోర్టు అభిప్రాయపడింది. మార్ఫింగ్ చట్ట వ్యతిరేకమని సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి మార్ఫింగ్ ఫొటో పోస్టు చేశారంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన కావలి వెంకటేష్‌పై నమోదైన కేసుపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని మద్దూర్ పీఎస్ ఎస్‌హెచ్‌వో, ఫిర్యాదుదారు నర్సింహకు జస్టిస్ శ్రీనివాసరావు నోటీసులు ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను మార్ఫింగ్ చేసి, దానిని వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో పోస్టు చేశారన్న ఫిర్యాదు మేరకు తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ వెంకటేష్ వేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 11కు వాయిదా వేశారు.

## పిటిషనర్‌కు బెదిరింపుపై వివరణ ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రూప్–1 పరీక్షల్లో అవకతవకలపై పిటిషన్ వేస్తే ఆ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థుల నుంచి తనకు బెదిరింపులు వస్తున్నాయంటూ లాయర్ బొమ్మరాజు నర్సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పిటిషన్ వల్ల పరీక్షలను హైకోర్టు రద్దు చేసిందని, తనకు రక్షణ కల్పించాలని పిటిషనర్ వాదన. ప్రతివాదులకు డీజీపీ, పోలీస్‌శాఖను హైకోర్టు ఆదేశించింది. విచారణ ఈ నెల 9కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ తుకారాంజీ ప్రకటించారు.రక్షణ కల్పించాలని డీజీపీని కోరినప్పటికీ చర్యలు లేవని, కొందరు దాడి చేయడమే కాకుండా, కారు అద్దాల పగలగొట్టి చంపుతామని బెదించారని పిటిషన్ హైకోర్టు దృష్టికి తెచ్చారు.

## భూసేకరణపై స్టేటస్‌కో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎలివేటెడ్ కారిడార్ కోసం సికింద్రాబాద్‌లోని వక్ఫ్‌బోర్డు భూ సేకరణ చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వక్ఫ్ బోర్డు సీఈవో కూడా కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణ ఈ నెల 11కు వాయిదా వేసింది. సికింద్రాబాద్‌లోని వక్ఫ్‌బోర్డుకు చెందిన 4 ఎకరాల భూ సేకరణ చేయరాదంటూ వినతిపత్రం ఇచ్చినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదని మహమ్మద్ ఆబీద్ పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి విచారణ ఈ నెల 11 వరకు భూసేకరణ ప్రక్రియపై స్టేటస్‌కో ఉత్తర్వులు అమల్లో ఉంటాయని న్యాయమూర్తి మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు.



## సత్వరం స్పందించాలి

### జిల్లా కలెక్టర్ హరిచందన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరం స్పందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఆమె బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.... ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. వాట్సాప్ ద్వారా వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులకు సంబంధించిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.



**వైద్య ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ**

ఆసుపత్రులలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి డైరీ ఉపయుక్తంగా ఉంటుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను డీఆర్‌ఓ వెంకటాచారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటిలతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ డైరీ ఆశా కార్యకర్త నుంచి వైద్య అధికారుల వరకు అందరికీ సమాచారం అందించే వెలుసుబాటుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీబీ ఆఫీసర్ డాక్టర్ చల్లాదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, డా.శ్రీకళ, డా.సాయిబాబా, మాస్ మీడియా అధికారి జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## సక్షమ్-2026



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చమురు, గ్యాస్ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో నిర్వహిస్తున్న దేశ వ్యాప్త కార్యక్రమం సక్షమ్ 2026 బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసబిలిటీస్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్ సర్కిల్ పీఈఎస్‌ఓ జాయింట్ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ వీకే మిశ్రా మాట్లాడుతూ... ఇంధన పొదుపు అవసరం గురించి వివరించారు. విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించడంలో చమురు మార్కెటింగ్ కంపెనీలు, ఎన్ఐఇపిఐడి వంటి సంస్థల సమిష్టి కృషిని ప్రశంసించారు.



## జలమండలి ఎండి పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమస్యాత్మక ప్రాంతాల్లో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పర్యటించారు. ఈ మేరకు ఆయన సోమవారం బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, ఫీల్‌ఖానా తదితర ప్రాంతాలలో పర్యటించి సీవర్ డీప్‌మ్యాన్‌హోళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నాలాపైకప్పు నిర్మాణంలో భాగంగా ధ్వంసమైన పైప్‌లైన్లు, మ్యాన్‌హోల్స్‌లకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు.



## నేడు వేంకటేశ్వరస్వామి రథోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది. బోయిన్‌పల్లి న్యూసిటీకాలనీలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, జగన్నాథం, యాదగిరి, నాగభూషణం, కనకప్రసాద్, అర్చకులు రంగనాథాచార్యులు, శ్రీకాంత్‌చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ తెలంగాణ అభివృద్ధికి ఒక 'స్వర్ణావకాశం'

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర బడ్జెట్ 202627 బడ్జెట్ తెలంగాణ అభివృద్ధికి ఒక 'స్వర్ణావకాశం' అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షులు, మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు పక్కన పెట్టి పథకాల అమలుపై దృష్టి సారించాలని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సూచించారు. హైదరాబాద్ నగరం మూడు హైస్పీడ రైలు కారిడార్లకు కేంద్ర బిందువుగా మారబోతుండటం రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తుందన్నారు. దక్షిణ భారతదేశ వ్యాపార, పారిశ్రామిక రంగాలు అనుసంధానమవుతాయన్నారు. తెలంగాణ జాతీయ లాజిస్టిక్స్, మొబిలిటీ హబ్‌గా అవతరిస్తుందన్నారు. ప్రయాణ సమయం గణనీయంగా తగ్గి, పర్యాటక రంగం పుంజుకుంటుందన్నారు. కాంగ్రెస్ మంత్రులకు ప్రాజెక్టుల అమలుపై అవగాహన లేకపోతే, రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజెపి నేతలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.



# జగదీశన్ విశ్వరూపం..

## వామప్ మ్యాచ్‌లో 49 బంతుల్లో సెంచరీ!

పొట్టి ప్రపంచకప్ వామప్స్‌లో భారత ఏ జట్టు ఆటగాడు నారాయన్ జగదీశన్(104) రెచ్చిపోయాడు. యుఎస్ఎ బౌలర్లను బెంబేలెత్తిస్తూ బౌండరీలతో విరుచుకుపడిన అతడు 49 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. కెప్టెన్ ఆయుష్ బదొని(60 నాటౌట్) అర్ధ శతకంతో వీరవిహారం చేయడంతో ఇండియా ఎ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికే 238 పరుగులు చేసింది. నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో భారత ఏ జట్టు భారీ స్కోర్‌తో యుఎస్ఎకు సవాల్ విసిరింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న అమెరికా జట్టుకు జస్దీప్ సింగ్ ఆదిలోనే బ్రేకిస్తూ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(28)ను వెనక్కి పంపాడు. నాలుగో ఓవర్‌లోనే తొలి వికెట్ పడినా.. నారాయన్ జగదీశన్(104 : 55 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సర్లు) బౌలర్లకు చుక్కలు చూపించాడు. విధ్వంసక ఆట తో చెలరేగిన అతడు 26 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. అదే ఊపులో ప్రత్యర్థి బౌలర్లను ఉతికేస్తూ ఎడాపెడా బౌండరీలు బాదిన జగదీశన్ మరో 23 బంతుల్లోనే సెంచరీ కొట్టడం విశేషం. సర్జరీ నుంచి కోలుకుని ఈ మ్యాచ్‌లో పునరాగమనం చేసిన తిలక్ వర్మ(38) విఫలమైనా.. ఆయుష్ బదొని(60 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. జగదీశన్‌తో కలిసి అర్ధ శతకం భాగస్వామ్యంతో జట్టు స్కోర్ 230 దాటించాడు. వీరిద్దరి మెరుపులతో ప్రత్యర్థికి 239 పరుగుల కష్టమైన లక్ష్యాన్ని ఇండియా ఎ నిర్దేశించింది.

# 'ఐసిసి ప్రొటోకాల్ పాటిస్తాం'

## పాకిస్తాన్‌తో మ్యాచ్‌పై బిసిసిఐ కీలక నిర్ణయం!



టి–20 వరల్డ్ కప్‌లో భారత జట్టుతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలని పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయం పెద్ద దుమారం రేపుతోంది. ఎంపిక పద్ధతిన మెగా టోర్నీలో పాక్ జట్టు ఆడాలనుకోవడాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి తప్పు పడుతోంది. పాక్ ప్రభుత్వం, ఆ దేశ బోర్డు తమ నిర్ణయాన్ని మార్చుకోకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది కూడా. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి సైతం తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించింది. తాము ఐసిసి నిబంధనలను పాటిస్తామని.. పిసిబి చీఫ్ మొహ్సిన్ నఖ్వీ మాదిరిగా పూటకో మాట, రోజుకో విధంగా ప్రవర్తించడం తమకు తెలియదని బిసిసిఐ పేర్కొంది. స్వదేశంలో మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ కోసం పక్కాగా సిద్ధమైన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డనుంది. సన్నాహక సిరీస్‌లో విజయంతో కొండంత ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమిండియా ట్రోఫీ వేటకు కాచుకొని ఉంది. షెడ్యూల్ ప్రకారం లీగ్ దశలో సూర్యకుమార్ యాదవ్ సేన ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో తలపడాలి. కానీ, ఇండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని పాక్ ప్రభుత్వం ప్రకటించడం చర్చనీయాంశమైంది. దాయాదుల బిగ్ ఫైట్ చూడాలనుకున్న కోట్లాదిమంది ఒకింత షాక్ అవుతున్నారు. అయితే.. బిసిసిఐ మాత్రం పాక్ ప్రభుత్వ నిర్ణయాన్ని తేలికగానే తీసుకుంది. తాము ఐసిసి ప్రొటోకాల్ పాటిస్తామని, షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న భారత జట్టు కొలంబో స్టేడియానికి వెళ్తుందని సోమవారం బిసిసిఐ వర్గాలు తెలిపాయి 'వరల్డ్ కప్ ఫిబ్రవరి15 వ తేదీన లీగ్ దశ మ్యాచ్ కోసం భారత జట్టు శ్రీలంకకు వెళ్తుంది. ఐసిసి ప్రొటోకాల్.. షెడ్యూల్ ప్రకారం టీమిండియా క్రికెటర్లు సాధన చేస్తారు. మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశంలో కూడా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతాడు. మ్యాచ్ సమయానికి భారత బృందం స్టేడియానికి చేరుకుంటుంది. ఒకవేళ పాక్ జట్టు ఆడేందుకు సిద్ధంగా లేదంటే ఆ తర్వాత రిఫరీ నిర్ణయం కోసం మేము ఎదురుచూస్తాం. రిఫరీ మ్యాచ్ రద్దు చేశామని చెప్పాకే స్టేడియం నుంచి బయటకొస్తాం' అని బిసిసిఐ వర్గాలు చెప్పినట్టు పలు కథనాలు పేర్కొంటున్నాయి.

**ఆధిపత్యం మనదే..** ఇప్పటివరకూ పొట్టి వరల్డ్ కప్‌లో భారత్, పాక్ జట్లు 8 సార్లు తలపడ్డాయి. ఏడు పర్యాయాలు టీమిండియా జయభేరి మోగించి దాయాదిపై ఆధిక్యం కనబరిచింది. ఇప్పుడు కూడా ఓటమి భయంతోనే పాక్ బాయ్‌కాట్‌కు సిద్ధపడిందని కొందరు అభిప్రాయపడుతున్నారు. మెగా టోర్నీకి మరో ఐదు రోజులు ఉన్నందున ఆలోపు పాక్ ప్రభుత్వ నిర్ణయంపై ఐసిసి ఎలా స్పందిస్తుందో చూడాలి.

# బాయ్‌కాట్ నిర్ణయం మాది కాదు. మేము ఏమీ చేయలేం..!



పదో సీజన్ టి–20 ప్రపంచ కప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉత్కంఠ నెలకొంది. లీగ్ దశలో టీమిండియాతో ఆడబోమని పాక్ ప్రభుత్వం తేల్చిచెప్పడంతో ఫిబ్రవరి 15న దాయాదుల మ్యాచ్ సందేహమే అనిపిస్తోంది. ఇదే విషయంపై పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాను విలేకరులు ప్రశ్నించగా అతడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బాయ్‌కాట్ నిర్ణయం తమది కాదని, ప్రభుత్వం చెప్పినట్టు వినడం తప్ప ఏమీ చేయలేమని అతడు వెల్లడించాడు. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోమని పంతం పట్టిన బంగ్లాదేశ్‌పై వేటు పడగా.. ఇప్పుడు పాకిస్థాన్ అదే తీరుగా వ్యవహరిస్తోంది. లీగ్ దశలో ఫిబ్రవరి 15న కొలంబోలో టీమిండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నామని ఆ దేశం స్పష్టం చేసింది. అయితే.. ఎంచుకొని మ్యాచ్ ఆడడాన్ని సహించమని పిసిబిని ఐసిసి హెచ్చరించింది. అయినా సరే పాక్ బోర్డు మాత్రం స్పందించలేదు. వరల్డ్‌కప్ కోసం సోమవారం పాక్ జట్టు శ్రీలంకకు బయల్దేరింది. జెర్సీ ఆవిష్కరణ అనంతరం కెప్టెన్ సల్మాన్ అఘా మీడియాతో మాట్లాడాడు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ ఇది మా నిర్ణయం కాదు..మేము ఏమీ చేయలేం అని బదులిచ్చాడు.

'వరల్డ్‌కప్‌లో ప్రతి మ్యాచ్ కీలకమే. మేము మూడు లీగ్ మ్యాచ్‌లు గెలవాలనుకుంటున్నాం. మేము ప్రపంచకప్ ఆడేందుకు వెళ్తున్నాం. అయితే.. భారత జట్టుతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలనేది మా నిర్ణయం కాదు. మేము ఏం చేయలేం. మా ప్రభుత్వం, పిసిబి చైర్మన్ ఆదేశాలను మేము పాటించాల్సి ఉంటుంది. మేము అదే చేస్తాం. ఇక వరల్డ్‌కప్‌లో ప్రతి మ్యాచ్ ముఖ్యమైనదే. తొలి రౌండ్‌లో మేము మూడు మ్యాచ్‌లు ఆడుతాం. మూడుకు మూడు కీలకమే. అందుకని ఈ మూడు మ్యాచ్‌లను మేము తేలికగా తీసుకోము' అని సల్మాన్ అఘా వెల్లడించాడు.

## యువతరంగం

### కార్మిక సమస్యలు

# విస్మరించిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్ 2026–27 ఉద్యోగాలు, నైపుణ్యాలు, భవిష్యత్‌కు సిద్ధత వంటి పదాలతో నిండినప్పటికీ, దేశంలోని కార్మిక వర్గం ఎదుర్కొంటున్న మూల సమస్యలను గణనీయంగా విస్మరించింది. యువత సరైన అవకాశాలు లభించక, జీవనం కోసం చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ, భద్రత లేని రోజులు గడుపుతున్నారు. ఇలాంటి నిరుద్యోగులు, ప్రచ్ఛన్న నిరుద్యోగులు, చిరుద్యోగులు, గిగ్ వర్కర్ల గురించిన ప్రస్తావన ఎక్కడా లేదు. కార్మికులపై కనికరం లేని బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బడ్జెట్ మొత్తం దృష్టి ఆర్థిక వృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై ఉండగా, ఆ వృద్ధి వల్ల స్వయంచాలకంగా గౌరవప్రదమైన ఉపాధి ఏర్పడుతుందనే ఒక ప్రమాదకరమైన ఊహపై ఆధారపడింది. గత పదేళ్ల అనుభవం ఈ ఊహను ఖండించినా, అదే దారిని మళ్లీ అనుసరించడం ఈ బడ్జెట్‌లో అత్యంత ఆందోళన కలిగించే అంశం. దేశంలో గ్రామీణ కార్మికులకు అందుబాటులో ఉన్న ఏకైక హక్కు ఆధారిత ఉపాధి వ్యవస్థను తొలగించడం ఈ బడ్జెట్‌లోని అత్యంత తీవ్రమైన నిర్ణయం. పని కావాలంటూ అడిగితే ఇవ్వాల్సిన చట్టబద్ధ బాధ్యతను తొలగించి, పరిపాలనా హామీకి పరిమితం చేయడం వల్ల గ్రామీణ కార్మికులు పూర్తిగా ప్రభుత్వ దయపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పని దినాలను కాగితాలపై పెంచినా, దానికి తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల ఈ హామీ అమలులో సాధ్యం కాదన్న సందేహాలు బలపడుతున్నాయి. అదనంగా, ఖర్చులో పెద్ద భాగాన్ని ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలపై మోపడం వల్ల, వాస్తవంగా పనులే నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఈ బడ్జెట్‌లో సంఘటిత రంగ కార్మికుల సమస్యలైనా, అసంఘటిత రంగ కార్మికుల భద్రతైనా సరైన స్థాయిలో ప్రస్తావనకు రాలేదు. దేశంలోని కార్మికుల్లో తొంభై శాతం పైగా అసంఘటిత రంగానికి చెందినవారే అయినా, వారి కోసం ప్రత్యేకమైన సామాజిక భద్రతా నిధి, సమగ్ర చట్టబద్ధ వ్యవస్థ కనిపించదు. పెన్షన్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి మౌలిక అంశాలను ఎప్పటి మాదిరిగానే, ఈసారి కూడా ప్రస్తావించలేదు. ఇది కార్మికులను ఆర్థిక వ్యవస్థకు ఇన్‌పుట్‌గా మాత్రమే చూడటాన్ని సూచిస్తుంది. కాగా, కనీస వేతనాల సంస్కరణ, సమూహ చర్చ హక్కు, కాంట్రాక్టు వ్యవస్థ దుర్వినియోగంపై నియంత్రణ వంటి అంశాలు ఈ బడ్జెట్‌లో లేవు. కార్మిక చట్టాల అమలుతో ఉద్యోగ భద్రత మరింత బలహీనపడే ప్రమాదం ఉన్నా, కార్మిక రక్షణలపై స్పష్టత లేదు. ఇది కార్మికులను మరింత అసురక్షిత స్థితిలోకి నెట్టే ప్రమాదాన్ని పెంచుతోంది. ఏ రకంగా చూసినా, కేంద్ర బడ్జెట్ 2026–27 కార్మికులను దేశ ఆర్థిక వ్యవస్థలో సమాన భాగస్వాములుగా చూడలేదు. వారు కేవలం వృద్ధికి అవసరమైన సాధనంగా మాత్రమే మారుతున్నారు. హక్కుల ఆధారిత ఉపాధి, సామాజిక భద్రత, వేతన భద్రత వంటి అంశాలను పక్కనపెట్టి, వృద్ధి వస్తే ఉద్యోగాలు వస్తాయనే ఊహపై ఆధారపడటం ఈ బడ్జెట్‌లోని మౌలిక లోపం. నిర్మాణాత్మక లోపాలు, ఆర్థిక లోటులు, ప్రజాస్వామ్య లోపాలు అన్నీ కలిసి ఈ బడ్జెట్‌ను కార్మిక వర్గానికి ఒక చేదు అనుభవంగా మార్చాయి. దేశ ఆర్థిక భవిష్యత్తును నిర్మించే కార్మికులకు ఇది గౌరవం కాదు.. ఒక స్పష్టమైన నిర్లక్ష్య సంకేతం.



### కార్మిక సంఘాల అసంతృప్తి...

కార్మిక వర్గానికి దగ్గరగా ఉండే సంఘాలు కూడా ఈ బడ్జెట్‌ను తీవ్రంగా విమర్శించడం గమనార్హం. వృద్ధి కేంద్రితమైనప్పటికీ, కార్మికులకు మేలు చేసే అంశాలు లేవని, సామాజిక భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఈ సంఘాలు స్పష్టం చేశాయి. నైపుణ్యాభివృద్ధి, రంగాల ప్రోత్సాహం పేరుతో ఉద్యోగాలు రావచ్చని చెప్పినా, తగిన వేతనం, భద్రత, హక్కులు లేకుండా వచ్చే ఉద్యోగాలను సమగ్ర అభివృద్ధిగా పరిగణించలేమని అవి హెచ్చరిస్తున్నాయి.


వస్త్ర పరిశ్రమ, పర్యాటకం, ఆరోగ్యం, సూక్ష్మ–చిన్న–మధ్యతరహా పరిశ్రమలు వంటి రంగాలపై ఈ బడ్జెట్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇవి ఉపాధి సృష్టికి అనుకూల రంగాలే అయినా, ఆ ఉపాధి స్వభావం ఏంటి అనే ప్రశ్నకు సమాధానం లేదు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ వంటి అంశాలు బలపరచకుండా కేవలం రంగాల ప్రోత్సాహం ద్వారా వచ్చే ఉద్యోగాలు, అస్థిరమైనవి, తక్కువ వేతనాలవిగా మారే ప్రమాదం ఉంది. యువత కోసం శిక్షణ, అప్రెంటిస్‌షిప్, సేవారంగ నైపుణ్యాలపై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంది. అయితే

### ఉపాధి స్వభావం లేని ప్రోత్సాహం

ఇది చదువుకున్న నిరుద్యోగం, ఉద్యోగాల లేని వృద్ధి వంటి మూల సమస్యలకు సమాధానం ఇవ్వదు. నైపుణ్యం ఉన్నా ఉద్యోగం లేకపోతే, ఆ శిక్షణ ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నకు బడ్జెట్‌లో సమాధానం కనిపించదు. నిరుద్యోగ భృతి, ప్రభుత్వ రంగ నియామకాలపై స్పష్టమైన దిశానిర్దేశం లేదు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి అనే మాట బడ్జెట్‌లో వినిపించినా, వాస్తవ చర్యలు కనిపించవు. సంరక్షణ రంగంలో పనిచేసే మహిళా కార్మికులకు వేతన సవరణ లేదు. వారి పనిని పనిగా గుర్తించే చట్టబద్ధ హోదా లేదు. పెన్షన్, ప్రసూతి రక్షణ, సామాజిక భద్రత విస్తరణ వంటి అంశాలు పట్టించుకోలేదు. ఇది మహిళల శ్రమను ఇంకా అదృశ్యంగానే ఉంచే దిశగా తీసుకెళ్తుంది.

# లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ ఎఐటియుసి కార్యాలయంలో సోమవారం డైరీ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య మాట్లాడుతూ 1920లో ఎఐటియుసి ఏర్పడ్డ నుండి అనేక పోరాటాలు చేసి కార్మికులకు అనేక హక్కులను సాధించినటువంటి ఘన చరిత్ర ఉందన్నారు. కార్మికుల హక్కులతో పాటు దేశ స్వాతంత్రం కొరకు పోరాటాలు చేసిందన్నారు. కేంద్రప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేస్తుందని, ఈ చట్టాలకు వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షులు కడారి బీరయ్య, కార్యవర్గ సభ్యులు రామారావు, రాజు, ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు విద్యను దూరం చేసే కుట్ర

### ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి అన్యాయమని, కేంద్ర ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తుందని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదాల్ల శరత్ విమర్శించారు. సోమవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శివకుమార్ అధ్యక్షతన నిర్వహించగా ల్యాదాళ్ళ శరత్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లో విద్యా రంగానికి అన్యాయం చేసిందన్నారు. 12 ఏళ్ల మోదీ పాలనలో విద్యా రంగానికి కేటాయింపులు తగిన మొత్తంలో జరగటంలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 10శాతం, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ విభజన హామీ చట్టంలో ఉన్న విద్యాసంస్థలను కేటాయించకుండా, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా మొండి వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. 8 మంది బిజెపి ఎంపిలు ఉన్నా తెలంగాణకి రావలసిన నిధులు, హక్కుల గురించి నోరుమెదపలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. రాజకీయ ప్రసంగాలు చేయడంలో ముందు వరుసలో ఉండే బిజెపి ఎంపిలు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా చేతులు కట్టుకొని ఉంటున్నారన్నారు. తెలంగాణలో ఉన్న విద్యార్థులను, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎన్ని ప్రసంగాలు చేసినా క్షేత్రస్థాయిలో పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మిగులుతుందన్నారు. సమావేశంలో విద్యార్థి నాయకులు మేకల అభిరామ్, రాజు, కార్తీక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# సిపిఐ ఇంటింటి ప్రచారం





**ప్రజాపక్షం/పాల్వంచ :** నిత్యం ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే కమ్యూనిస్టులను ఆదరించాలని, కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐని గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాధం కోరారు. కొత్తగూడెం కార్పోరేషన్ పాల్వంచ డివిజన్ పరిధి 3, 9, 34, 38, 40, 44, 45, 47, డివిజన్‌లో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులు గుగులోత్ కల్పన, వార్డు వాడె లక్ష్మి, భట్టు విజయ, చెరుకూరి శేఖర్‌బాబు, అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, మొగులూరి క్రిష్ణ, గుర్రం వెంకటేశ్వర్లుల విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్నాలేకపోయినా ప్రజల మధ్యన ఉండే నాయకత్వాన్ని ఆదరించి గెలిపిస్తే వార్డులు మరింత అభివృద్ధి జరుగుతాయన్నారు. సిపిఐ అభ్యర్థుల గెలుపుతో పాల్వంచ అభివృద్ధి వేగంగా జరుతుందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అహర్నిశలు పాటుపడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో నేడు ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఎందరు ఎన్ని కుయుక్తులు పన్నినా అనుకున్న లక్ష్యంతో ఎన్నికలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే నాయకత్వంపై ప్రజలు నమ్మకంతో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, పాల్వంచ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా, నీతి, నిజాయితీ, నిబద్ధత, నమ్మి సిద్ధాంతం కోసం ప్రజల తరుపున, ప్రజలకోసం కొట్లాడే ఎమ్మెల్యే కూనంనని సాంబశివరావు నాయకత్వాన్ని బలపరుద్దామని అన్నారు. పాల్వంచ అభివృద్ధికి ఇప్పటికే వందల కోట్ల నిధులు తెచ్చి పనులు చేస్తున్నారని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాధాన్యతా క్రమంలో డెవలప్‌మెంట్ పనులు చేస్తున్నారన్నారు. అవినీతికి ఆస్కారం లేని పాలన కావాలంటే కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి పాల్వంచ అభివృద్ధికి బాటలు వేయాలని విశ్వనాధం ఓటర్లను కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ పట్టణ, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# సేవచేసేవారిని ఆదరించండి

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** సేవ చేసేవారిని ఆదరించాలని, విద్యావంతుడైన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నూనావత్ పాండురంగాన్ని ఆశీర్వదించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 24వ డివిజన్‌లో సూర్యనగర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో అభ్యర్థి విజయాన్ని కాంక్షింస్తూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు అభ్యర్థి నూనావత్ పాండురంగంతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఆర్‌డిఒగా ప్రజలకు సేవలనందించి, రాజకీయంగా ప్రజలకు అండగా ఉండేందుకు వస్తున్న పాండురంగాన్ని కౌన్సిలర్‌గా గెలిపించుకుంటే అభివృద్ధికి తోడ్పడుతాడన్నారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా రామ్మూర్తినాయక్, కూచిపూడి రవి, జిల్లా సమితి సభ్యుడు బానోత్ రాంకోటి, ఖమ్మంరూరల్ మండల సహాయ కార్యదర్శి బానోత్ రామ్మూర్తి, శాఖ సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.



# ఎరువులపై సబ్సిడీ తగ్గింపు అన్యాయం

### రైతుసంఘం ములుగు జిల్లా కార్యదర్శి అంజాద్ పాషా

**ప్రజాపక్షం/ములుగు :** ములుగు జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం సమావేశం బానోత్ నారాయణ సింగ్ ములుగు మండల అధ్యక్షుడు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజాద్‌పాషా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిండు పార్లమెంట్‌లో ఆర్థిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కీలకమైన ఎరువులపైన 4.47 శాతం సబ్సిడీ తగ్గించడాన్ని ములుగు జిల్లా రైతాంగం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా రైతులు వ్యవసాయ రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎరువులపైన ఆహారం ఇంధనంపైన నాలుగు పాయింట్ 47 శాతాన్ని తగ్గించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగానికి అవసరమయ్యే ఎరువులు పురుగుమందులు, డిజిల్, కూలి రేట్లు



పెరిగి అతి వృష్టి, అనావృష్టి, గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ఎరువులపైన సబ్సిడీ ఎత్తేయడం అన్యాయమని ఈ సబ్సిడీ తగ్గింపుకు వ్యతిరేకంగా రైతాంగం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం ములుగు మండల అధ్యక్షులు బానోతు నారాయణసింగ్, జేరిపోతుల పైడి బాబు, భూక్య హనుమాన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రాజెక్టులకు నిధులివ్వని కేంద్రం

### సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్రఅన్యాయం చేశారని నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో సిపిఐ జిల్లాసమితి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఫయాజ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్న అనేక ప్రాజెక్టులు ఈ బడ్జెట్‌లో ఊసేలేదన్నారు. రాష్ట్రానికి అతి ముఖ్యమైనటువంటి స్టీల్ ఫ్యాక్టరీ, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డు ప్రస్తావనే లేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కెటాయించకున్న రాష్ట్రంనుంచి ఎన్నికైన బిజెపి ఎంపిల మౌనం పాటించడం అన్యాయమన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు 2014లో ఇచ్చిన హామీ ఇప్పటికీ బిజెపి ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ప్రకటనలకే పరిమితమైందన్నారు. జడ్చర్ల వయా కొల్లాపూర్ నంద్యాల్ గద్వాల్ డోర్నకల్ రైల్వేలైన్ల ఊసేలేకపోవడం జిల్లాప్రజలను మరోసారి మోసం చేయడమే అవుతుందన్నారు. బిజెపికి చెందిన ఎనిమిదిమంది ఎంపిలు స్పందించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, మండల నాయకులు రామకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గుర్రపుడెక్క తొలగింపు పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

**కూకట్‌పల్లి/ ప్రజాపక్షం:** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అలీ తలాబ్ చెరువు సుందరికరణలో భాగంగా చేపడుతున్న గుర్రపుడెక్క తొలగింపు పనులకు సోమవారం పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలీ తలాబ్ చెరువు సుందరీకరణ పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు కట్ట పటిష్టీకరణ, పునరుద్ధరణ, అలుగు మరమ్మత్తులు, చెరువు చుట్టూ మురుగు నీరు కలవకుండా యూజిడి కాల్వ నిర్మాణం, ఫెన్సింగ్ ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఇఇ గోవర్ధన్, డిఈ మౌనిక, వర్క్ ఇన్స్‌పెక్టర్ మహాదేవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, బిజెపి నాయకుల మధ్య ఘర్షణ.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఉప్పల్:** బిఆర్ఎస్, బిజెపి నాయకుల మధ్య ఘర్షణ నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం రైతు బజార్‌లో పబ్లిక్ బోర్ విషయంలో ఇరుపార్టీల నాయకుల మధ్య వాగ్వాదం కాస్త చిలికి చిలికి గాలి వానగా మారింది. ఈ క్రమంలో నాచారం కార్పొరేటర్ శాంతి భర్త సాయిజెన్ శేఖర్, బిజెపి మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్ ఇరువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో సాయిజెన్ శేఖర్‌తో తనకు ప్రాణహాని ఉంద ని, తనను ఇష్టం వచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించాడని బిజెపి మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే క్రమంలో సాయిజన్ శేఖర్ పవర్




బోర్ పనులకు ఖర్చు మొత్తం మేము పెట్టుకుంటుంటే గోపాల్ గౌడ్ వచ్చి ఫోటోలకు ఫోజులు ఇచ్చి గొడవకు దిగాడని ఆరోపించారు. రైతు బజార్‌లో పబ్లిక్ బోర్ వద్ద జరిగిన జరిగిన తోపులాటలో తనకు గాయాలయ్యాయని ఇది గోపాల్ గౌడ్ ఆయుధంతో దాడి చేసాడని నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఇరువురు నాయకులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి : నేమూరి శంకర్‌గౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా జనసేన పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లిలో పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్‌గౌడ్ మున్సిపల్‌లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు బి–ఫారమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఫారమ్ తీసుకున్న అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలువాలని సూచించారు. ఈ ఎన్నికల్లో డబ్బు, మద్యం, నజరానాల పంపిణీకి దూరంగా ఉండాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పి ఎన్నికల్లో హామీలు ఇవ్వాలని చెప్పారు. అధికార పార్టీల వైఫల్యాలకు ప్రత్యామ్నాయంగా జనసేనా ఆలోచిస్తుందని, విభిన్నంగా ప్రజల్లోకి దూసుకెళ్తుందని అన్నారు. జనసేనా పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ పెద్దిరాజు మాట్లాడుతూ ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి జనసేనా పార్టీకి ఓట్లను అడిగి భారీ మెజార్టీతో గెలిచి తీరాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో 8 మందికి బి ఫారమ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఇన్‌చార్జ్ ఇబ్రహీం, వల్లెపు మాధవి, కైర శ్రీకాంత్, తమటం శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## పార్కు ఏర్పాటు విరమించుకోవాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి డివిజన్‌లోని హనుమాన్ వ్యాయామశాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పార్కు పనులను విరమించుకోవాలని స్థానికులు జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌ను కోరారు. మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. హనుమాన్‌వ్యాయామశాలకు చెందిన స్థలంలో సమీప బస్తీ వాసులు అన్నదానాలు, పూజలు, పేద కుటుంబాల వివాహాలు జరుపుకొనేందుకు అనేక ఏళ్లుగా వినియోగించుకొంటూ ఉన్నారని, ఈ స్థలంలో పార్కు ఏర్పాటు చేయటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రమంలో గిరి రామకృష్ణ, సైదులు, శంకర్, బాబురావు, శ్రీనివాస్, సతీష్, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేస్తు ప్రజలను మభ్యపెడుతుందని కాంగ్రెస్ మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మాజీసర్పంచ్ జాం రవి ఆధ్వర్యంలో జైబీమ్ యువసేన సంఘం సభ్యులు ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకుడు చామకూర భద్రారెడ్డి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ఫైర్ డిజి విక్రమ్ సింగ్ మాన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల చోటుచేసుకున్న ప్రధాన, ప్రాణాంతక అగ్ని ప్రమాదాల నేపథ్యంలో తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ శాఖ అప్రమత్తమైంది. అగ్ని ప్రమాద శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ ఆదేశాల మేరకు హైదరాబాద్ పరిధిలోని భవనాల్లో అత్యవసర ప్రాతిపదికన విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా అగ్ని భద్రతకు, ప్రాణ రక్షణకు ముప్పు కలిగించే ఉల్లంఘనలపై దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యం గా సెల్లార్లను పార్కింగ్‌కు బదులు గోదాములుగా వినియోగించడం, సెల్లార్లలో వాచ్‌మెన్ కుటుంబాలను నివసింపజేయడం, మెట్ల మార్గాలు, ర్యాంపులను అడ్డగించడం, అవసరానికి మించి భారీగా వస్తువులను నిల్వ చేయడం వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. ఏవైనా లోపాలు గుర్తించిన పక్షంలో భవనాల యాజమాన్యం, మేనేజ్‌మెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఫైర్ శాఖ అధికారులను డిజి ఆదేశించారు. భవన యాజమాన్యాలు తప్పనిసరిగా అన్ని ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా భవనాలను నిర్వహించాలని సూచించారు. ఫైర్ అలారం సిస్టమ్స్, స్ప్రింక్లర్లు, ఫైర్ ఎక్స్‌స్టింగ్విషర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని తెలిపారు. ఫైర్ అధికారులు గత నెల 28 నుంచి హైదరాబాద్ పరిధిలో ప్రమాదకరంగా గుర్తించిన సంస్థ ల్లో తనిఖీ లు ప్రారంభించారు. ఇప్పటివరకు మొత్తం 70 వివిధ రకాల సంస్థలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. వాటిలో సంస్థలు (ఇన్‌స్టిట్యూషనల్) 3, హాస్పిటల్స్ 2, మిక్స్డ్ ఆక్యుపెన్సీ 3, కమర్షియల్ 26, మర్కంటైల్ 27, అసెంబ్లీ 3, బిజినెస్2, రెసిడెన్షియల్1, ఇండస్ట్రీ1, మల్టీప్లెక్స్1, మాల్1 ఉన్నాయి. అలాగే భవన యజమానులు, అద్దెదారులు, ఉద్యోగులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తూ అవసరమైన జాగ్రత్తలపై సూచనలు కూడా అందజేశారు. ప్రజలందరూ ఫైర్ సేఫ్టీ మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించి అగ్ని ప్రమాదాలను నివారించడంలో సహకరించాలనివిక్రమ్ సింగ్‌మాన్ విజ్ఞప్తి చేశారు.



## పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఉమ్మడి పది జిల్లాల పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థుల రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌ను రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ మీట్ కు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నాలజీ సెక్రటరీ ఎ. పుల్లయ్య, ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్, ఇంటర్నేషనల్ ఉమెన్ వాలీ బాల్ కోచ్ నజియా కరియప్ప, కళాశాల ప్రిన్సిపల్ వినయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఇంచార్జి సురేష్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్టేట్ లెవెల్‌లో గెలుపొందిన విద్యార్థులను సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్‌లో ఆడించడం జరుగుతుంది. విద్యతోపాటు విద్యార్థులకు ఆటలపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారి మానసిక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయి. రోజులో ఒక గంట అయినా క్రీడలకు కేటాయించినట్లయితేఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

## కోఠి ఎస్‌బిఐ కాల్పుల కేసులో నిందితుల గుర్తింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోఠి ఎస్‌బిఐ శాఖ వద్ద జరిగిన కాల్పులు, దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను గుర్తించినట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు వెల్లడించారు. కాల్పులకు పాల్పడి సుమారు రూ. ఆరు లక్షల నగదును ఎత్తుకెళ్లిన ఇద్దరు వ్యక్తులే ఈ నేరానికి బాధ్యులని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇద్దరు నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల కదలికలను గుర్తించేందుకు సెల్‌ఫోన్ పవర్ డంపింగ్ విధానాన్ని ఉపయోగించి కీలక మొబైల్ నంబర్లను సేకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఘటనాస్థలం పరిసరాల్లోని 800కు పైగా సిసి కెమెరాల ఫుటేజీని విశ్లేషించగా, నిందితుల ప్రయాణ మార్గం, తప్పించుకునే ప్రయత్నాలపై స్పష్టమైన ఆధారాలు లభించినట్లు సమాచా రం. సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల అరెస్టుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్య లు చేపట్టాయి. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని పోలీసులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

### డిసిపి టి.ఉషారాణి
### కీలక ప్రాంతాల్లో షీ టీమ్స్ డెకాయి ఆపరేషన్లు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మహిళలకు ఎవరి వల్లనైనా ఇబ్బందులు తలెత్తినా, అపాయాలను అనుమానిస్తున్నా వెంటనే ఎలాంటి భయం, జాప్యం లేకుండా తమను సంప్రదించి ఫిర్యాదు చేయాలని, వారి భద్రత కోసం అన్ని వేళలా, అన్ని ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు తీసుకొంటున్నామని మహిళా భద్రతా విభాగ డిసిపి టి.ఉషారాణి తెలిపారు. ఎల్‌బి నగర్‌లోని సిపి క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం 52 మంది ఈవ్ టీజర్లకు నిర్వహించిన కౌన్సిలింగ్ సెషన్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ మహిళల రక్షణ, భద్రత కోసం ప్రత్యేకంగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని విద్యా సంస్థలు, బస్‌స్టాండ్‌లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, జనరద్దీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మఫ్టీలో సంచరించే షీ టీమ్స్ బృందాలు సాధారణ వ్యక్తుల మాదిరి నిఘాలో ఉంటూ మహిళలు, యువతులను వేధించే వారిని రెడ్ హ్యాండెడ్‌గా ఆధారాలతో సహా పట్టుకొనే ఏర్పాట్లు చేసామన్నారు. వీరిని తగు ఆధారాలతో న్యాయస్థానాల ముందు హాజరు పరచటంతో పాటు మరోసారి ఇలాంటి తప్పిదాలు చేయకుండా ఉండేందుకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. గతనెల ఒకటో తేదీ నుండి 15 వరకు తమకు మహిళలకు సంబంధించి 97 ఫిర్యాదులు రాగా అరెస్టు చేసిన 81 మందిలో 17 మంది మైనర్లు ఉన్నారన్నారు. మహిళలకు ఫోన్‌లు చేయటం, సోషల్ మీడియా, ప్రత్యక్ష, శారీరక వేధింపులు తరచుగా జరుగుతున్నాయన్నారు. కౌన్సిలింగ్ కార్యక్రమంలో షీ టీమ్స్ విభాగ ఎసిపి వెంకటేశ్వర్లు, ఇనస్పెక్టర్ ముని, అడ్మిన్ ఎస్సై రాజు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలి

### ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తల్లిదండ్రులను గౌరవిస్తు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర అన్నారు. సోమవారం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మూడుచింతలపల్లి, శామీర్‌పేట మున్సిపల్స్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులకు శ్రీ అకాడమీ ఆఫ్ కామర్స్ అండ్ సైన్స్, జఠాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో టిఆర్ఎస్ఎంఎ(ట్రస్మా) వారి సౌజన్యంతో పది, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు మోటివేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో పరీక్షలకు ఎలా సమాయత్తం కావాలని అనే అంశాలపై వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్ల కు దూరంగా ఉంటు సామాజిక మాధ్యమాలను అవసరం మేరకు వాడాలన్నారు. మనకు అన్నం పెట్టే రైతుల పట్ల, దేశానికి కాపల కాస్తున్న జవాన్‌లపై గౌరవం కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కమలాకర్, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోనె హన్మంతరెడ్డి, శ్రీ అకడా మి కామర్స్ అండ్ సైన్స్ డైరక్టర్స్ శ్రీనివాస్‌రావు, శ్రీకాంత్, జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ డైరక్టర్ అరుణ్, కరస్పాండెంట్‌లు శ్రీకాంత్‌రెడ్డి, జంగారెడ్డి, శివశంకర్, ఫణిధర్, ముత్తయ్య, శ్రవణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

### 9,10,12వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయిపూర్‌లోని 9,10,12వార్డులలో పర్యటించిన ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 10వ వార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని,పట్టణాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో సాధ్యమన్నారు. 9వ వార్డు అభ్యర్థి చైతన్య ప్రశాంత్, 10వ వార్డు అభ్యర్థి అల్లాపురం శ్రీకాంత్, 12వ వార్డు అభ్యర్థి మాజీ కౌన్సిలర్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డిల తరపున ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో కలసి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాండూరు మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకొని వార్డుల పురోగతికి నిధులు మంజూరుచేస్తూ అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత అర్హులైన వారందరికీ ఫించన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురలీకృష్ణగౌడ్, నాయకులు రావుఫ్, బంటుమల్లప్ప, సురేందర్‌రెడ్డి, మధులత శ్రీనివాసాచారి వార్డుల కౌన్సలర్ అభ్యర్థులు, యువకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.



**భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరికలు**

మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని తాండూరు పట్టణంలోని పలు వార్డులకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. సోమవారం వార్డు పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యాన 10వ వార్డు నుండి 30మంది, 21వార్డులో సుమారు 50మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## బాధ్యతతో ఎన్నికల నిర్వహణ



**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు బాధ్యతతో ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రానికి పూర్తి బాధ్యత వహించాలని, చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకునే అధికారము ఉంటుందని పోలింగ్ సామగ్రి స్వీకరించి తనిఖీ చేసుకోవాలని, మహిళలకు, వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.



## ముఖ్యమంత్రి రాకకు ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాపక్షం/పరిగి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లా, పరిగి మండలానికి 7వ తేదీన రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఈ సందర్భంగా హెలిప్యాడ్ ఏర్పాట్లను, నారాయణపూర్ గ్రామ శివారు నందు బహిరంగ సభ, వెహికిల్ పార్కింగ్, టైలెట్స్, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వాసుచంద్ర, ఆర్‌అండ్‌బి శ్రీధర్‌రెడ్డి, పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

**పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలి**

**వికారాబాద్:** మున్సిపాలిటీలో ఓటరుగా నమోదై ఉండి ఎన్నికల విధి కొరకు డ్రాఫ్ట్ చేయబడిన ఉద్యోగి 03.02.2026 లోపు పోస్టల్ బ్యాలట్ కొరకు క్రింద చూపడిన పత్రాలు సమర్పించాలని జిల్లా కలెక్టర ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం12, ఎలక్షన్‌డ్యూటీ ఆర్డర్ కాపీ, ప్రభుత్వ ఉద్యోగి ఆర్డర్ కాపీ, మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. 6,7,8 తేదీలలో బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.



## కార్మికుల జీవితాలతో చెలగాటమాడొద్దు

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** కార్మికులు, కర్షకుల జీవితాలతో కార్పోరేట్ కంపెనీలు చెలగాటమాడటం సరికాదని అలియాబాద్ ఎన్నికల ఇంచార్జ్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటి పరిధిలోని హెచ్‌బిఎల్ కంపెనీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తు ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి హెచ్‌బిఎల్ కంపెనీ ముందు ధార్నా చేస్తున్న కార్మికులకు మద్దతుగా నిలిచారు. కార్మికులకు రావాల్సిన డిమాండ్లను నెరవేర్చేవరకు మద్దతు ఇస్తామని మర్రి రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ రోజుకు రూ.450 నుంచి 550 వరకు మాత్రమే వేతనం ఇస్తున్నారని పెరిగిన ఖర్చులను దృష్టిలో పెట్టుకుని కనీసం రూ.650 పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను విరమించి వెంటనే జీత భత్యాలు సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చీదు శ్రీనివాస్‌రెడ్డి, సరసం మోహన్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, నరేష్, వెంకటేష్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/వికారాబాద్:** మున్సిపల్ పరిధిలోని 10వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పట్టణ అధ్యక్షులుగా పోటీ చేస్తున్న సుధాకర్‌రెడ్డిని గెలిపించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలిచి 33వార్డును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలు గెలిపిస్తే సమస్యల పరిష్కారం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ...

### 44 గ్రాములు బంగారం, వెండి, నగదు అపహరణ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని భవాని నగర్ రోడ్ నంబర్‌లో నివాసముండే కొలుకుల వెంకటసుబ్బారావు తన భార్య పిల్లలతో స్వగ్రామం మాచర్లకు వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి చేరుకోగా మెయిన్ డోర్ తలుపు తాళం పగులగొట్టి తెరచి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు బెడ్‌రూమ్‌లు తలుపులు తెరిచి అల్మారాలో ఉన్న 44 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గమనించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి



**ప్రజాపక్షం/వికారాబాద్:** రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బుగ్గరామేశ్వర్ స్వామి వద్ద లారీ హెచ్‌ఆర్ 38 వై ఒ 333 నెంబర్ చెందిన లారీ అదుపుతప్పి అదే రోడ్డులో ఎదురుగా వస్తున్న కొండపూర్ కాలాన్ గ్రామానికి చెందిన తండ్రి కుమారులు వస్తున్న బైకుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కుమారుడు రిత్విక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి లాలయ్య ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందాడు. భార్య, కూతురు స్వల్ప గాయాలతో బయటపట్టారు, ఈ సంఘటన జరిగిన వెంటనే వికారాబాద్ సిఐ కె.రఘు కుమార్ వెళ్లి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ ఓవర్ స్పీడ్‌తో పాటు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. టెస్ట్ నిర్వహించి చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా లాలయ్య కుటుంబాన్ని రాజకీయ పార్టీ నాయకులు పరామర్శించి మాట్లాడుతూ నిరుపేద కుటుంబం అయిన లాలయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో 25లక్షలు పరిహారం ప్రకటించాలని వివిధ పార్టీ నాయకులు కోరారు.

## పార్కుల అభివృద్ధికి సహకారం

వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** పార్కుల అభివృద్ధికి తన సహకారం ఉంటుందని వనస్థలిపురం డివిజన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌లోని ఎఫ్‌సిఐ కాలనీలో సీనియర్ సిటిజన్ పార్కు అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులతో పనులను కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు డివిజన్‌లో పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కారం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్‌గౌడ్, ఎఫ్‌సిఐ కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రమణాథ్, కాలనీ అధ్యక్షులు నరసింహారావు, రాజు యాదవ్, ప్రతాప్‌రెడ్డి, గంగిరెడ్డి, నారాయణరెడ్డి, పట్టాభి రామయ్య, శివ రెడ్డి, ప్రకాష్ గుప్తా, రంగయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కారం చూపి కాలనీ ప్రజలకు సమస్య తలెత్తకుండా చూడాలని జలమండలి అధికారులను హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. సోమవారం సూర్యనగర్ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌పై కాలనీల్లో పర్యటించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జలమండలి మేనేజర్ రాజు, సూపెర్వైసోర్ బాలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే మంచి ఫలితాలు



**ప్రజాపక్షం/యాచారం :** విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు ఉంటాయని చిన్నతూండ్ల గ్రామ అంబేద్కరు యువజన సంఘం అధ్యక్షులు సామర్తి జగన్ అన్నారు. సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5 వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఎంట్రన్స్ మేటిరియల్, బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ,సూర్యకళ, ఎన్. మల్లేశం,అంబేద్కరు యువజన సంఘం కార్యదర్శి మస్కు రవిందర్, క్రీడా కార్యదర్శి నాగని సుధాకర్,సలహా దారుడు మస్కు సంజీవ,కుమార్,నాగని భగత్, బొర్ర భూషణ్,గంథం రాఘవేందర్,మస్కు విక్రమ్,సామర్తి వంశీ పాల్గొన్నారు.

## అభ్యర్థులకు బి.ఫామ్‌ల అందజేత



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 15మంది అభ్యర్థులకు మొదటి విడతలో బి.ఫామ్‌లను అందజేశారు. సోమవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అధ్యక్షతన షాద్‌నగర్ మున్సిపాలిటిలో పోటీ చేస్తున్న 15మంది అభ్యర్థులకు మొదటి విడతలో బి.ఫామ్‌లను అందజేశారు. అభ్యర్థులు కాసోగి శివ, గడియారం శ్యాంసుందర్, ఆంజనేయులు, వెంకటేష్, భాస్కర్ పటేల్ చావ్లా, ప్యాట అశోక్, శ్రీహరి గౌడ్, పి.రాజేశ్వరి, పల్లాటి స్వప్న, గడ్డం రేవతి, గజ్జె మహేశ్వరీ, క్యామ లక్ష్మీ ప్రసన్న, పద్మ సాయిరాం, పోలే అశ్విని, మానగ విజయలు పార్టీ బి.ఫామ్ పొందారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌రెడ్డి, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, దుష్యంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడానికి కృషి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రజాసమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని మొండిగౌరెల్లి గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి అన్నారు. సోమవారం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరు సహకరిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తమ వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బడే కుమార్‌తో బాటు వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెను ప్రకారం భోజనం



**ప్రజాపక్షం/కేశంపేట:** విద్యార్థులకు మెను ప్రకారమే భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్థవెల్లి గ్రామ సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని నిర్థవెల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారంతో కూడిన సమతుల్యమైన భోజనాన్ని అంధించేలా చూడాలని, వంటకోసం తాజా కూరగాయలు నాణ్యమైన సరుకులనే వినియోగించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఖాజా పాషా, బోద మల్లేష్, ముత్యాలు, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, పిఇటి ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## బడ్జెట్ కేటాయింపుల్లో
# బిసిలకు అన్యాయం



సామాజిక న్యాయం కొరకు ఐక్య ఉద్యమాలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసి సమాజం బడ్జెట్ కేటాయింపులు, విధాన నిర్ణయాలు, సంక్షేమ అమలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యానికి, అన్యాయానికి, ఆధిపత్య కులాల దోపిడీకి గురవుతున్నదని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు దేశంలో 80 కోట్ల మంది బిసిలకు కేంద్ర బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడమే నిదర్శమన్నారు. ఇకనైనా బిసిలంతా ఏకమై సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ ఆత్మగౌరవ స్ఫూర్తిని కాపాడేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో బిసిలకు కేటాయించిన రూ.11405 తక్షణమే విడుదల చేయాలని, వచ్చే బడ్జెట్‌లో రూ.30వేల కోట్లను ప్రత్యేకంగా కేటాయించాలని కోరుతూ ఎంఎల్‌ఎలకు, ఎంపిలకు, సిఎంకు వినతిపత్రాలందజేస్తామన్నారు. తర్వాత ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపడుతామన్నారు. మార్చిలో లక్ష మందితో బహిరంగ సభ చేపడుతామని తెలిపారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి ఇంటెలెక్చువల్ ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో యర్రమాద వెంకన్న అధ్యక్షతన బిసి కుల సంఘాల ప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిల సబ్‌ప్లాన్ తరహాలో బిసి సబ్‌ప్లాన్ చట్టబద్ధంగా అమలు చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంచార జాతుల విద్య ఉపాధి, ఆరోగ్య, నివాసం, జీవనోపాధి అభివృద్ధికి రూ.10వేల కోట్లతో ప్రత్యేక స్వతంత్ర ఏజెన్సీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్‌లు అయిలి వెంకన్నగౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, మురళీమనోహర్,అవ్వారు వేణు పలు బిసి కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో
# అడ్డగుట్టను సిపిఐకి కేటాయించాలి

సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి

కాంపల్లి శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్, సిపిఐ అవగాహన మేరకు అడ్డగుట్ట డివిజన్‌ను సిపిఐకి కేటాయించాలంటూ సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీని కోరారు. సోమవారం అడ్డగుట్టలోని సిపిఐ కార్యాలయం శ్రామిక భవన్‌లో గౌరీ నాగరాజ్ అధ్యక్షతన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టుల రాజీలేని పోరాటాల ఫలితంగానే అడ్డగుట్ట ఆవిర్భవించిందని, ఆ ప్రాంత ఏర్పాటులో కమ్యూనిస్టు పార్టీ నాయకుల త్యాగాలు కీలకమని గుర్తు చేశారు. అడ్డగుట్ట ప్రాంత సమస్యలపై సిపిఐకి సంపూర్ణ అవగాహన ఉందని, అందువల్ల రానున్న జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో సిపిఐకి కార్పొరేటర్ టికెట్ కేటాయించడం న్యాయసమ్మతమని కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేశారు. అడ్డగుట్టలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం రానున్న రోజుల్లో ప్రత్యేక కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ క్రియాశీలక కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి, సిపిఐని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ సీనయర్ నాయకులు పాకాల యాదగిరి, సింగారయ్య, వెంకటేశ్, అంజి, యాదగిరి, దస్తగిరి, కొండల్, రఫిక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# నేటితో ముగియనున్న ఉపసంహరణ గడువు

రెబల్ అభ్యర్థుల ఉపసంహరణకు బేరసారాలు

బీ-ఫారం అందిన అభ్యర్థుల్లో ఆందోళన

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టికి చెందిన అభ్యర్థులే అత్యధికంగా రెబల్‌గా నామినేషన్లు వేశారు. నేటితో ఉపసంహరణకు గడువు ఉండటంతో ప్రధాన పార్టికి చెందిన అభ్యర్థులు రెబల్ అభ్యర్థుల ఇండ్ల చుట్టు ప్రదక్షిణలు చేయటమే కాక ముడుపులైనా చెల్లిస్తామని బేరమాడుతున్నారు. రెబల్ అభ్యర్థులు మాత్రం మున్సిపల్ ఎన్నికలలో గెలుపు ఓటమిలు సహజమే, మేము మాత్రం ఎలాగైన పోటిలో ఉంటామని ఉపసంవరణలకు నిరాకరిస్తున్నారు. మున్సిపల్ నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీలలోని నాయకులు కౌన్సిలర్‌గా గెలుపొందాలని ప్రతి ఒకరు ఆసక్తి చూపుతున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ కావటంతో 24వార్డులలో వివిధ కెటగిరిలను కెటాయించిన రిజర్వేషన్‌లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించటంతో ఒక్కొక్క వార్డులలో తాజా, మాజీ అభ్యర్థులు అత్యధికంగా నామినేషన్ల వేశారు. ప్రధానంగా శేరిగూడ గ్రామంలోని 14, 16వ వార్డులలో కాంగ్రెస్ పార్టికి చెందిన నాయకులే పార్టి బిఫారం నాకంటే నాకే వస్తుందని ఎవ్వరికి వారే ముమ్మరంగా ప్రచారం చేసుకుంటు రెబల్‌గా అత్యధికంగా నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే సీతరాంపేట గ్రామంలో 7వ వార్డులో పోటీ చేస్తున్న అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు కొనసాగుతుంది. జనరల్ స్థానాలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రతరం కానుంది. 24 వార్డులకు గాను 125 నామినేషన్లు దాఖలు కాగా నేటితో ఉపసంవరణ గడువు ముగియటంతో గెలుపుపై ఆశక్తి ఉన్న నాయకులు రెబల్ అభ్యర్థులను స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో కూర్చో బెట్టి బుజ్జగింపులు చేస్తున్నారు. బుజ్జగింపులకు రెబల్ అభ్యర్థులు ఉపసంవరించు కోక పోతే లక్షల్లో రూపాయలు ఇస్తామని రహస్యంగా బేరం ఆడుతూ బతిమాలుతున్నారు. బిఆర్‌ఎస్, బిజెపిల అధిష్టానం మాత్రం పట్నం చైర్మన్ పదవి ఎలాగైన కైవసం చేసుకోవాలని పట్టుదలతో స్వంత పార్టిలో రెబల్ బెడద లేకుండా గెలుపు గుర్రాలనే ప్రకటించుకొని ముందుగానే పార్టీ భీఫారంలు అందచేసుకున్నారు. రెబల్ అభ్యర్థులకు పార్టి బీ ఫారం లభించకుంటే అలిగి కాంగ్రెస్ పార్టి నుంచి పోటీ చేస్తున్నా అభ్యర్థులను ఓడించటానికి స్వతంత్రంగనైనా పోటీ చేయటానికి సిద్ధ పడుతున్నారు. ఎన్నికల అధికారులు మాత్రం పార్టి బి ఫారంలు అందచేసిన వారికి పార్టీ గుర్తులను గుర్తించి మిగతా అభ్యర్థులను స్వతంత్రులుగా ప్రకటించనున్నారు.

# ఉపకార వేతనాలకు దరఖాస్తు

రంగారెడ్డి జిల్లా సహాయ కార్మిక

కమిషనర్ సత్యనారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కార్మికుల పిల్లలకు అందించనున్న ఉపకార వేతనాలకు అర్హులైన వారు ఫిబ్రవరి 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా సహాయ కార్మిక కమిషనర్ సత్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలు చేయుచున్న సంక్షేమ పథకాలలో భాగంగా దుకాణములు, వాణిజ్య సంస్థలు, కర్మాగారములు, మోటారు రవాణా సంస్థలు సహకార సంస్థలు, ధార్మిక లేదా ఇతర ట్రస్టులలో పని చేయుచున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు ఈ దిగువ తెలియచేసిన కోర్సులలో 2024–25 విద్యాసంవత్సరములో ఉత్తీర్ణులయిన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనముల కొరకు దరఖాస్తులు కోరుచున్నట్లు సహాయ కార్మిక కమిషనర్ సత్యనారాయణ రెడ్డి వివరించారు. దరఖాస్తు ఫారములు సంబంధిత, సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో పొందవచ్చునని, పూర్తిచేసిన దరఖాస్తులు ఫిబ్రవరి 15 లోపు సంబంధి కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అసంపూర్తిగా వున్న లేక గడువు తరువాత సమర్పించబడిన దరఖాస్తులు తిరస్కరించడం జరుగుతుందన్నారు. ఉపకార వేతనాలకు సంబంధించి పదవ తరగతి, ఐటిఐ విద్యార్థులకు ఒక వెయ్యి రూపాయలు చొప్పున, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.1500, కాగా ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బిఎస్‌సి (అగ్రికల్చర్), బిఎస్‌సి (వెటర్నరి), బిఎస్‌సి (నర్సింగ్), విఎస్‌సి (హార్టికల్చర్), బిసిఎ, ఎంసిఎ, బిపార్మసి, ఎంపార్మసి, ఎంబిఎ, డిప్లమా ఇన్ మెడికల్ లేబోరెటరీ టెబోరెటరీ పిజిడిపమా ఇన్ మెడికల్ లేబోరెటరీ టెబోరెటరీ వారికి 2000 రూపాయల చొప్పున చెల్లించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులను వారి క్లాసు లేదా కోర్సులలో మార్కుల శాతం ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు. ఎంపిక అయిన అభ్యర్థులకు ఉపకారవేతనాలను సంబంధిత సహాయ కమీషనర్లు మేడే నాటికి లబ్దిదారుల బ్యాంకు ఖాతాలలో జమచేస్తారని సహాయ కార్మిక కమిషనర్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గుర్రంపీర్ ఉత్సవాలు

బందోబస్తును పర్యవేక్షించిన ఎసిపి లక్ష్మీనారాయణ



**ప్రజాపక్షం/కొందుర్గు:** గుర్రంపీర్ ఉర్సు ఉత్సవాలకు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని గుర్రంపల్లి గ్రామంలో గుర్రంపీర్ ఉర్సు ఉత్సవాలకు కుల మతాలకు అతీతంగా భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు. ఉర్సు ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాట్లును షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గుర్రంపీరు ఉర్సు ఉత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా సాగుతాయని, దాంతో గుర్రంపల్లి గ్రామస్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుండి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో మొక్కులు చెల్లించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుర్రంపల్లి సర్పంచ్ ఈరని జంగయ్య, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం

దేవునిబండ తండా సిపిఐ సర్పంచ్ ఎం.శ్రీనునాయక్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆదర్శ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని దేవునిబండ తండా సిపిఐ సర్పంచ్ ఎం.శ్రీనునాయక్ వివరించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిబండ తండా (గంట్లవెల్లి) పంచాయతీలో డ్వాక్రా భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనునాయక్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం పంచాయతీకి డ్వాక్రా భవనంతోపాటు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు మంజూరు చేశారని తెలిపారు. తండా వాసులంతా ఐక్యంగా ఉంటే అభివృద్ధి చేసేందుకు తాను సిద్దంగా ఉన్నానని, ఎమ్మెల్యే సహాకారంతో నిధులు పెద్ద ఎత్తున తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్‌లాల్, అంగన్‌వాడి టీచర్ సుమతి, బాదావత్ శంకర్, రూప్లానాయక్, రమేష్, మంగమ్మ, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు టోర్నమెంట్లు దోహదం : ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం/కేశంపేట :** క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలిసి తీసేందుకు టోర్నమెంట్లు ఉపయోగపడుతాయని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సీజన్1ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు వచ్చిన అవకాశాలను అంధిపుచ్చుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. క్రీడల పట్ల కృషి, పట్టుదల ఉంటే గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి చేరుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావిస్తూ ముందుకు వెళ్తేనే లక్ష్యం సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్రీడలతోనే మానసిక ప్రశాంతత, ఆరోగ్య స్థితి గతులు మెరుగుపడుతాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ఆనంద్, మాజీ సర్పంచులు శేఖర్ పంతులు, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, జంగయ్య, ఆంజనేయులు, లింగంధాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, తూర్పుగడ్డ తండా సర్పంచ్ తుకారాం, లేమామిడి సర్పంచ్ సులోచన శ్రీనివాస్, నాయకులు రాంచందర్, యాదయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

# ఇంటర్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఫిబ్రవరి 25 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో ఇంటర్ పరీక్షలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, పరీక్ష విధులు నిర్వహించే ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 200 పరీక్షా కేంద్రాలలో 84,301 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 70,171 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పోలీస్ శాఖ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్‌టిసి అధికారులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన ఫర్నీచర్ ఉండేలా చూడాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు మౌలిక సదుపాయాలు సరిగా ఉండేలా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యా శాఖ అధికారి పి.సుసిందర్‌రావు, పోలీస్, పోస్టల్, ఆర్‌టిసి, విద్యుత్, మెడికల్ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### రెవెన్యూ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయూస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) కాలెండర్, డైరీని కలెక్టర్ నారాయణరెడ్డి అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది గౌతమ్‌కుమార్, జనార్ధన్ రావు, రాములు, వేణుగోపాల్, రాజిరెడ్డి, రాజేశ్వర్, నాగమణి, రామకృష్ణ, జంగయ్య, వాణి, సత్యనారాయణ, రాజు, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, మాధవి, ఝాన్సీ వెన్నెల శ్రీనివాస్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
03-02-2026
www.prajapaksham.in

‘ ర్యాంప్ వాక్‌లో తళుక్కుమన్న సితార హీరో మహేష్ బాబు కుమార్తె సితార ఘట్టమనేని సోషల్ మీడియాలో ఎప్పుడూ వైరల్ అవుతుంటుంది. జ్యూయలరీ యాడ్స్ చేస్తూ ఉంటుంది. ప్రముఖ జ్యూయలరీ బ్రాండ్‌కు అంబాసిడర్‌గా కూడా పని చేస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో జరుగుతున్న జ్యూయలరీ ఎగ్జి బిషన్‌లో సితార ర్యాంప్ వాక్ చేసింది. ’



## 6న ‘దక్షిణ కాళీ’ రిలీజ్



సుబ్బు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా ‘దక్షిణ కాళీ’. హీరోయిన్ అర్చన అమ్మవారి పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రానికి కథను అందించి శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు సత్యవాణి మీసాల. డివోషనల్ కథతో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తోట కృష్ణ. ఈ సినిమా ఈ నెల 6న తెలుగు, తమిళ, కన్నడలో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా సాంగ్స్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ దర్శకుడు వి సముద్ర, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. పాటల విడుదల అనంతరం దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ ‘దక్షిణ కాళీ’ సినిమా పాటలు, ట్రైలర్ చాలా బాగున్నాయని అన్నారు. ఈ సినిమా కంటెంట్ చూస్తుంటే అమ్మోరు మూవీ గుర్తుకు వస్తోందని అన్నారు. అరుంధతి సినిమాలో సోనూ సూద్ లా ఈ చిత్రంలో విలన్ గా నటించిన ఆజాద్‌కు పేరు రావాలని ఆయన చెప్పారు. దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ అమ్మవారి మహిమలు తెలిపేలా దక్షిణ కాళీ చిత్రాన్ని రూపొందించామని అన్నారు. దర్శకత్వంతో పాటు ఓ కీలక పాత్రలో నటించానని తెలిపారు. ప్రేక్షకుల్ని నిరాశపరచకుండా, వాళ్లు కోరుకునే అన్ని అంశాలతో సినిమా ఆకట్టుకుంటుందని ఆయన అన్నారు. నిర్మాత సత్యవాణి మీసాల మాట్లాడుతూ సినిమా నిర్మాణం నుంచి రిలీజ్ దాకా అమ్మవారే మమ్మల్ని నడిపిస్తూ వచ్చారని అన్నారు. నటుడు ఆజాద్ పాల్గొన్నారు.


## ’ది ఇండియా హౌస్’తో తెలుగులో శాశ్వత్ సచ్‌దేవ్



నిఖిల్ సిద్ధార్థ ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా చిత్రం ’ది ఇండియా హౌస్’ షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని వి మెగా పిక్చర్స్‌తో కలిసి ది కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2 వంటి విజయవంతమైన చిత్రాలని అందించిన అభిషేక్ అగర్వాల్ ఆరట్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సమర్పిస్తున్నారు. సాయి మంజ్రేకర్ కథానాయిక. అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ధురంధర్, ఉరి: ది సర్జికల్ స్ట్రైక్ , ఆర్టికల్ 370 చిత్రాలతో పాపులరైన బాలీవుడ్ స్టార్ కంపోజర్ శాశ్వత్ సచ్‌దేవ్ ’ది ఇండియా హౌస్’తో తెలుగులోకి అడుగుపెడుతున్నారని అభిషేక్ అగర్వాల్ ప్రకటించారు. ఆయన ఇప్పటికే ఐదు ఆకట్టుకునే ట్రాక్‌లను కంపోజ్ చేశారు. పాటల చిత్రీకరణ అద్భుతంగా వచ్చింది అని అన్నారు.1905 నాటి రాజకీయ నేపథ్యంలో రూపొందుతున్న ’ది ఇండియా హౌస్’ విప్లవం, ప్రేమ, త్యాగం వంటి భావోద్వేగాలో అద్భుతంగా ఉండబోతుంది. బాహుబలి,ఆర్ ఆర్ ఆర్ ఫేం సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ డీవోపీగా పని చేస్తున్నారు. విశాల్ అబానీ ప్రొడక్షన్ డిజైనర్. దంగల్, బజరంగీ భాయిజాన్,పీకే చిత్రాలకు ప్రసిద్ధి చెందిన ముఖేష్ ఛబ్రా కాస్టింగ్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు.

## దూసుకెళ్తున్న ‘రణబాలి‘ గ్లింప్స్

15 మిలియన్ ప్లస్ వ్యూ




విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న క్రేజీ మూవీ ‘రణబాలి‘. ఈ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ‘రణబాలి‘ సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ గ్రాండ రిలీజ్ కు రాబోతోంది. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే 15 మిలియన్ ప్లస్ వ్యూస్ తో ‘రణబాలి‘ టైటిల్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా సాధించబోయే సక్సెస్ కు టైటిల్ గ్లింప్స్ కు వస్తున్న స్పందనే ఫస్ట్ స్టెప్ గా మూవీ టీమ్ భావిస్తోంది.ఈ సినిమా గ్లింప్స్ లో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించిన తీరు మెస్మరైజ్ చేసింది. దర్శకుడు రాహుల్ సంకృత్యన్ ఎంచుకున్న కథా నేపథ్యం, ప్యాషనేట్ మేకింగ్, మైత్రీ మూవీ మేకర్స్ భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ టైటిల్ గ్లింప్స్ కు హైలైట్ గా నిలిచాయి. జయమ్మగా రశ్మిక మందన్న ఆకర్షిస్తోంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ‘రణబాలి‘ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికికో ప్రొడ్యూసర్స్ అనురాగ్ పర్వతనేని, శివ్ చనన, సంగీతం అజయ్ అతుల్, డీవోపీ నీరవ్ షా, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్,చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, కొరియోగ్రఫీ కృతి మహేశ్,ఆర్ట్ డైరెక్టర్ విఠల్ కోసనం, యాక్షన్ కొరియోగ్రాఫర్స్ యెన్నిక్ బెన్, ఆండీ లాంగ్ గ్యుయెన్, రాబిన్ సుబ్బు.

## ఒక వస్తువుని శోధించి సాధించే వ్యక్తి జీవితం 'హనీ'



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణకుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓ వీ ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలెవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన ‘హనీ‘ ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలోడైరెక్టర్ కరుణ కుమార్ మాట్లాడుతూ సాహిత్యం కోసం చీకటి అనే కథ రాశాను. దాన్ని సినిమా తీద్దామని మా నిర్మాతలు వచ్చారు. మదనపల్లి, పాతబస్తీ, ఒకే ఇంట్లో కొందరు ఉరి వేసుకోవడం ఇలాంటి ఘటనలు చూస్తుంటాం. హనీ సినిమాలో పిల్లి మాయ అనే ఒక వస్తువుని శోధించి సాధించే ఒక వ్యక్తి జీవితం చూపించాం. మెదడు అంతా చీకటి ఉన్నా మనసుల మధ్య జరిగిన ఒక కథ. నిజ జీవిత సంఘటన నుంచి స్ఫూర్తిగా తీసుకుని సినిమా చేయడం జరిగింది. మనిషి మెదడు కంటే పెద్ద దయ్యం లేదనేది ఈ సినిమా సారాంశం. కొత్త కథలు చేయడానికి ఎప్పుడూ ముందుండే నవీన్ చంద్ర ఈ సినిమా కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నారు. ఇందులో ఎప్పుడు చూడని నవీన్ చంద్రని చూడబోతున్నారు. అలాగే రాజా రవీందర్ పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. అలాగే దివి, దివ్య అందరు కూడా ఒకరికి మించి ఒకరు చేశారు. మా టెక్నికల్ టీం కూడా చాలా సపోర్ట్ చేసింది. ఇలాంటి కాన్సెప్ట్ ఇప్పటివరకు ఇండియన్ సినిమాలో రాలేదు. అది సైకలాజికల్ హారర్ ఈ సినిమా మిమ్మల్ని వెంటాడుతుంది. ఇది అందరికీ చెప్పాల్సిన కథ. సినిమా ఒకరి జీవితాన్ని మార్చలేదు, అలాగే సందేశాన్ని కూడా ఇవ్వలేదు. కానీ ఒక తప్పు జరుగుతున్నప్పుడు దాన్ని టార్చ్ వేసి చూపించగలదు. నేను కూడా అదే చేశానని నమ్ముతున్నాను. ఇంటర్నేషనల్ క్వాలిటీతో చేశాం. ఈ సినిమాకి ప్రేక్షకులు ఊపిరి పోయాలని కోరుకుంటున్నాను. ఫిబ్రవరి 6వ తేదీన సినిమా విడుదల అవుతోంది అని అని అన్నారు.హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ ఇది మౌత్ టాక్ తో నిలబడే సినిమా. ఫిబ్రవరి 6న ఒకసారి థియేటర్ కి రండి. ఇది థియేటర్ కి చాలా బాగుంటుంది. దివి చాలా అద్భుతమైన నటి. తను తప్పకుండా పెద్ద స్టార్ అవుతుంది. దివ్య కూడా చాలా చక్కగా నటించింది. ఇది ఆలోచన రేకెత్తించే సినిమా. డివోపి మ్యూజిక్ డైరెక్టర్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. ఇందులో ఉన్న పాప కూడా చాలా చక్కగా నటించింది. మట్కా సినిమా సమయంలో కరుణ కుమార్ తో చాలా దగ్గర అయ్యాను. ఈ కథకు ఆయన నన్ను ఎంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను. ఈ సమాజంలో ఆశ కోసం ప్రజలు ఏవేవో చేస్తున్నారు. ఇందులో ఒక డార్క్ సొసైటీని చూపించాము. ఈ సినిమా షూటింగ్లో ఒక సంఘటన జరిగింది. ఈ క్యారెక్టర్ ప్రభావం వల్ల ఒక వ్యక్తితో నేను దురుసుగా ప్రవర్తించాను. ఆ క్యారెక్టర్ అలా ప్రవర్తించింది. తప్పకుండా ఫిబ్రవరి 6న ఈ సినిమాని అందరూ థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ ఈవెంట్ లో నటుడు రాజా రవీంద్ర, హీరోయిన్ దివి, హీరోయిన్ దివ్య పిళ్లై పాల్గొన్నారు.

## బరాబర్ ప్రేమిస్తా’తో చంద్రహాస్‌కు మంచి బ్రేక్



ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ హీరోగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం ‘బరాబర్ ప్రేమిస్తా’. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ (‘ఇష్టంగా‘ ఫేమ్) ప్రతినాయకుడిగా నటించారు. ఈ మూవీని ఫిబ్రవరి 6న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు జయంత్ సి పరాన్జీ, జేడీ చక్రవర్తి, ఆది సాయి కుమార్ వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో హీరో చంద్రహాస్ మాట్లాడుతూ .. ‘జయంత్ తీసిన ‘తీన్ మార్’, ‘శంకర్ దాదా’ చిత్రాలంటే నాకు చాలా ఇష్టం. ఆది అన్న అద్భుతమైన కమ్ బ్యాక్ ఇచ్చారు. ఆది అన్నే నాకు స్ఫూర్తి. జేడీ చక్రవర్తి అప్పటికీ ఇప్పటికీ ఒకేలా ఉన్నారు. నాకోసం ఇంత మంది రావడం ఆనందంగా ఉంది. ఫిబ్రవరి 6న మా చిత్రాన్ని చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు.ఆది సాయి కుమార్ మాట్లాడుతూ .. ‘ప్రభాకర్ అన్నతో నేను ‘నెక్స్ట్ నువ్వే’ మూవీని చేశాను. అప్పుడు నాకు చంద్రహాస్ గురించి ఎక్కువగా చెబుతుండే వారు. చంద్రహాస్ పడే కష్టాన్ని చూస్తున్నాను. ఎంతో నిజాయితీగా కష్టపడుతున్నాడు. చంద్రహాస్ మంచి హిట్టు కొట్టాలని అనుకుంటున్నాను. ‘బరాబర్ ప్రేమిస్తా’ సినిమాతో చంద్రహాస్‌కు మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నాను అని అ న్నారు. జయంత్ సి పరాన్జీ మా ట్లాడుతూ ‘‘బరాబర్ ప్రేమి స్తా’ అనే టైటిల్ లో నే యాటిట్యూడ కా న్ఫిడెన్స్, పొగరు ఉంది. మన చంద్రహాస్ ఆటిట్యూడ్ స్టార్. చంద్రహాస్ మంచి సింగర్ కూడా. మేఘన లోనూ మంచి ఎనర్జీ, ఆటిట్యూడ్ ఉంది. జేడీ చక్రవర్తి మాట్లాడుతూ .. ‘చంద్రహాస్ ఏం చేసినా జనాల్ని అట్రాక్ట్ చేస్తుంటాడు. కానిస్టేబుల్‌గా ప్రభాకర్ తన జీవితం ప్రారంభించి.. బుల్లితెరపై స్టార్‌గా ఎదిగాడు.టీం అందరికీ ఆల్ ది బెస్ట్. ఫిబ్రవరి 6న ఈ సినిమాని అం దరూ చూడండి’ అని అన్నారు. నిర్మాత ప్రభాకర్, సంపత్ రుద్ర, మేఘన ముఖర్జీ, నటుడు అర్జున్ మ హీ, పూజా బేడి , నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి , మ్యూజిక్ డైరెక్టర్ ధృవన్ పాల్గొన్నారు.

## 100 మిలియన్ ప్లస్ తో ‘శంబాల’




ఆది సాయికుమార్ నటించిన సూపర్ హిట్ మూవీ ’శంబాల’ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు వచ్చి అద్భుత ఆదరణ సొంతం చేసుకుంటోంది. గత నెల 22వ తేదీ నుంచి ఆహాలో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమా 100 మిలియన్ మినిట్స్ ప్లస్ వ్యూయర్ షిప్ తో బ్లాక్ బస్టర్ సక్సెస్ దక్కించుకుంటోంది. గతేడాది డిసెంబర్ 25న ’శంబాల’ సినిమా మిస్టికల్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో ప్రేక్షకులు ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని దర్శకుడు యుగంధర్ ముని రూపొందించారు. అర్చన ఐయ్యర్ హీరోయిన్ గా నటించింది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ఈ మూవీని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీకి ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాల ఆర్ఆర్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. థియేటర్స్ లో సాధించిన విజయాన్ని మరిపించేలా ఆహా ఓటీటీలో శంబాల సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తుండటం విశేషం అని నిర్మాతల్లో ఒకరైన మహీధర్ రెడ్డి చెప్పారు



## ఐక్యంగా నిలుద్దాం...

# మతోన్మాద శక్తులను తరిమికొడదాం

**సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపు**

**డిఎంకె ఫ్రంట్‌ను ఏశక్తీ విడదీయలేదు: స్టాలిన్**

**చెన్నైలో ఘనంగా సిపిఐ శతాబ్ది సభ**



**చెన్నై:** కేంద్రంలో అధికారం చలాయిస్తున్న మతోన్మాద శక్తులతో దేశ ఐక్యతకు విఘాతం కలుగుతోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద శక్తులపై పోరాటానికి దేశవ్యాప్తంగా లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. చెన్నైలో ఆదివారం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల శక్తివంతమైన సమ్మేళనానికి వేదికైంది. సభకు పెద్ద ఎత్తున సిపిఐ శ్రేణులతోపాటు తమిళనాట డిఎంకె నేతృత్వంలోని అధికార కూటమి పక్షాల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సభనుద్దేశించి రాజా మాట్లాడుతూ... సిపిఐ 100 సంవత్సరాలు అంటే ప్రజల కోసం రాజీలేని పోరాటాల 100 సంవత్సరాలని పేర్కొన్నారు. ఎర్రజెండా నూతన శక్తి, ఐక్యత, విశ్వాసంతో ముందుకు సాగుతోందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తొత్తుగా మారిందని దుయ్యబట్టారు. బిజెపి ఫాసిస్టు విధానాలపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య తర్వాత దేశ ప్రజల కోసం రాజకీయపార్టీగా సిపిఐ ఉద్యమాలు, పోరాటాలను ప్రస్తావించారు. డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ మాట్లాడుతూ... తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ఫ్రంట్ ఐక్యతను ఏ శక్తి విచ్ఛిన్నం చేయలేదని, ఫాసిజాన్ని ఓడించడానికి, నిరంకుశ పాలనను కూల్చివేసి, భారతదేశాన్ని, ఆత్మగౌరవనీయ తమిళనాడును రక్షించడానికి ఈ రాజకీయ ఫ్రంట్‌కు మాత్రమే శక్తి ఉందన్నారు. తాను నాయకత్వం వహించే కూటమి ఎన్నికల అంకగణితంలో కాకుండా ఉమ్మడి ఆదర్శాలలో పాతుకుపోయిందన్నారు. కూటమి పక్షాలు కులతత్వం, మతతత్వం, మెజారిటీవాదం, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలుస్తాయి కాబట్టి ప్రజాస్వామ్య శక్తుల మధ్య స్నేహం ఎన్నికను అధిగమిస్తుందని పునరుద్ఘాటించారు. ద్రవిడ ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం ప్రజలందరికీ అన్నీ లభించేలా చూసుకోవడం అనే ఉమ్మడి లక్ష్యాన్ని పంచుకుంటాయి కనుక డిఎంకె జెండాలో సగం ఎరుపు రంగులో ఉందని స్టాలిన్ అన్నారు. ‘మన రాజకీయ విధానాలలో చిన్న భేదాలు ఉన్నప్పటికీ, మన ఉమ్మడి లక్ష్యం సమతావాద సమాజాన్ని సృష్టించడం’ అన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు రామకష్ణ పాండా, డికె అధ్యక్షుడు కె.వీరమణి, సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్, సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, టిఎన్‌సిసి అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై, విసికె అధ్యక్షుడు తోల్. తిరుమావలవన్, ఎండిఎంకె ప్రధాన కార్యదర్శి వైకో, ఎంఎంకే నాయకుడు ఎం.హెచ్.జవహిరుల్లా, సిపిఐ ఎంపి కె.సుబ్బరాయన్ తదితరులు ప్రసంగించారు.

## ఇక 2 గంటలే (మొదటి పేజీ తరువాయి)

సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు ఇతర ఉన్నతాధికారులు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి హాజరయ్యారు. మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 200914 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సగటున ఏడాదికి కేవలం రూ.886 కోట్లు మాత్రమే రైల్వే బడ్జెట్‌గా కేటాయించారని గుర్తు చేశారు. దానితో పోలిస్తే ప్రస్తుతం తెలంగాణకు దాదాపు ఆరు రెట్లు అధికంగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రూ.47,984 కోట్ల విలువైన రైల్వే మౌలిక వసతుల ప్రాజెక్టులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని మంత్రి చెప్పారు. అలాగే రాష్ట్రంలోని రైల్వే నెట్‌వర్క్ పూర్తిగా (100 శాతం) విద్యుదీకరణ పూర్తయిందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, వాటిలో మూడు హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే లేదా ముగిసేలా ఉంటాయని మంత్రి తెలిపారు. హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌పుణె హైస్పీడ్ రైలు కారిడార్లు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఈ కారిడార్లతో హైదరాబాద్ బెంగళూరు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు, హైదరాబాద్ చెన్నై 2 గంటల 55 నిమిషాలకు, హైదరాబాద్ పుణె 1 గంట 55 నిమిషాలకు తగ్గనుందని వివరించారు. ఈ మూడు మార్గాలు త్రిభుజాకార ఆర్థిక కారిడార్‌గా రూపుదిద్దుకుని విద్య, వైద్యం, వ్యాపారం, పరిశ్రమల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. రైల్వే రంగంలో ఈ భారీ పెట్టుబడులు తెలంగాణను అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, ఆర్థిక కేంద్రంగా మరింత బలోపేతం చేస్తాయని మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

## మార్పు చూపించాం

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థికరంగంలో పెను సంక్షోభమని ఈ పరిస్థితుల్లో ఉండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కోమెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్ధవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ అండ్ పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్ఓ జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్ , జాయింట్ డైరెక్టర్ రమణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నిజమో కాదో తేల్చుకుంటాం

**(మొదటి పేజీ తరువాయి)** ప్రయాణ దూరంలోనే ఇవన్నీ ఉన్నాయని కూడా ఆయన చెప్పారని ఎన్‌బిసి న్యూస్ వెల్లడించింది. గత ఏడాది తొలి అర్థభాగంలో ఇరాన్–అమెరికా మధ్య అణు చర్చలు జరిగాయి. ఐదు విడతల చర్చల్లో ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ‘ఖమేనీ అలాగే మాట్లాడతారు, వారితో ఒప్పందం కుదురుతుందని మేం ఆశాభావంతో ఉన్నాం, రాబోయే కొన్ని గంటల్లోనే ఈ వ్యవహారం తేలిపోతుంది, ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఖమేనీ చెప్పిన విషయం (ఇరాన్‌పై దాడి ప్రాంతీయ యుద్ధంగా మారుతుందిఅనే విషయం) నిజమో కాదో తేల్చుకుంటాం’’ అన్నారు. ముందురోజు ఆదివారం ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరీఘ్చి సిఎన్ఎన్‌తో మాట్లాడుతూ, అమెరికా–ఇరాన్ మధ్య ఒక ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావం ప్రకటించారు. ఇరాన్‌లో అనేక వారాలపాటు అంతర్గత సంక్షోభం తర్వాత దేశంలో స్థిరత్వం ఏర్పడిందనే సంకేతాలు పంపించేందుకు చాలా రోజుల తర్వాత ఖమేనీ మొదటిసారి ఆదివారంనాడు బాహ్య ప్రపంచానికి కనిపించారు.‘ఇరాన్‌పై దాడికి ట్రంప్ ఆదేశాలు జారీ చేస్తే తాము ముందుగా ఇజ్రాయెల్‌పై దాడి చేస్తాం, పశ్చిమ ఆసియాలో ఉన్న అమెరికా సైనిక ఆస్తులు,స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడతాం’ అని ఖమేనీ పేర్కొన్నారు. ఈసారి అమెరికా యుద్ధం ప్రారంభిస్తే అది ప్రాంతీయ యుద్ధంగా మారుతుందని అమెరికన్లకు బాగా తెలుసు’ అని ఖమేనీ చాలా అరుదైన హెచ్చరిక చేశారు. ఈ పరిస్థితులమధ్య హోర్ముజ్ జలసంధి వద్ద ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రత్యక్ష సైనిక, కాల్పుల విన్యాసాలు చేస్తాయని ప్రకటించారు.

**ఇయు దౌత్యవేత్తకు ఇరాన్ నిరసన :** ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)ని ఉగ్రవాద సంస్థగా పేర్కొంటూ యూరోపియన్ యూనియన్ తీర్మానం చేయడాన్ని ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరాన్ ప్రభుత్వం సోమవారం టెహ్రాన్‌లో ఉన్న యూరోపియన్ దౌత్యవేత్తను పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసింది. గతవారం యూరోపియన్ యూనియన్ ఐఆర్‌జిసిపై ఉగ్రవాద సంస్థ ముద్ర వేసేందుకు అంగీకరించింది. అమెరికా, కెనడాలు ఇప్పటికే ఐఆర్‌జిసిపై ఉగ్రవాద ముద్ర వేశాయి. ఇరాన్‌పై పాశ్చాత్య దేశాలు ఆర్థిక,సైనిక ఆంక్షలతో సమస్యలు సృష్టిస్తున్నాయి. ఇప్పుడు ఉగ్రవాద ముద్ర సైన్యంపై కూడా వేశాయి. దుబాయ్‌లో ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ దౌత్యవేత్త ఇస్మాయిల్ బఘాయ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, యూరప్ దేశాల దౌత్యవేత్తలను ఒక్కొక్కరినీ పిలిపించి తమ నిరసన తెలియజేయడం ప్రారంభించామన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com